# మాతృభాషే న్యాయం

మాతృభాష పై హైకోర్టు తీర్పు

(తెలుగు అనువాదం)




నందివెలుగు ముక్తేశ్వరరావు ఐ.ఏ.ఎస్(విశ్రాంత)

*Every truth passes through three stages*
*before it is recognized*
*Ridicule, Opposition and Accepted as self-evident*

***-Schopenhauer***

ప్రతి సత్యమూ తాను గుర్తింపు పొందే ముందు
మూడు దశలు దాటుతుంది
అవహేళన, వ్యతిరేకత, ఆమోదము

**-షోపెన్‌హూవర్**

# మాతృభాషే న్యాయం

## మాతృభాష పై హైకోర్టు తీర్పు
## (తెలుగు అనువాదం)




నందివెలుగు ముక్తేశ్వరరావు ఐ.ఏ.ఎస్(విశ్రాంత)

# మాతృభాషే న్యాయం

## మాతృభాషపై హైకోర్టు తీర్పు . . . . .

*తెలుగు అనువాదం*


ప్రచురణ కాలం : 2020

© : రచయిత

వెల : అమూల్యం

ప్రతులకు : **పరవస్తు పద్యపీఠం**
ఇం.నెం. 9-39-5, త్రిమూర్తి నిలయం
ఫ్లాట్ నెంబర్-30, పిఠాపురం కాలనీ,
విశాఖపట్నం.
సెల్ : 94406 82323, 94948 22323

**నందివెలుగు ముక్తేశ్వరరావు,** విశ్రాంత ఐ.ఏ.ఎస్
హరిణి టవర్స్, టాటానగర్,
హెడ్ పోస్టాఫీస్ దగ్గర,
తిరుపతి-517 501
చిత్తూరు జిల్లా -ఆంధ్రప్రదేశ్
సెల్ : 94191428078

కవర్ ఆర్ట్ : కూరెళ్ల శ్రీనివాస్

టైప్ సెట్టింగ్ : ఎస్. శ్రీనివాస్, సెల్ : 9491799847

ముద్రణ : **సాయిలిఖిత ప్రింటర్స్,**
ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004

# అంకితం

మాతృభాష అనేది
కేవల భావోద్వేగం కాదని
ప్రజలకు శ్వాసంత నిత్యావసరమని
సమాజాన్ని నడిపించే ఇంధనమని
నమ్మకాన్ని నిలబెడ్తున్న -

తల్లిదండ్రులకు
ఉపాధ్యాయులకు
భాషా ప్రేమికులకు
విధాన రూపకర్తలకు
న్యాయకోవిదులకు
న్యాయమూర్తులకు

కైమోడ్పులు

# కృతజ్ఞతలు

ఈ గ్రంథాన్ని ఆసాంతం చదివి ఆప్త వాక్యం రూపంలో యోగ్యతా పత్రాన్ని అందించిన వేదాంతం సీతారామావధాని, (విశ్రాంత సెక్రటరీ జనరల్, భారత సుప్రీంకోర్టు) గారికి కైమోడ్పులు. భాషా సంస్కృతుల పరిరక్షణ విషయంలో మాటలకు, ఆ వెంబడే చేతలకు ప్రాధాన్యమిచ్చే మాన్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. వికాసమా! వినాశమా! పేరుతో వారు ఈ గ్రంథానికి ముందుమాట రాసిచ్చారు. వారికి కృతజ్ఞతలు.

అచ్చంగా అచ్చుపడి పుస్తకంగా మీ అందరి చేతుల్లోకి రావడానికి కారణభూతమైన, తెలుగును ప్రాణప్రదంగా ప్రేమించే, తెలుగు కోసం నిరంతరం ఉద్యమించే శ్రీ పరవస్తు ఫణి శయన సూరి గారి ఔదార్యానికి కృతజ్ఞతలు.

లోతైన భావాన్ని వ్యక్తీకరించే ముఖచిత్రాన్ని అందంగా ఆలోచనాత్మకంగా అందించినవాడు ప్రసిద్ధ చిత్రకారుడు శ్రీకూరెళ్ళ శ్రీనివాస్. గ్రంథాన్ని సహనంతో చక్కగా టైప్ సెట్టింగ్ చేసి ఇచ్చినవాడు ఎస్. శ్రీనివాస్.

ఈ శ్రీనివాస ద్వయానికి ఆశీః పూర్వక కృతజ్ఞతలు.

## వికాసమా! వినాశమా!

**ఒకసారి కొన్ని చేపలు వరద నీటిలో ఎగిరెగిరి పడుతున్నాయి. గట్టున ఉండి వాటిని చూసిన ఒక పిల్లకోతి అవి నీటిలో పడి మునిగి పోతున్నాయి అని భావించి ఒక్కొక్క దాన్ని పట్టుకొని ఒడ్డున పడవేస్తోంది. ఒక ముసలికోతి వచ్చి "ఏమి చేస్తున్నావు?" అని అడిగింది. జల సమాధి అయిపోతున్న చేపలను రక్షిస్తున్నాను అన్నది పిల్లకోతి. ఇది రక్షణా! అపకారమా!**

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగము, బోధన మాధ్యమము మొదలైన వాటి పరిస్థితి గమనిస్తుంటే పై కథ గుర్తుకొస్తోంది. ముందుచూపు దార్శనికత లేకుండా విధాన కర్తలు తీసుకుంటున్న నిర్ణయాలు భాషకు, విద్యార్థి పురోగతికి, మానసిక వికాసానికి గొడ్డలిపెట్టులా మారాయి.

ఈ మధ్యకాలంలో బోధన రంగంలో వస్తున్న మార్పులు విచారాన్ని, విషాదాన్ని కలిగిస్తున్నాయి.

ముఖ్యంగా భాష విషయంలో నేడు జరుగుతున్న అన్యాయం ఇంతా అంతా కాదు.

మాతృభాషకు ఇటువంటి గడ్డు పరిస్థితులు వస్తాయని కలలో కూడా ఊహించలేకపోయాం!

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు బాలలు వారి మాతృభాషలో చదువుకో డానికి నోచుకోవడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లో మైనారిటీలైన ప్రజలు వారి వారి భాషలలో చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు గాని తెలుగు విద్యార్థి మాత్రం తెలుగులో చదువుకోవడానికి అవకాశం లేదు. ఎంత దుర్భరమైన పరిస్థితి ఇది!

ఈ నేపథ్యంలో ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమంగా ఇంగ్లీష్ మాత్రమే ఉండటం సరికాదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పునివ్వడం ముదావహం. బోధన మాధ్యమం గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 85 చెల్లదని చెబుతూ హైకోర్టు విస్తృతమైన తీర్పును వెలువరించింది. ఇందులో ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు ఏది బోధన మాధ్యమంగా ఉండాలి అనే విషయంపై లోతయిన చర్చ జరిగింది. చారిత్రిక ఆధారాలను ఉటంకించారు. మేధావుల అభిప్రాయాలను ఉదాహరించారు. అనేక తర్క వితర్కాల తర్వాత తీర్పు వెలువడింది.

ఇదొక చారిత్రాత్మకమైన తీర్పు. తెలుగు సమాజంలోని అన్ని వర్గాల వారు దీనిని చదివి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ అవసరాన్ని గుర్తించి మాజీ ఐఏఎస్ అధికారి శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు గారు ఈ తీర్పును తెలుగులోకి అనువదించడానికి పూనుకున్నారు. ఇది తెలుగు భాష అభిమానులందరికీ సంతోషం కలిగించే విషయం.

న్యాయశాస్త్ర పరి భాషలతో నిండి ఉన్న దాదాపు వంద పేజీల గ్రంథాన్ని తెలుగులోకి అనువదించడం అంత సులభమైన పని ఏమీ కాదు. ఆయా పదాల వెనుక ఉన్న స్ఫూర్తి తెలుగులో అందేలా చేయడానికి శ్రీ ముక్తేశ్వరరావు గారు చాలా శ్రమించారు. సరి అయిన పరిభాష దొరకనప్పుడు సొంతంగానే పదబంధాలను సృష్టించారు. ఇది ఎంత శాస్త్రీయమైన విషయం అయినా అనువాదం తేట తెలుగులో ఉండడానికి, జనరంజకంగా ఉండటానికి ప్రయత్నించారు. వారి కృషిని నేను అభినందిస్తున్నాను.

ఆంధ్రుల గురించి యంగ్ ఇండియా పత్రికలో మహాత్మాగాంధీ గారు ఇలా రాశారు.

"ఆంధ్రదేశానికి అంతులేని అవకాశాలు ఉన్నాయి. అక్కడ వీర్య వంతులైన మనుషులు ఉన్నారు. ఆంధ్రులకు ఉండకూడనంత ఔదార్యం ఉంది. మిమ్మల్ని సరిగా నడిపించేవారు ఉంటే మీరు ఎంతటి ఆశ్చర్యకర త్యాగాలు అయినా చేయగలరు. ప్రశ్నించడానికి వీలు లేని ధైర్యం మీది. కానీ విమర్శ అవసరమైన చోట్ల విమర్శించడానికి జంకుతున్నారు. సందేహిస్తున్నారు. ప్రతి తప్పును ఏదో ఒక విధంగా కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ తప్పులను గురించి నేను మీకు తెలియజెప్పి వాటిని మీరు మీ శక్తికొద్దీ తొలగించుకోవాలని ప్రబోధించకుంటే నేను మీ పట్ల అపచారం చేసినవాడిని అవుతాను."

**25-4-1929** లో గాంధీ గారు చెప్పిన ఈ మాటలు నేటి తెలుగు వారికి కూడా అక్షరాక్షరమూ వర్తిస్తాయి. పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు? అని సందేహించే వారే తప్ప ముందుకు అడుగేసే వారు కరవయ్యారు.

ఐఏఎస్ అధికారిగా ప్రజల మన్ననలు పొందిన నందివెలుగు ముక్తేశ్వరరావు గారు బహుభాషావేత్త. అధికారంలో ఉన్నప్పుడు, పదవీ విరమణ చేసిన తర్వాత కూడా భాష బాగోగుల గురించి ఆయన పట్టించుకుంటూనే ఉన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు పాలనా భాషగా తెలుగు అనే అంశంపై కృషి చేసి పరిపాలనలో తెలుగు భాషను సమర్థంగా అమలు చేయవచ్చు అని నిరూపించారు ఆయన.

ఇప్పుడు మాతృ భాష విషయంలో చాప కింద నీరులా వ్యాపిస్తున్న ఈ ఉపద్రవాన్ని ఉదాసీనంగా చూస్తూ ఉండలేక సమాజంలోని భిన్న వర్గాల వారిని జాగృతం చేయడం కోసం నడుంబిగించారు.

ఈ ఏడాది మొదట్లో తెలుగు తక్కువ ప్రపంచంలో అనే ఉపశీర్షికతో ఒక తెలుగు కథ అనే పుస్తకాన్ని రచించారు. పాలకులు పాలితులు మేధావులు విధాన కర్తలు తప్పక చదువవలసిన గ్రంథం ఇది. మనం పర్యావరణాన్ని గురించి బాధపడుతున్నట్లే భాషా వరణాన్ని గురించి కూడా పట్టించుకోవాలని ఆయన అంటారు. ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టినంతమాత్రాన ఆ భాషలో వ్యవహార దక్షత, నైపుణ్యం, పాండిత్యం వస్తాయి అనుకోవడం అపోహ అని ముక్తేశ్వర రావుగారు గట్టిగా చెప్పారు. సమర్థులైన ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఆ భాష బోధిస్తే విద్యార్థి చక్కటి ఇంగ్లీష్ నేర్చుకోగలడని అంటారు ఆయన. అందువల్ల రోగ మూలం తెలుసుకొని చికిత్స చేయాలి తప్ప ఇంకో రకంగా ప్రవర్తిస్తే ఫలితం రాదు అన్నది వారి అభిప్రాయం.

స్వాతంత్ర్యం వచ్చి 73 సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా మెకాలే విద్యా విధానాన్ని పారద్రోలలేకపోతున్నాం. దానికి వారసులుగా మాత్రమే బ్రతుకుతున్నాం. జాతీయోద్యమ, ఆంధ్రోద్యమ లక్ష్యాలు, చరిత్ర తెలిస్తే ఇటువంటి పనులకు పాల్పడం.

సర్వేపల్లి రాధాకృష్ణన్, రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ మొదలైన వారందరూ ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని కరాఖండిగా చెప్పారు. రాజ్యాంగ రచనలో ప్రధాన భూమిక వహించిన అంబేద్కర్ మరో అడుగు ముందుకు వేసి ఉన్నత విద్య కూడా మాతృభాషలోనే ఉండాలని చెప్పారు.

అందువల్ల మాతృభాష వికసించాలి, పరిమళించాలి అంటే కనీసం ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమంగా దానిని తప్పక అమలు పరచాలి. అది అటు పిల్లవాడికి ఇటు భాషకు మేలు చేస్తుంది.

ప్రముఖ చరిత్రకారుడు ఆర్నాల్ జె. టాయన్బీ "సవాలుకు ఎప్పుకటిప్పుడు సరియైన జవాబు చెప్పగల జాతులే తమ సభ్యతను, తమ సంస్కృతిని కాపాడుకోగలిగాయని, వారి చరిత్ర అవిచ్ఛిన్నంగా నిలచిందని, తక్కినవి సన్నగిల్లి నీరసించిపోయా"యని చెప్పారు. పరభాష, పర సంస్కృతి వ్యామోహంలో ప్రజలు ఉన్నారని వారి ఆకాంక్ష మేరకు వ్యవహరిస్తున్నామనేవారు ఇంకా జాతిని, సంస్కృతిని ఎలా కాపాడగలరు? మనది భాషాపూర్వకంగా ఏర్పడిన జాతి. భాష నశిస్తే జాతి నశిస్తుందన్న సత్యం తెలియనివారికి ఈ ఉన్నత న్యాయస్థాన తీర్పుద్వారానైనా కనువిప్పు కలగాలి.

జాతి భయం నుంచి విముక్తి పొందాలి. నిర్లిప్తత, జడత్వం వదిలించుకోవాలి.

దానికి ఒక కరదీపికగా ఈ చిన్న పుస్తకం పనికొస్తుంది. ఈ కరదీపిక వెలుగులో నెత్తురు మండే - శక్తులు నిండే సైనికుల్లాగా భాషా వరణాన్ని కాపాడుకోవడానికి ప్రజలు ముందుకు సాగాలి.

ప్రజలలో శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావుగారి గ్రంథాలు ఆ స్ఫూర్తిని నింపుతాయి అని విశ్వసిస్తున్నాను.

**మండలి బుద్ధ ప్రసాద్**
అధ్యక్షుడు, మండలి ఫౌండేషన్,
గాంధీక్షేత్రం, అవనిగడ్డ-521 121
కృష్ణజిల్లా, ఆంధ్రప్రదేశ్.

# ఆప్తవాక్యం

వ్యక్తులూ, వ్యవస్థలమధ్య సాన్నిహిత్యం పెరగడానికీ, సులువైన సమాచార మార్పిడికీ వారధి మాతృభాష. ప్రాథమిక విద్యనుండీ మాతృభాషలో విద్యాబోధన జరగాలనే ఆశయానికి చారిత్రక నేపథ్యం వుంది. కాగా కోర్టుల్లో వినియోగించే భాషపై చర్చోపచర్చలూ, వాదోప వాదాలు కొంతకాలంగా ఊపందుకున్నప్పటికీ, ఇది ఉద్యమ రూపం దాల్చకపోవటం విచారకరం. కారణాలేవైనా ఉత్తర భారతంలో కోర్టులు హిందీని, ఇతర ప్రాంతీయ భాషల్నీ కోర్టుల భాషగా వాడుతున్నా, ఇప్పటికీ ఇంగ్లీషు భాషే పెత్తనం చెలాయిస్తూంది. మన రాష్ట్రంలో తెలుగును కోర్టు భాషగా అమలు చేయటం జరగలేదు. సివిలు, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లు, ప్రాంతీయ భాషను కోర్టు భాషగా వాడాలని నిర్దేశించాయి. కాగా మాతృభాషకూ, రాష్ట్రం అమలు చేయాల్సిన అధికార భాషకూ రాజ్యాంగమే గుర్తింపునిచ్చింది. 1962లోనే కోర్టు కార్యకలాపాల్లో తెలుగును అమలు చేయాలని నిర్దేశించిన ప్రభుత్వ ఉత్తర్వులు అటకెక్కాయి. తెలుగు టైపుమిషన్లూ, స్టెనోగ్రాఫర్లూ సమకూరకపోవ టంతోపాటు, తెలుగులో న్యాయగ్రంథాలూ, ప్రామాణిక న్యాయ పదకోశాలూ, నిఘంటువులూ కొరవడటంతో తెలుగు అమలు కల సాకారంకాలేదు. న్యాయవ్యవస్థ పనితీరునూ, తీర్పులోని నాణ్యతనూ బేరీజు వేయటానికీ, కక్షిదారులు న్యాయప్రక్రియలో సంకోచం లేకుండా పాల్గొనేందుకూ భాష అడ్డంకిగా మారింది. కక్షిదారుడికీ, కోర్టు వ్యవస్థకూ మధ్య కనిపించని అడ్డుగోడ భాషాసమస్యేకావటం శోచనీయం. తన భాష నుండి వాదన పరాయి

భాషలోకి తర్జుమా జరిగి తన వ్యాజ్యప్రక్రియ తనకే అర్థంకానిరీతిలో కొనసాగిపోవటం, కోర్టు విచారణా తతంగంలో కక్షిదారుడు ప్రేక్షకపాత్ర పోషించటం ఏతరహా పారదర్శకతకు సంకేతం!

ఇదిలా వుండగా మరోవైపు విద్యాబోధనలో మాతృభాషా మాధ్యమంపై ముప్పేటదాడి మొదలైంది. తెలుగుపుట్టి ముంచేందుకు భాషకు రాజకీయపు రంగులద్దటం వంటి ప్రారబ్ధాలు చోటు చేసు కున్నాయి. జీవితంలో ఉన్నతస్థాయినందుకోవాలంటే ఆంగ్లం తప్పనిసరనే క్రొత్తనినాదం తలెత్తింది. చివరకు ఏ భాషామాధ్యమంలో విద్యాబోధన జరగాలోకూడా కోర్టులే నిర్ణయించాల్సిన పరిస్థితి రావటం విచారకర పరిణామం. మాతృభాషను వృద్ధిపరచి సుసంపన్నంచేసి, తరాల వెంబడి వారసత్వ సంపదగా అందించాల్సిందిపోయి, అక్షరాల్ని క్షయం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని పర్యవసానంగా భావదాస్యం, భాషాదారిద్ర్యం దాపురించగలవని భాషా నిపుణులూ సామాజిక కార్యకర్తలూ హెచ్చరిస్తున్నారు. ఒక ఉద్వేగపూరిత, సాంస్కృతిక అనుబంధాన్ని రాబోయేతరాలకు దూరం చేసే అధికారిక యత్నాలకు న్యాయవ్యవస్థ అడ్డుకట్ట వేయటం ఆహ్వానించదగిన పరిణామం. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పును తెలుగులోకి సరళీయంగా అనువదించిన మాన్యశ్రీ ముక్తేశ్వరరావుగారి ప్రయత్నం విజయవంతమయ్యింది.

ఇటీవల భారత సుప్రీంకోర్టు తన తీర్పులను తెలుగుతో సహా వివిధ ప్రాంతీయభాషల్లోకి తర్జుమా చేసి, అధికారిక వెబ్‌సైట్‌లో పదిలపరుస్తోంది. రాష్ట్రాల హైకోర్టులుకూడా ఈ దిశగా చర్యలు

చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించాయి. ఉత్తరభారతంలో ఇప్పటికే ఈ ప్రయత్నాలు సఫలమైనాయి.

పాఠశాలల్లో విద్యాబోధన మాతృభాషామాధ్యమంలోనే జరగాలన్న హైకోర్టు తన తీర్పులో అనేక రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, విద్యా విషయక అంశాలనూ, నేపథ్యాన్నీ, సవివరణ చేసింది. మాతృభాషా వ్యాప్తికి కృషి చేస్తున్నవారికి ఈ తీర్పు నిరంతర అధ్యయన గ్రంథం కాగలదు. తీర్పును తేటతెలుగులో, అసలు పాఠంలోని భావం, స్ఫూర్తి ఏమాత్రం సడలకుండా, సరళపదజాలంలో అనువదించి, చదువరులకందజేయటంలో శ్రీ ముక్తేశ్వరరావుగారు కృతకృత్యులైనారు. ఇదే స్ఫూర్తితో, వీరు దేశచరిత్రను మలుపుతిప్పిన మరికొన్ని చారిత్రాత్మక తీర్పులను కూడా తెలుగులోకి అనువదించి, తెలుగుజాతికి మేలు చేయగలరని ఆశించటం అత్యాశకాదుకదా!

**-వేదాంతం సీతారామావధాని**

విశ్రాంత సెక్రటరీ జనరల్
భారత సుప్రీంకోర్టు

హైదరాబాదు
రామాలయ నిర్మాణ పర్వదినం

## ఇప్పటికైనా కళ్లు తెరుద్దాం. . . .

నా చిన్నప్పుడు ఒక పెద్దాయన అందరికీ ఓటు హక్కు ఎందుకు? అని వాదించేవాడు. చదువుకున్నవాళ్లకు అన్నీ తెలుస్తాయని, చదువుకోని వాళ్లకు ఏమీ తెలియవు అని ఆయన గోల. నిజమే! చదువుకున్నవాళ్ళకి పరిజ్ఞానం ఉంటుంది. కానీ, చదువుకోని వాళ్ళకి బోలెడంత జీవితానుభవం, సమాజంలో స్థితిగతులు, ఎత్తుపల్లాలు వాళ్ళకి చాలా సన్నిహితంగా తెలుస్తాయి అని నేను వాదించేవాడిని. ఎమర్జెన్సీ తరువాత ఎన్నికలు అయిన తరువాతి పరిణామాలు చూసి ఆయన "నువ్వే కరెక్టురా అబ్బాయి" అని చెప్పాడు.

మా రేపల్లెలో ఇంకొక ఆయన ఉండేవాడు. ఆడవాళ్లకు, మగవాళ్లకు కూలీ సమానంగా ఇవ్వాలనేది తప్పు అని వాదించేవాడు. "ఆడది చేసే పని "(ఆడది అనేది ఆయన మాట) మగవాడి పనికి చాలదు అని, అందువలన ఇద్దరికీ సమానంగా జీతం ఇవ్వడం అన్యాయం అనేది ఆయన వాదన. ఇల్లు అలకడం దగ్గరనుంచి, కట్టెలతో వంటా వార్పు చెయ్యడం దగ్గర్నుంచి, గొడ్డు గోదా, పిల్లా మేక లాంటి పనులన్నీ చూసేది ఆడవాళ్లే కదా అంటే, "అవును కదా" అనేవాడు. చాలా కాలం ఆడ పని ఆడ పనే, మగ పని మగపనే అని చెప్పి ఒక కొత్త సూత్రం మాట్లాడుతూ ఉండేవాడు. మొత్తం వ్యవసాయంలో 80 శాతం పని ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఆడవాళ్లే పాల్గొని నిర్వహిస్తారు అని ఆయన చూస్తూ ఉండగానే UNDP రిపోర్ట్ వచ్చింది. చాలా కాలం తరువాత కనబడి ఏమిటోరా నువ్వు అప్పుడు చెప్తే వినలేదు అని ఏడ్చినంత పని చేసాడు.

నేను హైదరాబాద్‌లో జేసీగా పని చేస్తున్నప్పుడు చైల్డ్ లేబర్‌ని గురించి ఒక టాస్క్ ఫోర్స్ ఉండేది. దాని పని చదువు మానిపించి పనిలో

పెట్టిన పిల్లల్ని తీసుకురావడం. నేరం కాబట్టి, తల్లితండ్రులపై కేసులు పెట్టడం. ముఖ్యంగా తల్లిదండ్రులు శ్రామికుల బస్తీ వాళ్ళు “కాస్త చేతికొచ్చిన పిల్లలు పనిలోకి వెళ్ళకపోతే ఇల్లెలాగా గడుస్తుంది?” అనే వాళ్ళు. వాళ్ళ కథ జాలిగొలిపేదిగా ఉండేది. అందుకని చట్టం మార్చ గలమా? వాళ్ళ ఆర్థిక పరిస్థితికోసం బ్యాంకుల నుండి రుణం లాంటివి ఇప్పించి ఆదుకుని పరిష్కరించేవాళ్ళం.

ఈ మూడు సందర్భాల్లో చట్టాలు చాలావరకు ప్రజలకు నచ్చలేదు. అలా నచ్చకపోవడానికి వాళ్ళ కారణాలు వాళ్ళకు ఉన్నాయి. కనీసం అవి కొంతవరకు హేతుబద్ధంగానే కనిపిస్తున్నాయి. మరి చట్టం చేసిన విధానకర్తలు, శాసనకర్తలు ఇలాంటి చట్టాలు ఎందుకు రూపొందించినట్టు? వాళ్లకు ప్రజల అవసరాల గురించి తెలియదా? తెలుసు! ఖచ్చితంగా తెలుసు!!

ఆ విధానకర్తలు సమస్యల లోతుపాతులను మరింత క్షుణ్ణంగా చూసిన తరువాత కొన్ని అభిప్రాయాలకు వచ్చారు. దేశం సమాజం భవిష్యత్తు కోసం - ఒకళ్ల మెప్పుకోసం కాకుండా - అలాంటి చట్టాలను రూపొందించారు. చట్టాల్లో ఒకటి సమాజ హితం, రెండు దేశ భవితవ్యం, మూడవది సత్యం, నాలుగవది సమానత్వం, ఐదవది వ్యక్తి గౌరవం, విశ్వాసం లాంటివి తూనికరాళ్ళుగా తీసుకుంటారు. అందువల్ల రాజ్యాంగాన్ని, చట్టాన్ని, వివిధ చట్టాల్లో నిబంధనల్ని మన ఇష్టాయిష్టాల కోణంలోంచి కాకుండా పై ప్రమాణాల ప్రకారం చూడాల్సిన అవసరం ఉంది. **అలా వచ్చిందే విద్యాహక్కు చట్టంలో మాతృభాషలో విద్యాబోధన అన్నది.**

దీనికి, చాలా పూర్వరంగం ఉంది. ప్రస్తుతానికి వస్తే విద్యా హక్కు చట్టం 29 వ సెక్షన్‌లో పాఠ్య ప్రణాళిక, మూల్యాంకనం ఎలా ఉండాలనేది మాట్లాడుతుంది. అది బాలకేంద్రకంగా బాలవికాసానికి దోహదపడుతూ ఒక పిల్లవాడు ఎలాంటి సంకోచాలు, ఆందోళనలు లేకుండా ఎలా ఎదగాలో చెప్తుంది. ఇలాంటి వాతావరణం మధ్యలో విద్యాబోధన సాధ్యమై నంతవరకు మాతృభాషలోనే ఉండాలని నిర్దిష్టంగా పేర్కొంటున్నది ఈ సెక్షను. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు విషయంలో కూడా ఇది చర్చకు వచ్చింది. మాతృభాష స్థానంలో ఇంగ్లీషును బోధన మాధ్యమంగా ప్రవేశపెడుతూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. బహుశా మారిన కాలమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ జీవో తీసుకొచ్చామని భావిస్తూ ఉండవచ్చు. చట్టానికి కూడా సవరణలు ప్రతిపాదించింది.

దీనికోసం జారీ చేసిన జీవోని అందులో ఉన్న ఉత్తర్వులని ఉన్నత న్యాయస్థానం ముందు పిటీషనర్లు ఈ సమస్యను ప్రశ్నించారు. ఆ సందర్భంలో ఉన్నత న్యాయస్థానం ఈ సమస్య మూలాల్లోకి వెళ్ళింది. ఈ సమస్యను చారిత్రక, చట్టపరమైన రాజ్యాంగపరమైన కోణాల నుంచి పరిశీలించింది. విద్యాతత్త్వవేత్తలు, తత్త్వవేత్తలు ఏమి చెప్పారో వివరించింది. వివిధ నివేదికలు ఏమి చెప్పాయో తేటతెల్లం చేసింది. మాతృభాష విషయంలో ఇంత సమగ్రంగా వచ్చిన తీర్పు, నా అవగాహనకు వచ్చినంత మేరకు, ఇంకొకటి లేదు. చట్టాలలోని సత్యాన్ని, స్ఫూర్తిని పరిచయం చెయ్యడానికి ఇందులో జరిగిన ప్రయత్నం ఈ విషయంలో ఒక పెద్ద మైలురాయి. ఇందులో జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయం ఏమి చెప్పింది లాంటి అంశాలు కూడా చర్చించబడ్డాయి. ఇవన్నీ అర్థం అయితేనే మనం సమస్యని సంపూర్ణంగా అర్థం చేసుకున్నట్టు. మంచి

ఉపాధ్యాయులం, మంచి తల్లితండ్రులం, మంచి పౌరులం, మంచి శాసన కర్తలం కావాలంటే ఇలాంటి విషయాల్లో విస్పష్టమైన అవగాహన అవసరం అన్నది నా అభిప్రాయం. ఇది ఇంగ్లీషులో ఉంటే చాలా మందికి తెలియదు. విద్యారంగంలో ఉన్నవాళ్లు కూడా ఇది చదవలేదు అని తెలుసుకుని చాలా బాధ అనిపించింది. దీన్ని అందరికీ అర్థమయ్యేట్లు తెలుగులోకి తెస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచనకి సాకారం ఈ అనువాదం. దీనిని

- తల్లితండ్రులుగా చదవండి, ఆలోచించండి.
- ఉపాధ్యాయులుగా చదవండి, అవగాహన పెంచుకోండి.
- విధానకర్తలుగా చదవండి, శాసన కర్తలుగా చదవండి.
- మీ ఆలోచనా విధానంలో దీనికి ఒక గుప్పెడు చోటు ఇవ్వండి.
- దీన్ని పౌరులుగా చదవండి.
- దేశ సౌభాగ్యం, సమాజాభివృద్ధి పెంపొందాలంటే, దేశ భాషల విషయంలో మన పెద్దలు ఏమాలోచించారో తెలుసుకోండి.

  చదివిన తరువాత. . . .

- మాతృభాషలో విజ్ఞాన సంపన్నమైన సమాజం ఎలా నిర్మించ బడిందో.
- ఆయా దేశాలతో ఈ విషయంతో మనమెలా పోటీ పడవచ్చో తరచి చూడండి.

న్యాయశాస్త్ర పరిభాషలు (Legal terms)అనివార్యంగా ఉంటాయి. దాని వలన కొంచం అక్కడక్కడా ఇబ్బంది పడొచ్చు. మొత్తమ్మీద ఈ తీర్పు హృదయం ఏమిటో దొరికిపోతుంది. ఉన్నత న్యాయస్థానం తీర్పుకు అక్షరాలా విశ్వాసపాత్రమైన అనువాదం ఇవ్వడానికి శ్రమించాను. ఇంగ్లీష్‌లో

సాధారణంగా వాక్యాలు కర్మణ్యర్థకాలు (Passive voice)లో ఉంటాయి. వాటిని తెలుగులో సులభంగా చదువుకోవడానికి వీలుగా కర్త్రర్థకంలోకి మార్చాను. ఎక్కడైనా తప్పులు ఉంటే ప్రమాదవశాత్తు వచ్చినవే. వాటిని పెద్ద మనసుతో మన్నించండి. ముందు ముందు సర్దుకునేందుకు నాకు ఎలాంటి సంకోచాలు లేవు.

ప్రతి పిల్లవాడు బడికి రావడం ఆరంభించినప్పుడు బడి అనేది కొత్త వాతావరణం. వాతావరణంలో అతను సహజంగా ఇమిడిపోవాలంటే తన ఇంటి దగ్గర్నుంచి తను వస్తూ వస్తూ భాషని తన అనుభవాన్ని బడికి తీసుకువస్తాడు. బళ్ళో కూడా అదే భాషలో ఉంటే అతనికి భయము బెరుకు లాంటివి లేకుండా ధైర్యంగా తాను అనుకున్నది చెప్పగలుగుతాడు. ఉపాధ్యాయులు చెప్పే జ్ఞానాన్ని నేర్చుకోగలుగుతాడు. తరగతి గదిలో చెప్పే ఉపాధ్యాయుడు, నేర్చుకునే పిల్లవాడు మధ్య జ్ఞాన ప్రసారం సహజంగా, సరళంగా జరుగుతుంది. ఆ వాతావరణంలో స్వేచ్ఛ, నిర్భయం ఆనందం కలగలిసిపోతాయి. ఇంట్లో అనుభవాన్ని భాషనీ బడికి, బడిలో జ్ఞానాన్ని ఇంటికి పిల్లవాడు తీసుకురాగలుగుతాడు. ఇది ఇలానే జరగాలి అంటే మాతృభాష అనివార్యం/తప్పనిసరి అని చట్టాన్ని రూపొందించినప్పుడు చట్టాల రూపకర్తల ఆంతర్యంలాగా కనపడుతోంది. ఈ విషయాన్ని ఉన్నత న్యాయస్థానం తీర్పు కూడా ప్రస్తావిస్తోంది.

ముగించే ముందు మీతో ఒక ఆప్త వాక్యాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. మనల్ని రెండు భావాలు చాలాకాలంగా రాజ్యమేలుతున్నాయి.

1. ఆధునిక ప్రపంచంలో ఇంగ్లీష్ రాకపోతే ఏ రంగంలోనూ పైకి రాలేరు.

2. ఇంగ్లీష్ బాగా రావాలంటే ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవాలి. ఇందులో మొదటి అంశం. అతిశయోక్తి ఎక్కువగా ఉన్న సత్యం. అదీ పాక్షికంగానే! పోనీ ఇంగ్లీష్ నేర్చుకుంటేనే మనకు గతి, పురోగతి అనేది సంపూర్ణ సత్యంగా తీసుకున్నా-ఇంగ్లీష్ రావాలంటే ఇంగ్లీష్ మీడియంలో చదువుకోవాలన్న రెండవ అంశం శుద్ధ తప్పు. ఆధునిక మూఢ నమ్మకం.

ఇంగ్లీష్ ఒక విదేశ భాష. ఏ విదేశ భాషనైనా నేర్చుకునేందుకు కొన్ని మౌలిక పద్ధతులు, శాస్త్రీయంగా రూపొందించబడ్డాయి. అందులో ఒక్కటీ మనం పాటించడం లేదని మనం సగర్వంగా చెప్పుకోవచ్చు. మన ఇంగ్లీష్ బోధన సత్యం చెప్పాలంటే అనువాద పద్ధతి! దీనివల్ల అస్సలు పలకడం రాదు. వినడం, పలకడం, చదవడం రానివాడికి అర్థం చేసుకోవడం రాదు. ఇక వ్యక్తీకరించడం ఎలా సాధ్యపడుతుంది? ఇప్పుడు బళ్ళలో ఇంగ్లీషుని ఇంగ్లీషుగా శాస్త్రీయంగా బోధించే కొద్దిమంది మంచి ఉపాధ్యాయులు ఉన్నారు. ఇది సత్యం. వాళ్ళకి వందల వందనాలు. మిగతా చాలా మంది ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు ఒక unseen passage ని ధారాళంగా చదవలేని వాళ్ళు కూడా ఉన్నారు. అందులో సెంట్రల్ ఐడియా తిరిగి సొంత మాటల్లో చెప్పలేరు. వార్త, వ్యాసం, లేఖా రచన రోల్ ప్లే లాంటి ప్రక్రియలతో మాటవరుసకుకూడా పరిచయం లేనివాళ్ళుఉన్నారు. A rainy night, Harvest times in my Village, the Teacher I liked most లాంటి సాధారణ జీవితాంశాల మీద చిట్టిపొట్టి మాటల్లో చెప్పమంటే చెప్పలేరు. మరి పిల్లలకు ఇంగ్లీష్ ఎలా వస్తుంది? నేను పైన పరిశీలించిన ఈ అంశాలు ఎంత వాస్తవమని ఒక పట్టుమని పది స్కూళ్ళు యధాలాపంగా ఎంచుకుని శాస్త్రీయంగా రూపొందించిన ప్రశ్నావళితో పరిశీలించుకోవచ్చు. ఇలాంటి అధ్యయనాలకు కావలసినది సత్య దృష్టి, శాస్త్రీయమైన పరీక్షా పద్ధతులు.

కాబట్టి, ఇప్పుడు మనం చెయ్యాల్సింది ఒకటవ తరగతి నుంచి ఇంగ్లీషును శాస్త్రీయ పద్ధతిలో సర్వ అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో చెప్పిస్తే ఇటు ఇంగ్లీషు వస్తుంది, ప్రాథమిక దశలో మాతృభాషలో అన్ని సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం వస్తుంది.

ఒకప్పుడు విద్యార్థులు SSLC చదివినప్పుడు తెలుగు మీడియంలోనే చదువుకున్నారు. వారందరూ కూడా ఇప్పటితరంకన్నా  చక్కటి ఇంగ్లీషు భాషా ప్రావీణ్యం సంపాదించారు. వారందరికీ తెలుగు మీడియంలో చదవడం వలన ఉద్యోగం రాలేదని, సమాజంలో గౌరవం లభించలేదని, ప్రపంచ స్థాయిలో నిలబడలేకపోయారని అనడానికి ఏమాత్రం రుజువులు ఉన్నాయా అంటే లేవనే చెప్పాలి.

నాకు ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే, మాతృభాషలోనే విజ్ఞానాన్ని నేర్పే చాలా దేశాల్లో ఇంగ్లీషుని ఒక సబ్జెక్టుగా బోధిస్తారు. మనకన్నా తక్కువ గంటలు కేటాయిస్తారు. అయినా అక్కడ ఉన్న పిల్లలు మనకన్నా చాలా రెట్లు నయంగా మన పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్న దానికన్నా చాలా చక్కగా ఇంగ్లీషు మాట్లాడతారు. ఇప్పుడు మనం మరమ్మత్తు చేసుకోవాల్సింది బడుల్లో ఇంగ్లీషు డిపార్ట్మెంట్ని. ఇదీ అసలు మూలకారణం, దీన్ని సరిచేస్తే - సమస్యే అంతరించినట్లు. ఇది సరిచెయ్యకపోతే వ్యాధి ఒకటి - చికిత్స ఒకటి అవుతుంది. ఒక్కోసారి, చికిత్సే వ్యాధికన్నా ప్రమాదకరం కావొచ్చు. (మెడికల్లీ ఇండ్యూస్డ్ మరణాలు పెరుగుతున్నాయని మెడికల్ జర్నల్సు పేర్కొంటున్నాయి)

ఈ తీర్పుని ఆసాంతం చదివి దాని హృదయాన్ని నిండు మనసుతో అర్థం చేసుకోండి. ఇది నా కోరిక! ప్రార్థన కూడా!!

**- ఎన్. ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్. (విశ్రాంత)**

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు : అమరావతి

## చీఫ్ జస్టిస్ జె.కె. మహేశ్వరి
## &
## జస్టిస్ నైనాల జయసూర్య

WRIT PETITION (PIL) No.183 of 2019

డా. శ్రీనివాస్ గుంటుపల్లి, S/o సాంబశివరావు,
వయసు 40 సంవత్సరాలు,
వృత్తి : అసిస్టెంట్ ప్రొఫెసర్. జనరల్ మెడిసిన్,
R/o F4 GRR బ్లాక్,
ASRAM మెడికల్ కాలేజీ క్యాంపస్, మల్కాపురం,
ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా 534005

... ఫిర్యాదుదారుడు

Versus

1. ప్రిన్సిపాల్ కార్యదర్శి ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పాఠశాల విద్యా శాఖ, వెలగపుడి వద్ద సచివాలయ భవనం, గుంటూరు జిల్లా.
2. ప్రధాన కార్యదర్శి ద్వారా, యూనియన్ ఆఫ్ ఇండియా, మానవ వనరుల మంత్రిత్వ శాఖ.
3. పాఠశాల విద్యా కమిషనర్, ఆంధ్రప్రదేశ్, అమరావతి.
4. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సర్వ శిక్షా అభియాన్, హై స్కూల్ రోడ్, పటమట, విజయవాడ.
5. డైరెక్టర్, SCERT, శ్రీ అంజనేయ టవర్స్, D.No. 7-104, బి-బ్లాక్, 2 వ అంతస్తు, విజయవాడ, మైలవరం రోడ్, ఎ.పి.

6. గుంటూరు జిల్లా ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తరపున జిల్లా కార్యదర్శి భట్రాజు చిత్రంజన్ దాస్.

7. గొర్రెముచ్చు వెంకట నరసింహారావు, S/o పెద్ద రామస్వామి, వయసు 42 సంవత్సరాలు, R/o. H.No. 77-54/1-15, ప్రకాష్ నగర్, విజయవాడ.

8. జి.సుధీర్ బాబు, S/o సోలోమన్, వయసు 39 సంవత్సరాలు, R/o. 6-1 / 5-21, వందనం వీధి, ఫ్రిజర్‌పేట్, చిట్టినగర్, విజయవాడ.

9. మద్దిరాల మల్లికార్జునరావు, S/o. బాలకోటయ్య, వయసు 48 సంవత్సరాలు, R/o. రావులకొల్లు గ్రామం, పొన్నలూరు మండలం, ప్రకాశం జిల్లా.

10. జి. మధుబాబు, S/o. జి.వెంకయ్య, వయసు 35 సంవత్సరాలు, R/o. D.No. 5-94, ప్రాతూరి గ్రామం, తాడేపల్లి మండలం, పోలకంపాడు, గుంటూరు జిల్లా.

11. శ్రీ ఎం. భాగ్యరావు, కార్యదర్శి, దళిత బహుజన్ ఫ్రంట్, S/o. వెంకటేశ్వరులు, వయసు 48 సంవత్సరాలు, 5/3,అరండల్‌పేట వద్ద కార్యాలయం, గుంటూరు జిల్లా.

12. శ్రీ ఎం.అజయ్ గౌతమ్, కార్యదర్శి, ఆది-హిందూ సోషల్ సర్వీస్ లీగ్, ప్రతినిధి. S/o. శ్రీ ఎం.బి.గౌతం, సుమారు 46 సంవత్సరాల వయస్సు, ఉద్యోగం : సోషల్ సర్వీస్, ఆది-హిందూ భవన్ కార్యాలయం, హైదరాబాద్ విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో.

13. శ్రీ కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, S/o. లేట్ వెంకన్న, వయసు 62 సంవత్సరాలు, కార్యాలయం 105, సూర్యలోక్ కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రీ,అబిడ్స్, హైదరాబాద్.

14. జి.జాన్సీ, కన్వీనర్, దళిత స్త్రీ శక్తి (ఎన్జీఓ), D/o. లేట్ అబ్రహామ్, వయసు 52 సంవత్సరాలు, R/o.Plot No.1,సుధా అపార్టుమెంట్లు, 6/13, బ్రాడిపేట, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

... ప్రతివాదులు

పిటిషనర్ తరపు న్యాయవాది : శ్రీ కారుమంచి ఇంద్రనీల్ బాబు

ప్రతివాది కొరకు న్యాయవాది సంఖ్య 1, 3, 4 & 5 ది అడ్వకేట్ జనరల్

ప్రతివాది నెం. 2 కోసం న్యాయవాది: శ్రీ బి. కృష్ణ మోహన్, ఎ.ఎస్.జి.

ప్రతివాది నెం. 6 కోసం న్యాయవాది: శ్రీ ఎన్. సుబ్బారావు

7 నుండి 10 & 14 వరకు ప్రతివాదికి న్యాయవాది: శ్రీ జి.వి.శివాజీ

ప్రతివాదికి న్యాయవాది సంఖ్య 11 నుండి 13 వరకు: శ్రీ డా. ఎస్. చెల్లప్ప

**WRIT PETITION (PIL) No.185 of 2019**

రామభొట్ల శ్రీనివాస సుధీష్, S/o. నరసింహ శాస్త్రి, సుమారు 52 సంవత్సరాల వయస్సు, ఉద్యోగం: సోషల్ యాక్టివిస్ట్, R/o: H.No. 3232 రావిపాడు, పి.గన్నవరం, పి.గన్నవరం మండలం, పాత గన్నవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

. . . .పిటిషనర్

Versus

1. ప్రిన్సిపాల్ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పాఠశాల విద్యా విభాగం,వెలగపూడి, గుంటూరు జిల్లాలో సచివాలయ భవనం.
2. పాఠశాల విద్యా కమిషనర్, ఎ.పి., 4వ అంతస్తు, బి-బ్లాక్, వీటీపీఎస్ రోడ్, భీమరాజుగుట్ట, ఇబ్రహీంపట్నం, ఎ.పి.
3. డైరెక్టర్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ & ట్రైనింగ్, A.P., OPP: LB స్టేడియం, ఇ-గేట్, హైదరాబాద్.
4. కార్యదర్శి, యూనియన్ ఆఫ్ ఇండియా, పాఠశాల విద్యా మరియు అక్షరాస్యత శాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ, 124-సి, శాస్త్రి భవన్, న్యూ ఢిల్లీ.
5. గుంటూరు జిల్లా ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ప్రతినిధిగా గుంటూరులోని జిల్లా కార్యదర్శి భట్రాజు చిత్రంజన్ దాస్.
6. గొర్రెముచ్చు వెంకట నరసింహారావు, S/o.పెద్ద రామస్వామి, వయసు 42 సంవత్సరాలు, R/o. H.No. 77-54/1-15, ప్రకాష్‌నగర్, విజయవాడ.
7. జి.సుధీర్ బాబు, S/o. సోలోమన్, వయసు 39 సంవత్సరాలు, R/o.6-1/5-21, వందనం స్ట్రీట్, ఫ్రెజర్‌పేట్, చిట్టినగర్, విజయవాడ.
8. మద్దిరాల మల్లికార్జునరావు, S/o. బాలకోటయ్య, వయసు 48 సంవత్సరాలు, R/o. రావులకొల్లు గ్రామం, పొన్నలూరు మండలం, ప్రకాశం జిల్లా.

9. జి. మధు బాబు, S/o. జి.వెంకయ్య, వయసు **35** సంవత్సరాలు, R/o.D.No. **5-94**, ప్రాతూరి గ్రామం, తాడేపల్లి మండలం, పోలకంపాడు, గుంటూరు జిల్లా.

10. బుదుమూరు శ్వేతా భార్గవి, W/o. లక్ష్మీనారాయణ, వయస్సు **36** సంవత్సరాలు, R/o.Block No.92, SF-4, YSR కాలనీ, జక్కంపూడి, విజయవాడ రూరల్, ఆంధ్రప్రదేశ్.

11. శ్రీ ఎం. భాగ్యరావు, కార్యదర్శి, దళిత బహుజన్ ఫ్రంట్, S/o. వెంకటేశ్వరులు, వయసు **48** సంవత్సరాలు, **5/3**, అరండల్ పేట వద్ద కార్యాలయం, గుంటూరు జిల్లా.

12. శ్రీ ఎం.అజయ్ గౌతమ్, కార్యదర్శి, ఆది-హిందూ సోషల్ సర్వీస్ లీగ్, ప్రతినిధి. S/o. శ్రీ ఎం.బి.గౌతం, సుమారు **46** సంవత్సరాల వయస్సు, ఉద్యోగం : సోషల్ సర్వీస్, ఆది-హిందూ భవన్ కార్యాలయం, హైదరాబాద్ విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో.

13. శ్రీ కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, S/o. లేట్ వెంకన్న, వయసు **62** సంవత్సరాలు, కార్యాలయం **105**, సూర్యలోక్ కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రీ, అబిడ్స్, హైదరాబాద్.

14. జి.ఝాన్సీ, కన్వీనర్, దళిత స్త్రీ శక్తి (ఎన్జీఓ), D/o. లేట్ అబ్రహామ్, వయసు **52** సంవత్సరాలు, R/o.Plot No.**1**, సుధా అపార్టుమెంట్లు, **6/13**, బ్రాడిపేట, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

15. వై.సత్య కుమార్, S/o. సుబ్బారావు, వయసు **48** సంవత్సరాలు, R/o. **9/379**, మొండి రావు వీధి, ప్రొడత్తూర్, కడప జిల్లా.

S/o. వెంకటాచలం, వయసు 48 సంవత్సరాలు, ఉపాధ్యాయుడు, MPP స్కూల్, అప్పన్నపల్లి, మామిడికుదురు మండలం, తూర్పు గోదావరి జిల్లా.

16 తోట రాజారావు, అధ్యక్షుడు, బహుజన టీచర్స్ అసోసియేషన్, S/o. వెంకటాచలం, వయసు 48 సంవత్సరాలు, ఉపాధ్యాయుడు, MPP స్కూల్, అప్పన్నపల్లి, మామిడికుదురు మండలం, తూర్పు గోదావరి జిల్లా.

17. మద్దిరాల మాధవరావు, కార్యదర్శి, బహుజన టీచర్స్ అసోసియేషన్, S/o. లేటు నరసింహారావు, వయసు 57 సం., వృత్తి: టీచర్, మండల పరిషత్ పాఠశాల, ప్రకాశం జిల్లా.

పిటిషనర్ తరపు న్యాయవాది: శ్రీ అనుప్ కౌశిక్ కరావాడి

1 నుండి 3 వరకు ప్రతివాది కోసం న్యాయవాది: అడ్వకేట్ జనరల్

ప్రతివాది నెం. 4 కోసం న్యాయవాది: శ్రీ బి. కృష్ణ మోహన్

ప్రతివాది నెం. 5 కోసం న్యాయవాది: ఎ.ఎస్.జి శ్రీ ఎన్.సుబ్బారావు

6 నుండి 9 & 14 వరకు ప్రతివాది కోసం న్యాయవాది: శ్రీ జి.వి.శివాజీ

ప్రతివాది నెం.10 కోసం న్యాయవాది: శ్రీ వి. కార్తీక్ నవయన్

ప్రతివాదికి న్యాయవాది సంఖ్య 11 నుండి 13 వరకు: డా.ఎస్.చెల్లప్ప

ప్రతివాది నెం. 15 కోసం న్యాయవాది: శ్రీ వేదుల వెంకట రమణ rep. M/s. భరద్వాజ్ అసోసియేట్

ప్రతివాదికి న్యాయవాది సంఖ్య 16 & 17: శ్రీ వై.కోటేశ్వరరావు.

# Common Order

**Dated 15.04.2020**

Per **J. K. Maheswari, C.J.**

పాఠశాల విద్యా కమీషనర్ లేఖ R.C:162/A, 1/2014 తేది. 12-10-2019 న చేసిన ప్రతిపాదనలపై 5-11-2019న చేసిన GOMS No.81, 20-11-2019 తేదీన GOMS No.85 పాఠశాల విద్య (PROGRAM-1) శాఖ ద్వారా జారీ చేసిన ఉత్తర్వులను ప్రశ్నిస్తూ ఈ రిట్ పిటీషన్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) సంఖ్య 183 ఫైలు చేయబడినది. అనంతర కాలంలో వచ్చిన GOMS No. 85, అంతకు ముందు వచ్చిన GOMS No.81 ని అతిక్రమించింది. కావున, సారాంశ రూపంగా ఈ పిటీషన్ ను GOMS No.85 ను సవాలు చేస్తోంది. సదరు సంబంధిత జీవో ఈ క్రింద ఉదాహరింపబడింది.

GOVERNMENT OF ANDHRA PRADESH

**ABSTRACT**

School Education Department —Converting all classes from Ito VI in Primary, Upper Primary, High Schools under all managements into English Medium from the academic year 2020-21 and gradually increasing each further class from the Next consequent academic years- Orders- Issued.

**SCHOOL EDUCATION (PROG. I) DEPARTMENT**

**G.O.Ms.No. 85** **Dt: 20.11.2019**

**Read the following:-**

1. G.O. Ms. No.76 Education (SE.TRG) Department dt.10.06.2008.
2. G.O.Rt.No.30 Education (Prog.11) Dept, dt.20.01.2010
3. Govt. Memo No 434390/Prog.I/2017 dt.16.11.2017.

4. G.O.Rt.No.78 Education (Prog.1) Dept, dt.05.10. 2017
5. GO.MsNo.81 School Education (Prog.1) Department, dt.5/11/2019
6. From the Commissioner of School Education, A.P., Lr.Rc.No. 162/A&I/2014, dt:12.10.2019

★ ★ ★

**ORDER:**

In the reference 6th, read above, the Commissioner of School Education has submitted a proposal for converting all Government, MPP Schools and Zilla Parishad schools and all classes into English Medium from Grades I to VIII from academic year 2020-21 and for Grades IX & X from academic year 2021-22.

2. After careful examination of the matter, Govemment hereby accord permission to the Commissioner of School Education to convert all classes from I to VI in Primary, Upper Primary, High Schools under all managements into English Medium from the academic year 2020-21 and gradually increasing each further class from the Next consequent academic years in superseding the earlier orders issued vide references 1st to 5th read above in the matter. However, the Commissioner of School Education shall take appropriate and adequate efforts to implement Telugu/Urdu as compulsory subject depending on the current medium of instruction in all the Schools compulsorily in line with the Govemment orders in the matter.

3. The Commissioner of School Education shall ensure the following steps for successful implementation of English Medium schools:-

1. Required teachers should be deployed in the School as per the staffing pattern prescribed by the Government from time to time and as per pupil teacher ratio for single medium.
2. SCERT shall take necessary action for designing and development of Teacher Hand Books, Training of Teachers in English medium teaching skills and knowledge, Compendium of best classroom practices and other pedagogical material for supporting the teachers to be skilled in English Medium teaching.

3. Director SCERT in coordination ·with Commissioner of School Education shall take comprehensive action for online assessment of the current English proficiency levels of the Teachers, design appropriate training programs for enchasing the English Medium teaching skills for the teachers.

4. Intensive and extensive trainings must be ensured during the current academic year and during the Summer of 2020 for equipping the Teachers to teach in English Medium from academic Year 2020-21 for classes Ito VI. Number of trainings shall be given to the Teachers until improving their English Medium Teaching skills in specific subjects and in general.

5. Action shall be taken for reviving the English Language Teaching Centers & District English Centers (DECs) and re-locating them in District Institutes for Education & Training (DIETs).

6. Director, Text Book Press. should take action to obtain correct indents and ensure supply of English Medium Text Books to The Schools as per student enrol rn ent for classes I to VI well before the starting of the academic year.

7. Keeping in view of the conversion of all schools and classes from I to VI into English Medium, requirement of Teachers can be arrived at and proposals should be submitted to Government by the Commissioner Scbool Education.

8. In future, Teacher recruitments, qualified candidates with the best proficiency in English Medium teaching should be recruited.

4. The Commissioner of School Education, the State Project Director, SSA, the Director, SCERT, and the Director, AP Text Book Press shall take further necessary action accordingly.

(*BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)*

**B.RAJSEKHAR**

PRINCIPAL SECRETARY TO GOVERNMENT

**2.** ఇంతకు ముందు వచ్చిన అన్ని జీవోలను అతిక్రమణం చేస్తూ ఈ జీవో ద్వారా **2020-2021** విద్యా సంవత్సరం నుంచి అన్ని యాజమాన్యాల కింద ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలోని I నుంచి VI వ తరగతి వరకు ఉన్న అన్ని తరగతులను ఇంగ్లీష్ మీడియంలోకి మార్చాలని మరియు ఆ తరువాత సంవత్సరం నుంచి ప్రతి తరగతిని క్రమేణా పెంచుకుంటూ పోవాలని పాఠశాల విద్యా కమీషనర్ చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుతము ఉన్న మాధ్యమం ఆధారంగా అన్ని పాఠశాలల్లో తెలుగు మరియు ఉర్దూలు నిర్బంధ విషయంగా ఉంటాయని చెప్పారు. ఇంగ్లీష్ మీడియం లో విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తిని పాటిస్తూ సిబ్బంది నమూనా ప్రకారం చాలినంత మంది ఉపాధ్యాయుల్ని నియోగించి దీనిని అమలు చేయమని పాఠశాల కమిషనరుని కోరారు. ఇంగ్లీష్ మీడియం బోధనలో నైపుణ్యం పెంపొందించేందుకు వీలుగా, ఉపాధ్యాయుల కొరకు హ్యాండ్ బుక్స్ తయారు చేసేందుకు ఇంగ్లీష్ మీడియంలో బోధన నైపుణ్యం, పరిజ్ఞానం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చేందుకు, ఉత్తమమైన తరగతి గది అభ్యాసాలు మరియు ఇతర బోధన సామగ్రులకు సంబందించిన ఒక సంకలనం రూపొందించేందుకు స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (SCERT) ఆదేశించబడింది. (SCERT) పాఠశాల విద్యా కమీషన్ వారి సమన్వయంతో ఇంగ్లీష్ మీడియం అధ్యాపకులకు ఆన్‌లైన్‌లో ప్రావీణ్యాతా పరీక్ష జరిపి, పునః పునః విస్తృత శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు పెంపొందించమని కోరబడ్డారు. ఇంగ్లీష్ భాషా బోధన కేంద్రాలను, జిల్లా ఇంగ్లీష్ కేంద్రాలను పునరుద్ధరించి వాటిని జిల్లా స్థాయి విద్యా మరియు శిక్షణ సంస్థల్లో పునః స్థాపించేందుకు

చర్యలు తీసుకోవాలి. పాఠ్య పుస్తకాల ముద్రణశాల డైరెక్టర్‌వారు, I నుంచి VI తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాల ప్రకారం సరైన ఇండెంట్‌లు తీసుకుని వాటి ప్రకారం విద్యా సంవత్సరం ఆరంభం కాక మునుపే వాటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలి. అన్ని పాఠశాలలు ఇంగ్లీష్ మీడియంలోనికి మారుతున్నందువల్ల ఇంగ్లీష్ మీడియంలో ఉత్తమ ప్రావీణ్యం కలిగిన అర్హులైన అభ్యర్థులను రిక్రూట్ చేసుకుందుకు ఎంత మంది కావాల్సి వస్తారో పాఠశాల విద్య కమీషన్ ద్వారా సమాచారాన్ని ఇవ్వవలసిందిగా కోరడం అయినది. సంక్షిప్తంగా సదరు ఆదేశాలు మూడు రూపాలుగా ఉన్నాయి.

i) అన్ని యాజమాన్యాల కింద ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల కింద ఉన్న I నుంచి VI నుంచి తరగతులు ఇంగ్లీషు మీడియంలోకి మార్చడం మరియు తరువాత వచ్చే విద్య సంవత్సరం నుండి ఒక్కొక్క తరగతిని పెంచుకుంటూ పోవడం.

ii) ఇప్పుడు నియోగించబడిన ఉపాధ్యాయులకు నైపుణ్యం పెంచేందుకు ఇంగ్లీష్ మీడియం బోధన నైపుణ్యాలు మరియు పరిజ్ఞానం పై శిక్షణ, మరియు ఉపాధ్యాయుల ఉపయోగం కోసం ఉత్తమ తరగతి అభ్యాసాల సంకలనాన్ని, ఇతర బోధన శాస్త్ర సామగ్రిని అభివృద్ధి పరిచేందుకు, పోస్టులు భర్తీ చేసేందుకు, నియామకం నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించడం.

iii) పాఠ్య పుస్తకాల ముద్రణశాల డైరెక్టర్‌వారు రాబోయే సంవత్సరానికి కావలసిన ఇంగ్లీషు మాధ్యమం పుస్తకాలకు సమ్మతిని పొందటం, ఇండెంట్ తీసుకోవడం మరియు సరఫరా చెయ్యడం.

**3.** పిటీషనర్ తరపు న్యాయవాది శ్రీ కారుమంచి ఇంద్రనీల్ బాబు, పాఠశాల విద్యా కమీషనర్ వారి వెబ్ సైట్‌లోని సమాచారం ఆధారంగా ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మీడియం, ఇంగ్లీషు మీడియం, తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం (సమాంతరముగా) మూడు శ్రేణులల్లో ప్రవేశం కోరిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా సదరు జీవోని సవాలు చేసారు. 5-10-2017 నాటి GOMS No. 78 (ఆక్షేపణకు గురైన జీవోలో నాలుగవ రిఫరెన్స్) నోటిఫికేషన్ ప్రకారం సమాంతరంగా ఇంగ్లీష్ మీడియం తరగతులు నడుస్తున్నాయి. సదరు ఆక్షేపణకు గురైన నోటిఫికేషన్లు జారీ చేసే సమయానికి ఇంగ్లీష్ మీడియంలోకన్నా తెలుగు మీడియంలో ప్రవేశాలు ఎక్కువ ఉన్నాయి. ఆయన ప్రాథమిక విద్యలో ఏది ఉత్తమ మాధ్యమం అన్నదాంట్లో 1953 నుంచి వచ్చిన పరిశోధనలపై ఆధార పడ్డారు. United Nations Scientific And Cultural Organisation (సంక్షిప్తంగా UNESCO), ఆక్స్ఫర్డ్ విద్యాలయం వారి సర్వేల ఆధారంగా పిల్లలు మెరుగ్గా పనిచేయడానికి మాతృభాష మాధ్యమమే ఉత్తమం. వారి సర్వతోముఖాభి వృద్ధికి కావలసిన నాణ్యమైన విద్య, విజ్ఞానం, అనుభవం కలిగించేందుకు ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాష బోధనే అనుకూలం అని 2003 లో UNESCO చెప్పిందని పేర్కొన్నారు.

**4.** 1993 లో జరిగిన ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ సమ్మిట్‌లో, ఢిల్లీ డిక్లరేషన్ ఫర్ ఫ్రేమ్ వర్క్ అండ్ యాక్షన్ పూర్తి స్థాయి పరిశోధన అనంతరం *“నేర్చుకునే వాడి మాతృభాష కన్నా ఇతరమైన భాష బోధన మాధ్యమంగా ఉంటే, నేర్చుకునే పూర్వ దశ మందంగానూ, సాధించేది తక్కువగానూ ఉంటుంది”* అని ముగించింది. 1949 లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సిఫార్సుల ప్రకారం జాతీయ విద్యా విధానం ప్రకారం, తెలుగు

నుంచి ఇంగ్లీషు మాధ్యమంలోకి మారడం సదరు విధానానికి విరుద్ధమని వాదించారు. ఆక్షేపణకు గురైన ఈ జీవో ఆర్టికల్ 19(1) (A)ని అతిక్రమించింది. **స్టేట్ ఆఫ్ కర్ణాటక Vs అసోసియేషన్ ఆఫ్ మేనేజ్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ అండ్ సెకండరీ స్కూల్స్ కేసులో** రాజ్యాంగం ధర్మాసనం ఇచ్చిన తీర్పుకి విరుద్ధమని వాదించారు. తెలుగు మీడియం బడులు అన్నింటినీ పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలోనికి మార్చడం, ఆర్టికల్ 19 లో 2వ క్లాజులో పేర్కొన్న పరిమితుల పరిధిలోనికి రావని వాదించారు. ఆక్షేపణకు గురైన జీవో ద్వారా అన్ని యాజమాన్యాలలో పాఠశాలల్ని ఇంగ్లీషు మీడియం లోనికి మార్చడం వల్ల రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) జీ ప్రకారం ఎటువంటి ఎయిడ్ పొందని ప్రైవేట్ పాఠశాలల వృత్తి వ్యాపార హక్కుకి భంగం కలుగుతుంది అని, భారత రాజ్యాంగం ఆర్టికల్ 30,350 నిబంధనలకు విరుద్ధంగా భాషా పరమైన మైనారిటీ సంస్థల హక్కులకు భంగం కలుగుతుందని వాదించారు. ఐక్యరాజ్య సమితి చేసిన యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (సంక్షిప్తంగా UDHR) పిల్లలకు ఎలాంటి విద్యని ఇవ్వాలో పేర్కొన్నది. ఇంకా భారత రాజ్యాంగం ఆర్టికల్ 29 ప్రకారం బోధన మాధ్యమంగా తెలుగును వదిలివెయ్యరాదని ప్రభుత్వానికి పరిమితి విధించింది. అందువలన సదరు జీవో రాజ్యాంగ నిబంధనలను అతిక్రమించింది. సదరు జీవో కేంద్ర ప్రభుత్వం చేసిన బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009. (సంక్షిప్తంగా RTE)లో సెక్షన్ 29(2)(f), రైట్ ఆఫ్ చిల్డ్రన్ టు ఫ్రీ అండ్ కంపల్సరీ ఎడ్యుకేషన్ రూల్స్ 2010 (సంక్షిప్తంగా సెంట్రల్ రూల్స్) నిబంధనలకు వ్యతిరేకంగా ఉండటం వలన *న్యాయవిరుద్ధంగా* ఉన్నది. సదరు చర్య పిల్లల పసి మనసుల సర్వతోముఖాభివృద్ధిపై వ్యతిరేక ప్రభావం

కలిగిస్తుంది అని, తెలుగు భాష వారసత్వాన్ని శూన్యం చేస్తుంది అని, ప్రభుత్వం చేసిన చర్యకు అకెడమిక్ అథారిటీ నుండి ఎలాంటి సిఫార్సు లేదు. ఎలాంటి పరిశోధన, హేతుబద్ధత, పద్దతి, కొంచమైనా స్వబుద్ధితో కూడిన ఆలోచన కూడా ప్రభుత్వం చెయ్యలేదు.

**5. మోహినీ జైన్ Vs స్టేట్ ఆఫ్ కర్ణాటక , ఉన్నికృష్ణన్ Vs స్టేట్ ఆఫ్ ఏపీ** తీర్పుల దృష్ట్యా విద్య హక్కు చట్టం, జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కుల పరిధిలోకి వస్తాయన్న పూర్వభావనతో సదరు ఆక్షేపణకు గురైన జీవోను ప్రశ్నిస్తూ రిట్ పిటీషన్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యము) 185/2019 ఫైలు చెయ్యబడింది. ఆ తీర్పుల తరువాత 6 నుంచి 14 సంవత్సరంలోపు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను చట్టరీత్యా నిర్ధారించబడిన విద్యను అందించే బాధ్యతను రాజ్యం పాటించే విధంగా రాజ్యంగంలో మూడవ పార్టులో (ప్రాథమిక హక్కులు) నందు ఆర్టికల్ 21 (a) తేబడినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం వర్తిస్తుందని, విద్యాహక్కు చట్టరీత్యా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని సదరు చట్టప్రయోజనాలను సాధించుకుని పిల్లలకు ఇరుగుపొరుగు పాఠశాలలో విద్యను అందించేందుకు 22.2.2011 న రైట్ ఆఫ్ చిల్డ్రన్ టు ఫ్రీ అండ్ కంపల్సరీ ఎడ్యుకేషనల్ రూల్స్ 2010 (సంక్షిప్తంగా స్టేట్ రూల్స్) రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

**6.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు బోధన మాధ్యమం మాతృ భాష అయిన తెలుగులో ఉన్నది. పిల్లవాడు తల్లితండ్రుల కోరిక మేరకు సమాంతరంగా ఇంగ్లీషులో మరియు తెలుగులో తరగతులు ఉన్నాయి అని పేర్కొన్నారు. ప్రాథమిక

ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో I నుంచి VI తరగతులను మూకుమ్మడిగా ఇంగ్లీషు మీడియం లోకి మార్చడం అనుమతించబడదు. సదరు చర్య మరియు జీవో జారీచేయడం విద్యాహక్కు చట్ట నిబంధనలకు విరుద్ధం. **శ్రీ సీతారాం షుగర్ కంపెనీ** Vs **యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్ తీర్పు** దృష్ట్యా సబార్డినేట్ చట్టము మరియు ప్రధాన చట్ట ప్రయోజనాలకు హేతుబద్ధంగా సంబంధం కలిగి ఉండకపోతే అది కొట్టివేయదగినది అని వాదించారు. **స్టేట్ ఆఫ్ తమిళనాడు అండ్ అదర్స్** Vs **పి.కృష్ణమూర్తి అండ్ అదర్స్ కేసు**లో సుప్రీంకోర్టు తీర్పుపై ఆధారపడటం జరిగింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 13 ప్రకారము కేంద్ర చట్టానికి వ్యతిరేకంగా ఇచ్చిన కార్య నిర్వాహక ఉత్తర్వులు న్యాయ విరుద్ధమైనవి మరియు చెల్లవు. కేంద్ర చట్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్య నిర్వాహక ఉత్తర్వుల ద్వారా ఇంగ్లీషును బోధనా మాధ్యమంగా అమలు చెయ్యడానికి వీలుపడదు. భారత రాజ్యాంగం 14, 21 (a) ఆర్టికల్స్‌ను అనుసరించి ఈ ఆక్షేపించబడిన జీవో రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తోంది.

**7.** సదరు కార్య నిర్వాహక ఉత్తర్వులు జారీ చెయ్యడం బలహీన వర్గాలకు ప్రతికూల ప్రభావం కలిగిస్తాయని, నిర్లక్ష్యిత వర్గాలకు ఉపయోగించవని వాదించారు. మాతృభాషలో లేదా అతను ఎంచుకున్న మాధ్యమం ప్రకారం బోధన జరిగితే పిల్లవాడికి నేర్చుకోవడం సులభం అవుతుంది అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు అధికార భాష అని దానిని 70 మిలియన్ల ప్రజలు మాట్లాడతారని. సుసంపన్నమైన చరిత్ర వారసత్వాలు ఉన్నాయని, ప్రపంచ స్థాయిలో 15వ స్థానంలో

అత్యధిక భాషా వ్యవహర్తలు ఈ భాషలో ఉన్నారని నివేదించారు. ఏమైతేనేమి, తెలుగు స్థానంలో ఇంగ్లీషును తేవడం ద్వారా తెలుగుని నిర్మూలించడం పిల్లల పెరుగుదల మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆ రకంగా రాష్ట్ర వారసత్వం కూడా ప్రతికూల ప్రభావానికి లోనవుతుంది. అకెడమిక్ అథారిటీ సిఫార్సు చెయ్యకుండా, అట్టి జీవో జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని, అందువల్ల దానిని కొట్టివేయాలని వాదించారు.

**8.** ఒకటవ ప్రతివాది తన తరపున మరియు **3,4,5** ప్రతివాదుల తరపున కౌంటర్ అఫిడవిట్ ఫైల్ చేసారు. శాస్త్రకోవిదులైన అడ్వొకేట్ జనరల్ శ్రీ యస్. శ్రీరామ్ ఈ పిటీషన్లు విద్యా హక్కు చట్టం సెక్షన్ **29(**(2)(f) నిబంధనలను సమర్ధనీయము కాని రీతిలో అర్ధాన్వయం చెయ్యబడ్డాయి. ఆయన, సుప్రీంకోరులో చెప్పిన ***యన్.కె. చౌహాన్ అండ్ అదర్శ్*** Vs ***స్టేట్ ఆఫ్ గుజరాత్ అండ్ అదర్స్, ఉస్మానియా యూనివర్సిటీ*** Vs ***వీ.యస్. ముత్తారంగం అండ్ అదర్స్, రాజేంద్రసింగ్ అండ్ అదర్స్*** Vs ***స్టేట్ అఫ్ యూపీ అండ్ అదర్స్, ఇరిడియమ్ టెలికాం లిమిటెడ్*** Vs ***మోటరోలా ఇంక్లిడ్ కేసులపై*** ఆధారపడ్డారు. ఈ కేసుల్లో రాష్ట్రం పాటించవలసిన బోధన మాధ్యమం విషయంలో ఆదేశాత్మకంగా, స్వేచ్ఛా నిర్ణయంగా ఈ సెక్షన్‌లోని *"సాధ్యమైనంతవరకు"* అన్న పదాలు అర్ధాన్వయం చేయబడినాయి. జవాబులో పేర్కొన్నట్టు ఆంధ్రప్రదేశ్‌లోని నవోదయ మరియు కేంద్రీయ విద్యాలయాలు ఇంగ్లీషు మాధ్యమంలో ఏర్పడ్డాయి. బలహీన వర్గాలకు ప్రైవేట్ పాఠశాలలోని ఇంగ్లీష్ మీడియం అందుబాటులో లేనందు వలన, రాజ్యాంగంలోని **46** వ ఆర్టికల్ స్ఫూర్తి ప్రకారము, బలహీన వర్గాలకు అనుకూలంగా విద్యను అందించేందుకు

నిర్ణయం చెయ్యబడింది. తల్లితండ్రుల కమిటీ కోరిక మీద జీవో జారీ చేసే నిర్ణయం చేసినందువల్ల రాష్ట్రం ప్రజల మీద ఇంగ్లీష్ మీడియం ప్రజల మీద బలవంతంగా రుద్దినట్టు భావించరాదు. రాబోయే విద్య సంవత్సరం నుంచి తెలుగు మీడియంలో చదవాలని కోరుకునే విద్యార్థులకు కావలసిన సదుపాయాలు, బోధన సిబ్బందిని, ప్రతి జిల్లాలో మండల స్థాయిలో ఏర్పాటు చేస్తామని, ఒకవేళ అట్టి పాఠశాల విద్యాహక్కు చట్ట నిర్వచనం రీత్యా ఇరుగు పొరుగులో లేని పక్షంలో, వారు కోరితే ఉచిత రవాణా ఏర్పాటు చేస్తామని కూడా వాదించారు. బోధన మాధ్యమం మారినా పాఠ్య ప్రణాళికలో తెలుగును, ఉర్దూను ఒక నిర్బంధ సబ్జెక్టుల్లో ఒకటిగా ఉన్నందువలన పిటీషనర్ల సంశయాలు నిరాధారమైనవి.

**9.** తల్లితండ్రులు ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు పంపాలన్న వారి ఆకాంక్షలను కొనసాగించేందుకు మొదటగా **2008-09** సంవత్సరంలో **6,500** ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ SUCCESS అనే ప్రాజెక్ట్ కింద ఉన్నత పాఠశాలల్లో **6**వ తరగతి నుంచి ఆరంభించాలని నిర్ణయించింది అని వివరించారు. తెలుగు మీడియం లేదా ఇంగ్లీష్ మీడియంలలో నిర్వహిస్తున్న వివిధ పాఠశాలల డేటాలను సమర్పిస్తూ రాష్ట్రంలో డిమాండ్ ఇంగ్లీష్ పాఠశాలలకు పెరుగుతోందని చెప్పారు. ఈ అంశాలన్నీ పరిగణన లోకి తీసుకుని పాఠశాల విద్యాశాఖ కమీషనర్‌వారు, **12-10-2019**న ఒక ప్రతిపాదన సమర్పించగా దానిని ప్రభుత్వం పరిశీలించింది. తదను సారంగా అన్ని యాజమాన్యాలలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు అన్నీ I నుంచి VI తరగతులు, **2020-21** విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలోకి మార్చబడినవి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని తల్లితండ్రుల కమిటీలు **7-1-2020**న సమావేశమై చర్చించిన

అనంతరం నిర్ణయానంతర ధ్రువీకరణ చేశారని (Post Decisional Affirmation) మరియు **4-1-2020** నుంచి **9-1-2020** మధ్యన జరిగిన *"అమ్మ ఒడి వారోత్సవాల్లో"* భాగంగా ఆ ఫీడ్ బ్యాక్ ని తెలియచేశారని పేర్కొన్నారు. సదరు స్కీంను బలహీన వర్గాలకు చెందిన దారిద్ర్య రేఖకు దిగువున జీవిస్తున్న తల్లులకు **15000** రూపాయలు ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించబడింది. ఏమైతేనేమి, ఆ మహిళల ప్రతిస్పందన ఆధారంగా ఇంగ్లీషు మీడియం మార్పిడి సరైనదేనని సమ్మతించబడింది. తెలుగు ప్రాచీన భాషగా గొప్ప చరిత్ర కలిగిన విస్తృతమైన భాషగా మాట్లాడబడే విషయాన్ని అంగీకరిస్తూనే భాష యొక్క వైభవాన్ని కొనసాగించేందుకు పాఠ్య ప్రణాళికలో భాగంగా ప్రతి తరగతిలో ఒక నిర్బంధ సబ్జెక్టుగా ఉంటుంది అని పేర్కొన్నారు.

**10.** *ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982* (సంక్షిప్తంగా 1982వ చట్టం) కు సవరణ చేసే నిమిత్తం *ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982 -(చవరణ చట్టం 2019)* పేరు గల చట్టం శాసన సభలో ప్రవేశ పెట్టబడినది అని, అది శాసన సభలో ఆమోద ముద్ర పొందిన తరువాత శాసన మండలికి పంపబడినది అని, దానిని కొన్ని సవరణలతో తిప్పి పంపబడినది అని ప్రభుత్వం పేర్కొన్నది. తదనంతరం శాసన సభ **23-1-2020**న బిల్లును పాస్ చేసి రాజ్యాంగంలోని ఆర్టికల్ **254** క్లాస్ **(2)** నందు కోరబడినట్టు, గౌరవ రాష్ట్రపతి ఆమోద ముద్రకు పెండింగ్‌లో ఉన్నది. విద్య ఉభయ జాబితాలలోని అంశం. ఏమైనా సదరు జీవో కేంద్ర చట్టానికి అనసుగుణంగా గాని, విరుద్ధంగాగాని లేదు. ఇది రాష్ట్రంలో పాఠశాలల విద్యను బలోపేతం చెయ్యడానికి కావలసిన సంస్కరణలు చేపట్టేందుకు

అధ్యయనం చేసి, సిఫార్సులు చేసేందుకు ఏర్పడిన శ్రీ ఎన్. బాలకృష్ణన్ అధ్యక్షతన ఏర్పడిన కమీషన్ నివేదికపై ఆధారపడి వున్నది. విద్యలో ప్రమాణాలు కొనసాగించేందుకు జస్టిస్ ఆర్.కాంతారావు అధ్యక్షతన రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

**11.** నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్ **2005** (ఎన్ సి ఎఫ్ **2005**) లోని మూడవ అధ్యాయాన్ని, విద్యాహక్కు చట్టమును, సెక్షన్ **29(2)**(f)కు సంబంధించి కేంద్ర నియమావళిని ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వం దీనికి సంబంధించి ప్రతిస్పందించింది. అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ శ్రీ బి కృష్ణమోహన్ -అన్ని రాష్ట్రాల ఆమోదాన్ని పొందిన నేషనల్ కరికులం ఫ్రేము వర్కులోని **3.1.1** పేరా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆక్షేపణీయం అయిన జీవో చట్టబద్ధం కాదని వాదించారు. ఈ సందర్భంగా జాతీయ విద్యావిధానం **1968** (ఎన్ పి ఈ **1968**) లోని **4.3** ను పరామర్శించారు. ఆయా రాష్ట్రాల్లో సాంస్కృతిక అభివృద్ధి కోసం ప్రాథమిక తరగతులలో విద్యా బోధన తప్పనిసరిగా ప్రాంతీయ భాషలలోనే ఉండాలని **4.3**లో నొక్కి చెప్పారు. డాక్టర్ కె కస్తూరి రంగన్ అధ్యక్షతన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ **2019** ముసాయిదా ప్రతిని కూడా పరిశీలించారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది రూపొందింది. **31-5-2019**న ఈ కమిటీ తన నివేదికను సమర్పించింది. పాఠశాలలో పాఠ్యాంశాలు, బోధన గురించి చెబుతూ ఆయా రాష్ట్రాలలో బోధన భాషగా స్వంత భాష లేదా మాతృభాష ఉండాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. ముసాయిదా ప్రతి ఆమోదాన్ని

పొందాల్సి ఉంది. కానీ ఈ విషయం గత జాతీయ విద్య విధానాలకు అనుకూలంగా ఉన్న అంశమే! 2003లో యునెస్కో బహు భాషలు మాట్లాడే సమాజంలో విద్య ఎలా ఉండాలి అనే అంశంపై ప్రచురించిన నివేదికను కూడా పరిశీలించారు. ఇవన్నీ పరిశీలించిన మీదట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జిఓ 85 కేంద్ర ప్రభుత్వ విధానాలకు, ఆర్టీ ఈ చట్టానికి విరుద్ధంగా ఉందని చెప్పారు.

**12.** రిట్ పిటిషన్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) నంబర్ 183/ 2019 లోని ప్రతివాదులు 6, 7 నుండి 10, 14, 11 నుండి 13 తరపున హాజరైన న్యాయవాది ఇలా వాదించారు. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి ప్రాతినిధ్యం వహించినవారు శ్రీ ఎన్ సుబ్బారావు, జి.వి శివాజీ, డాక్టర్ ఎస్. చెల్లప్ప పాఠశాల విద్యాశాఖ మంత్రి గారికి, ముఖ్యమంత్రి గారికి ఇతర అధికారులకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయవలసిందిగా మధ్యవర్తులు వారికి సంబంధించిన వారు చాలా వినతులు చేశారు. ఉపాధ్యాయులు లేకపోవడం వల్లే విద్యార్థులు మధ్యలో బడి మానేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో బోధన మాధ్యమంగా తెలుగు బదులు ఆంగ్లం ఉండాలని కూడా వారు విన్నవించారు. బీద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో బోధించే ప్రైవేట్ స్కూల్‌కి వెళ్లి చదువుకునే స్థోమత ఉన్న వారు కాదు. అందువల్ల ప్రభుత్వ నిర్ణయం వల్ల బీదా బిక్కీ ముఖ్యంగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు లబ్ధి పొందుతారు. ఈ సందర్భంలో బోధన మాధ్యమాన్ని తెలుగు నుండి ఇంగ్లీష్‌కు మార్చడం విద్యాహక్కు చట్టం సెక్షన్ 29 (2) స్ఫూర్తికి విరుద్ధం కాదు. ఎందుకంటే చట్టంలోనే సాధ్యమైనంత వరకు అని ఉంది. అదే సమయంలో ఆంగ్ల

మాధ్యమంలోకి మార్చడం అనే ఈ చర్య రాజ్యాంగ ఉల్లంఘన కూడా కాదు. పైగా రాజ్యాంగ స్ఫూర్తికి దోహదం చేస్తోంది కూడా! రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 కు ఇది మద్దతు ఇచ్చేదిగా ఉంది. ఆర్థికంగా వెనుకబడిన వారికి షెడ్యూలు తెగల వారికి కులాల వారికి ప్రభుత్వ నిర్ణయం మేలు చేస్తుంది. అందువల్ల 20.11.2019 న జీవో ఎంఎస్ నెంబర్ 85 ను జారీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విషయంలో జోక్యం చేసుకోవడాన్ని ఈ పిటిషన్లో సమర్థించడం లేదు. రిట్ పిటిషన్‌లో (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) నెంబర్ 185( 2019) ప్రతివాదులు నెంబర్ 5 ఆరు నుంచి తొమ్మిది 14 1011 నుంచి 1316 17 తరపు న్యాయవాదులు శ్రీ ఎన్ సుబ్బారావు శ్రీ జీ వీ శివాజీ శ్రీ వి కార్తీక్ నవయన్ డాక్టర్ ఎస్ చెల్లప్ప శ్రీ వై కోటేశ్వరరావు కూడా 183 రిట్ పిటిషన్ లో చేసినటువంటి వినతినే చేశారు.

**13.** 15వ ప్రతివాది M/s భరద్వాజ అసోసియేట్ తరపున సీనియర్ న్యాయవాది శ్రీ వేదుల వెంకటరమణ పిటిషనర్లకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాదిస్తూ అనేక అంశాలలో జీవో ఎంఎస్ నెంబర్ 85 తేదీ 20-11-2019 విద్యాహక్కుచట్టం సెక్షన్ 29(2)కు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆర్టికల్ 19.2 నిర్దేశించిన ఆంక్షలు ఒకటి నుండి ఆరవ తరగతి వరకు తెలుగు మీడియం నుండి ఇంగ్లీష్ మీడియంలోకి మార్చడం ద్వారా ఆర్టికల్ 19.1 రీత్యా లభించే వాక్ వ్యక్తీకరణ స్వాతంత్ర్యాలు హరింపబడవు. పైన పేర్కొన్న **మోహిని జైన్** Vs **ఉన్నికృష్ణన్ జెపి తీర్పుల** దృష్ట్యా విద్యాహక్కుచట్టం జీవించేహక్కు స్వేచ్ఛాహకులలో భాగం. ఆ తర్వాత విద్యాహక్కుచట్టం తేబడింది. రాజ్యాంగంలోని నాల్గవ

పార్ట్‌లో ఉన్న రాజ్య విధాన సంబంధమైన ఆదేశిక సూత్రాలలోని ఉచిత నిర్బంధ విద్యను పౌరుల హక్కులు ఉన్న మూడవ పార్ట్‌లోనికి తీసుకొస్తూ రాజ్యాంగ సవరణ చేయబడింది. ఆక్షేపణకు గురవుతున్న ఈ జీవో విద్యాహక్కు చట్టానికి మరియు విద్యా హక్కు చట్టం కేంద్ర రూల్స్, రాష్ట్ర రూల్స్‌కు విరుద్ధం. ఒకసారి కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఏ మార్పు లేకుండా స్వీకరించిన తర్వాత చట్ట స్ఫూర్తికి అననుగుణ్యంగా చేసే అన్ని కార్యనిర్వాహక ఆదేశాలు న్యాయ విరుద్ధమైనవి. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో చట్టబద్ధం కాదు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఉంది. ఇప్పటివరకు స్థిరీకరించ బడిన న్యాయసరళికి ఇది వ్యతిరేకం. అన్ని యాజమాన్యాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుండి ఆరవ తరగతి వరకు ఇంతకు ముందు ఇచ్చిన అన్ని ఆదేశాలను అతిక్రమిస్తూ అన్ని తరగతులను తెలుగు మాధ్యమం నుండి ఇంగ్లీష్ మాధ్యమంలోకి మార్పు చేయడం రాజ్యాంగంలోని **30** మరియు **350 (ఏ)** నిబంధనలపై ప్రతికూలంగా పనిచేస్తుంది. అన్ని యాజమాన్యాలలో ఉన్న పాఠశాలల్లో మైనార్టీలు మరియు భాషాపరమైన పాఠశాలలుకూడా ఉన్నాయి. పైన పేర్కొన్న ప్రకారం పిటిషనర్ ఫైల్ చేసిన పిటిషన్ అనుమతింపదగినది.

**14.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యావ్యవస్థలో ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమం గురించి ఈ కింద ఉత్పన్నమైన ప్రశ్నలు వాస్తవాలపై, వాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక స్థాయి విద్యలో పిటిషనర్ల, ప్రతివాదుల తరపు న్యాయవాదుల వాదనలు ప్రతి వాదనలు విన్న తర్వాత ఈ క్రింది ప్రశ్నలు పరిగణన నిమిత్తం ఉత్పన్నమౌతాయి.

1. *భారతదేశంలో ప్రాథమిక విద్యాదశలో బోధన మాధ్యమం గురించి స్వతంత్రానికి పూర్వం ఉన్న చారిత్రక స్థితిగతులు ఏమి చెబుతున్నాయి?*

2. *మాతృభాష, స్థానిక భాష, హిందీ అభివృద్ధిపై స్వతంత్ర పూర్వం నుండి స్వతంత్రానంతరం వరకు ఉన్న ప్రముఖుల అభిప్రాయాలు ఏమిటి?*

3. *భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్యలో బోధన మాధ్యమానికి సంబంధించి స్వతంత్రానంతర మార్పులు ఏమిటి?*

4. *పిల్లల విద్యాహక్కుకు సంబంధించిన రాజ్యాంగపరమైన చట్టపరమైన నిబంధనలేమిటి? తదనుగుణమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలు, నియమాలు ఏమిటి?*

5. *ప్రాథమిక దశల్లో విద్యను బోధన మాధ్యమంగా ఇంగ్లీష్‌లోనికి మారుస్తూ జారీ చేసిన జి.ఒ.ఎం.ఎస్.నెం.85 చారిత్రక నేపథ్యానికి, చట్టనిబంధనలకు అనుగుణంగా ఉందా? మరియు కేంద్ర ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా లేదుకదా?*

**మొదటి ప్రశ్న :**

1. *భారతదేశంలో ప్రాథమిక విద్యాదశలో బోధన మాధ్యమం గురించి స్వతంత్రానికి పూర్వం ఉన్న చారిత్రక స్థితిగతులు ఏమి చెబుతున్నాయి?*

**15.** బ్రిటిష్‌వారు రావడంకన్నా ముందు హిందువులకు పాఠశాలలలో ముస్లింలకు మదర్సాలలో విద్య నేర్పిస్తుండే వారు. బ్రిటిష్‌వారి రాకతో

విద్య మిషనరీలలో నేర్పించడం మొదలైంది. వారి విధానాలు ప్రమాణాలు సంప్రదాయ విద్యాభ్యాస విధానాల వారసత్వాలను బద్దలు కొట్టాయి. ఫలితంగా గుమస్తా వర్గాన్ని తయారుచేయడానికి కొత్త విద్యా విధానం దోహద పడింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి వారు అనేక చర్యలు చేపట్టి విద్యా విధానం ద్వారా భారతీయ కాన్వాస్‌పై ఇంగ్లీష్ రంగులు అద్దడానికి ప్రయత్నించారు. వ్యాపారం చేసి లాభాలు దండుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఉన్న ఈస్టిండియా వారు మొదట్లో విద్యా విధానంపై పెద్దగా శ్రద్ధ పెట్టలేదు. భారతదేశంలో పరిపాలన కొనసాగించడానికి ఉన్నత మధ్య తరగతి వర్గాలలో నుంచి కొంతమందిని విద్యావంతులను చేయాలని వారు అనుకున్నారు. చదువుకున్న ఈ కొత్త వర్గం రక్త గతంగా భారతీయులై ఉండాలి. అభిరుచి పరంగా ఆంగ్లేయులై ఉండాలి. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వీరు సంధాన కర్తలుగా వ్యాఖ్యాతలుగా ఉండాలి. దీనిని డౌన్ వర్డ్ ఫిల్ట్రేషన్ థియరి అన్నారు. గ్రంథాల ఆధారంగా చరిత్రలోకి తొంగిచూసినప్పుడు బ్రిటిష్ హయాంలో విద్య అభివృద్ధియొక్క కాలానుగత క్రమం ఇలా ఉంది.

**ఏ) 1813 చట్టం - విద్య :**

i. క్రైస్తవాన్ని బోధించడానికి పాశ్చాత్య సాహిత్యాన్ని చెప్పడానికి ఆంగ్లం ద్వారా విద్యావ్యాప్తికి ఈస్టిండియా కంపెనీ దారులు వేయాలని జోక్యం చేసుకోని విధానాలకు స్వస్తి చెప్పాలని మిషనరీ కార్యకర్తలు అయిన చార్లెస్ గ్రాంట్, విలియం వైబర్ ఫోర్స్ ఒత్తిడి తీసుకొచ్చారు. అందువల్ల 1813 చార్టర్‌లో బ్రిటిష్ పార్లమెంట్ ఒక క్లాజ్/నిబంధన చేర్చింది. దీని ప్రకారం క్రైస్తవ మిషనరీలు

వారి మత భావనలను భారతదేశంలో వ్యాపింపజేయడానికి అనుమతి లభించింది.

ii. భారతదేశంలో విద్యను వ్యాప్తి చేయాలని అభివృద్ధి చేయాలని బ్రిటిష్ ఈస్ట్ ఇండియా మొదటిసారి గుర్తించి నందున ఈ చట్టానికి ప్రాధాన్యం ఏర్పడింది.

iii. రాజా రామ్మోహన్‌రాయ్ చొరవతో పాశ్చాత్య విద్య బోధించడానికి కలకత్తా కాలేజ్ స్థాపించబడింది. కలకత్తాలోనే మరో మూడు సంస్కృత కళాశాలలు కూడా ఏర్పాటు చేశారు.

**బి) జనరల్ కమిటీ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్, 1823 :**

భారతదేశంలో విద్యాభివృద్ధి తీరుతెన్నులు పరిశీలించడానికి ఈ కమిటీ ఏర్పడింది. ఆంగ్లేయ విద్య కన్నా ప్రాచ్య విద్యకు మద్దతునిచ్చే వారి ఆధిక్యాన్ని నిలవరించడం దీని ధ్యేయం. అందువల్ల పాశ్చాత్య విద్య అభివృద్ధి చేయడానికి వీరు బ్రిటిష్ ఇండియా కంపెనీపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చారు. ఫలితంగా భారతదేశంలో విద్యావ్యాప్తి అనేది ప్రాచ్య విద్య అభిమానులకు/ఓరియంటలిస్టులు ఆంగ్ల విద్యా అభిమానులకు మధ్య వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో బ్రిటిష్ విద్యా విధానం పై స్పష్టమైన అవగాహనతో మెకాలే తీర్మానం ముందుకొచ్చింది.

**సి) లార్డ్ మెకాలే విద్యా విధానం 1835**

i. ఆంగ్లం ద్వారా సమాజంలోని ఉన్నత శ్రేణి వ్యక్తులకు విద్యనందించే ప్రయత్నం ఈ విధానంలో ఉంది.

ii. పర్షియా భాష రద్దయి ఆంగ్లం న్యాయస్థానం భాషగా రూపొందింది.

iii. ఆంగ్ల గ్రంథాల ముద్రణ దాదాపు ఉచిత మై పోయింది. చాలా చౌకగా ఈ పుస్తకాలు లభించేవి.

iv. ప్రాచ్య విద్యతో పోలిస్తే ఆంగ్ల విద్యకు నిధులు ఎక్కువగా లభించేవి.

v. 1849లో JED Bethune బెథూన్ పాఠశాల స్థాపించారు.

vi. బీహార్లోని పూస వద్ద వ్యవసాయ సంస్థ ఏర్పాటు అయింది.

vii. రూర్కీలో ఇంజనీరింగ్ సంస్థ స్థాపించబడింది.

**డి) Wood Dispatch, 1854**

i. భారతదేశంలో ఆంగ్ల విద్యకు ***హక్కులపత్రం***గా దీన్ని పరిగణించారు. భారతదేశంలో విద్యావ్యాప్తికి సమగ్ర ప్రణాళిక దీంట్లో ఉంది.

ii. ప్రజలకు విద్యను చేరువ చేయడం ప్రభుత్వం బాధ్యత అని ఇది స్పష్టం చేసింది

iii. క్రమానుగత అంచెలంచెల విద్య పద్ధతిని ఇది సిఫార్సు చేసింది. అట్టడుగు స్థాయిలో ప్రాంతీయ భాష లోని ప్రాథమిక పాఠశాల జిల్లా స్థాయిలో ఆంగ్ల భాష మరియు ప్రాంతీయ భాషలతో ఉన్నత పాఠశాలలు మరియు మద్రాసు ప్రెసిడెన్సీ, బాంబే, కలకత్తా విద్యాలయాల అనుబంధ కళాశాలలు, విశ్వవిద్యా లయాలు

iv. పాఠశాల స్థాయిలో ప్రాంతీయ భాష, ఉన్నత విద్యా స్థాయిలో ఆంగ్లంలో బోధన.

## ఇ) హంటర్ కమిషన్ 1882- 83 :

i. 1882లో డబ్ల్యూ డబ్ల్యూ హంటర్ నేతృత్వంలో ఈ కమిషన్ ఏర్పడింది. 1854లోని వుడ్ డిస్పాచ్ సాధించిన విజయాలను అంచనా వేయడానికి దీన్ని రూపొందించారు

ii. ప్రాథమిక సెకండరీ విద్యల వ్యాప్తి అభివృద్ధి లో ప్రభుత్వ పాత్ర గురించి ఇది నొక్కి చెప్పింది.

iii. జిల్లా మునిసిపల్ బోర్డులకు నియంత్రణను బదిలీ చేసే అంశం గురించి ఇది నొక్కి చెప్పింది

iv. సెకండరీ విద్య రెండు విభాగాలుగా ఉండాలని సిఫార్సు చేసింది. విశ్వవిద్యాలయ స్థాయి వరకు సాహిత్య సంబంధమైన చదువు, జీవనోపాధి కోసం వృత్తిపరమైన చదువు.

## ఎఫ్) సడ్లర్ కమిషన్ :

i. కలకత్తా విశ్వవిద్యాలయం సమస్యలపై అధ్యయనం చేయడానికి దీన్ని రూపొందించారు. వీరి సిఫార్సులు ఇతర విశ్వవిద్యాల యాలకు కూడా వర్తిస్తాయని చెప్పారు.

ii. వారి పరిశీలన ఈ రకంగా ఉంది

I. 12 సంవత్సరాల పాఠశాల కోర్సు

II. ఇంటర్మీడియట్ తరువాత మూడు సంవత్సరాల డిగ్రీ కోర్స్

III. విశ్వవిద్యాలయాల కేంద్రీకృత నిర్వహణ. కేంద్రీకృత ఆవాస బోధనతో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ.

IV. అనువర్తిత సైన్సు మరియు టెక్నాలజీ విద్య, ఉపాధ్యాయ శిక్షణ, స్త్రీ విద్యలకు విస్తృత సౌకర్యాలకు సిఫారసు.

**16.** అందువల్ల బ్రిటిష్ విద్యా విధానం క్రైస్తవ మిషనరీల కోరికలకు అనుగుణంగా ప్రభావితమైంది అని చెప్పవచ్చు. బ్రిటిష్ వారి వ్యాపార అవసరాలకు, పరిపాలనలో గుమస్తా వర్గాన్ని పెంచడానికి విద్యావంతులైన భారతీయులను చౌకగా అందించే దిశగా ఈ విద్యా విధానం కొనసాగింది. అందుకే విద్యా బోధన ఆంగ్ల మాధ్యమంలో కొనసాగాలని వారు ఒత్తిడి తెచ్చారు. పనిలో పనిగా బ్రిటిష్ పరిపాలనను, బ్రిటిష్ విజేతలను కీర్తించే పని పెట్టుకున్నారు.

**17.** భారతదేశంలో విద్యా చరిత్ర మరో కోణాన్ని కూడా వర్ణించింది. 1847 జనవరి 1న జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ఆడ పిల్లలకు శూద్రులకు పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈస్టిండియా కంపెనీ గవర్నర్ లు భారతదేశంలో అక్షరాస్యత పెంచడానికి ఆంగ్ల మాధ్యమం ఆధారంగా కొన్ని అదనపు సౌకర్యాలు కలిగించే ప్రయత్నం చేశారు.1853 లో విద్యలో జరిగిన అభివృద్ధిని వేయడానికి మొదటిసారిగా ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ స్థానిక విద్య ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పింది.1857 యుద్ధం తర్వాత సర్ విలియం విల్సన్ హంటర్ అధ్యక్షతన 1882లో మరో కమిటీ ఏర్పడింది. ఆ కమిటీ నివేదికలో రిజర్వేషన్ లతో కూడిన ఉచిత నిర్బంధ విద్య కోసం జ్యోతిరావు పూలే డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్య **స్థానిక భాషలో** ఉండాలని, సెకండరీ విద్య **ఆంగ్ల మాధ్యమంలో** ఉండాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. కానీ ప్రాథమిక విద్యకు తగినంత ప్రోత్సాహం లభించలేదు. ఈ లోపు 1870లో విద్యా రంగంలో కొత్త

శకం మొదలైంది. బాలగంగాధర్ తిలక్ పుణేలో ఫెర్గుసన్ కాలేజ్ ప్రారంభించారు. లాహోర్లో దయానంద్ ఆంగ్లో వేదిక్ కాలేజ్‌ను ఆర్య సమాజ్ ప్రారంభించింది. అనిబిసెంట్ కాశీలో సెంట్రల్ హిందూ కాలేజ్ ప్రారంభించారు. వీటిలో **ప్రాథమిక విద్య స్థానిక భాషలలో**నూ సెకండరీ విద్య **ఆంగ్ల మాధ్యమం**లోను బోధింప పడుతుండేది.

**18.** **1911** నుంచి గోపాలకృష్ణ గోఖలే ప్రాథమిక స్థానిక భాషలలో బోధిస్తున్న విద్యను ఉచిత నిర్బంధ విద్యగా మార్చే ప్రయత్నం చేశారు. మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా అది అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల సభ్యత్వంతో కలకత్తా యూనివర్సిటీ కమిషన్ ఏర్పడింది. అది పాఠశాల విద్య ఇంటర్మీడియట్ విద్య బోర్డులను ఏర్పాటు చేసింది. ఢాకా విశ్వవిద్యాలయ స్థాపన, కలకత్తాలో కళాశాలల స్థాపన, ముస్లింలకు విద్య, స్త్రీ శిక్ష (మహిళలకు విద్య) వాణిజ్య పారిశ్రామిక విద్యలు ఆ సమయంలో ఏర్పాటు అయ్యాయి. బాంబే బెంగాల్ బీహార్ అస్సాంలలో ప్రాథమిక స్థానిక విద్యలలో చట్టాలు చేయడం మొదలైంది. దీంతోపాటు సెకండరీ విద్యలో అభివృద్ధి కూడా మొదలైంది. ఈ సమయంలో సహాయ నిరాకరణ ఉద్యమం తర్వాత జాతీయ విద్య ఊపందుకుంది. వీటిలో స్థానిక భాషలకే ప్రాధాన్యం ఇచ్చారు.

**19.** **1919-22** ప్రాంతాలలో మహాత్మా గాంధీ ఆంగ్ల భాష ఆధారంగా నడుస్తున్న విద్యా విధానాన్ని వ్యతిరేకించారు. దీనికి గోఖలే మొదలైనవారు మద్దతు పలికారు. దేశీయ సంస్కృతిని విడనాడి విదేశీ సంస్కృతిపై ఆధారపడి ఉన్నందువల్ల ప్రస్తుత విద్యా విధానం లోపభూయిష్టంగా ఉందని ఆయన వివరించారు. ఈ విద్య హృదయ వికాసానికి

కర్మకుశలతకు తోడ్పడదని, వ్యక్తుల బుద్ధివికాసానికి మాత్రమే పరిమిత మైనదని అన్నారు. విదేశీ మాధ్యమం ద్వారా నిజమైన విద్య పొందడం అసాధ్యం అని స్పష్టం చేశారు. ఆ తర్వాత 1921లో మాధ్యమిక పాఠశాలలలో మాతృభాష బోధన భాషగా ఉండటం మొదలైంది. 1937 కల్లా దాని వినియోగం ఉన్నత పాఠశాలలకు కూడా కొనసాగించపడింది. 1935 భారత ప్రభుత్వ చట్టం భారతదేశానికి స్వతంత్ర ప్రతిపత్తి కోరడంలో ప్రారంభ దశగా పరిగణింపబడింది. 1937లో అధికారంలోకి వస్తామని భావించి మంత్రులందరూ విద్య ప్రణాళికల రూపకల్పనలో నిమగ్న మయ్యారు. బోధన మాధ్యమంగా స్థానిక భాషలు ఉండాలని సెకండరీ విద్య మాత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉండాలని ప్రతిపాదించారు. వుడ్ అబట్ నివేదిక (1936-37)లో కొన్ని సిఫార్సులు చేయబడ్డాయి. ఇది Basic Edn.కు పూర్వరూపం. 1937లో ప్రతిపాదించిన ప్రణాళిక ప్రాథమిక విద్యా విషయాల్లో ముందంజలో ఉంది. 7 నుండి 11 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు నిర్బంధ విద్యను మాతృభాషలో భారతీయ అధ్యయన అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ అందించాలని ప్రతిపాదించారు. 1965లో నయీ తాలీమ్ విద్యా విధానం రూపొందించబడింది. దీంట్లో నాలుగు విభాగాలు ఉన్నాయి. 1. పూర్వ ప్రాథమిక విద్య 2. ప్రాథమిక విద్య 3. ప్రాథమికోన్నత విద్య 4. వయోజన విద్య 1945లో రెండో ప్రపంచ యుద్ధం జరిగిన తరువాత పద్నాలుగేళ్ళ వరకు నయీ తాలిమ్ ప్రకారం బాలబాలికలకు విద్య నిర్బంధం చేయబడింది.

*రెండో ప్రశ్న :*

*మాతృభాష, స్థానిక భాష, హిందీ అభివృద్ధిపై స్వతంత్ర పూర్వం నుండి స్వతంత్రానంతరం వరకు ఉన్న ప్రముఖుల అభిప్రాయాలు ఏమిటి?*

**ప్రపంచం మొత్తాన్ని మార్చివేయగల స్వేచ్ఛ అనే బంగారువాకిలిని తెరవడానికి పనికి వచ్చే శక్తివంతమైన పనిముట్టు విద్య**

**20.** పాఠశాలలలో ప్రాంతీయ భాషలు/ మాతృభాషను జాతీయ భాషగా హిందీ వాడటం గురించి న్యాయకోవిదులు అనేక మంది ప్రముఖులు వారి వారి అభిప్రాయాలను ప్రకటించారు. ఈ విషయంలో అందరి అభిప్రాయాలను ఉటంకించడం సాధ్యం కాదు కాబట్టి కొంత మంది ఎంపిక చేసిన వ్యక్తుల అభిప్రాయాలను ఉటంకిస్తున్నాం. ఈ విషయంలో ఇవి మార్గదర్శనం చేస్తాయి. భారతదేశ దిగ్గజం **స్వామి వివేకానంద** మాతృభాషపై ప్రకటించిన అభిప్రాయం. దీనిని **ది కంప్లీట్ వర్క్స్ ఆఫ్ స్వామి వివేకానంద, 9** సంపుటాలు నుండి గ్రహించడం జరిగింది. మాతృభాషకు సంబంధించినంతవరకు వారి అభిప్రాయం ఇలా ఉంది.

"ఉదాత్తమైన భావనలను వ్యక్తీకరించడానికి అన్ని భాషలు సమర్థమైన వే అయినా విజ్ఞానాన్ని ఆలోచనలను సమాచారాన్ని ప్రసారం చేయడానికి మాతృభాష అత్యుత్తమమైన సాధనం అని ఆధునిక ఆలోచనాపరులు విశ్వసిస్తున్నారు. ఒక వ్యక్తి తన జీవితంలో తర్వాత దశలో నేర్చుకున్న భాషలలో కన్నా మాతృభాషలో విషయాలను చాలా సులభంగా గ్రహించగలడు. శరీరానికి రక్తం ఎలాంటిదో బుద్ధికి మాతృ భాష అటువంటిది. అందువల్ల పిల్లలకు మాతృభాషలో బోధించడం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయి. నేర్చుకోవడం, భాష అనే రెండు అంశాలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్న విషయాలు అని చెప్పడానికి తగిన ఆధారాలు ఉన్నాయి. సొంత భాషలో చెబితే ప్రతి మనిషికి విషయాలను గ్రహించగలిగే సామర్థ్యం ఉంటుంది."

**21.** పరివర్తనకు మాతృ భాష ను మించినది లేదని వివేకానంద స్వామి అభిప్రాయం. మాతృభాషలో విషయగ్రహణం చాలా సులభంగా జరుగుతుంది. అందువల్ల పిల్లలకు మాతృభాషలో బోధించడంవల్ల మెరుగైన ఫలితాలు వస్తాయి. నేర్చుకోవడం, భాష అనే రెండు అంశాలు సన్నిహిత సంబంధం కలవి. స్వీయ భాషలో బోధన జరిగితే పిల్లవాడు విషయ గ్రహణం సులభంగా చేయగలుగుతాడు. అందరూ ఆమోదించిన భాష చిరకాలం జీవిస్తుంది అంటారు. ఈ సందర్భంలో **నెల్సన్ మండేలా** మాటలు స్మరణీయములు. *ఒక వ్యక్తికి అర్థమయ్యే భాషలో నీవు మాట్లాడితే అది అతని బుద్ధికి చేరుతుంది. అదే అతని సొంత భాషలో చెబితే విషయం అతని హృదయానికి చేరుతుంది.*

**22.** ఆంగ్ల భాష మన హృదయాల్లో సన్నిహితమైన స్థానాన్ని ఆక్రమించుకున్నదని **మహాత్మాగాంధీ** చెప్పారు. తల్లితో పోలుస్తూ *'తల్లిపై ఉన్నంత ప్రేమ మన భాషపై మనకు లేదు''* అని ఆయన అన్నారు. **"1921లో యంగ్ ఇండియా పత్రికలో"** *మాతృ స్తన్యానికి అంటి పెట్టుకొని ఉన్నట్లు ఎన్ని లోపాలున్నా మాతృ భాషకు అంటిపెట్టుకొని ఉండాలని ఆయన అన్నారు. జీవన ప్రదాయిని అయిన స్తన్యమును అది మాత్రమే అందించగలదని ఆయన అన్నారు.* (హరిజన్ 1946). ఆంగ్లంతో ప్రమేయం లేకుండా వైజ్ఞానిక ప్రగతి సాధించిన రష్యాను ఉదాహరిస్తూ గాంధీజీ ఇలా పునరుద్ఘాటించారు'' *ఈ అగాధాన్ని సృష్టించింది మన మానసిక భావనయే! ఆంగ్లం లేకపోతే మనం ఏమి చేయలేమనే భావన మనం భావదాస్యం తప్ప మరొకటి కాదు. అటువంటి పరాజయ భావనకు నేనెప్పుడూ ఆమోదాన్ని తెలుపను. గుజరాత్‌లో* జరిగిన రెండవ విద్యా

సదస్సులో 1917 అక్టోబర్ 20వ తారీఖున ఇచ్చిన ఉపన్యాసంలో *"ఆంగ్లం అన్ని ప్రమాణాలకు దీటుగా నిలబడలేదు. కానీ హిందీకి ఆ శక్తి ఉంది"* అన్నారు గాంధీజీ. లండన్‌లో ఉన్నప్పుడు 1909లో *మాతృభాష! జాతీయ భాష!* అనే వ్యాసం రాస్తూ" కొంతమంది ఆంగ్లభాషను మాతృభాషకన్నా ఆంగ్ల భాషలోనే తమకు నైపుణ్యం ఎక్కువగా ఉన్నదని చెప్పుకోవడం సిగ్గుచేటు వ్యవహారమని అన్నారు. *దేశానికి, ప్రజలకు సేవ చేయాలి అనుకున్నవారు మాతృభాషకు కూడా సమయాన్ని కేటాయించాలని* ఆయన అభిప్రాయపడ్డారు. *ఆంగ్లం నేర్చుకోవడానికి మాతృభాషను బలి పెట్టాల్సి వస్తే దేశ హితం దృష్ట్యా ఎప్పటికీ ఆంగ్లం నేర్చుకోకపోవడమే మంచిదని* అన్నారు. **ద మైండ్ ఆఫ్ మహాత్మాగాంధీ** అనే పుస్తకంలో *శిశువు ప్రథమ పాఠాలు తల్లి నుంచి నేర్చుకుంటుంది. అందువలన శిశువుల మానసిక అభివృద్ధి కోసం వారి మాతృభాష ను కాకుండా మరో భాషను వారిపై రుద్దటం మాతృభూమి పట్ల మహా అపచారం చేసినట్లుగా నేను భావిస్తాను* అన్నారు గాంధీ.

**23.** **రవీంద్రనాథ్ ఠాగూర్ సిక్సర్ హేర్ ఫేర్** (1299 B.S) అనే తన గ్రంథంలో అనుకూల పరిసరాల మధ్య ఉత్సాహంతో ఉరకలెత్తేట్లుగా నిర్వహింపబడే విద్యా వ్యవస్థ అవసరాన్ని నొక్కి చెప్పారు. ఒక వ్యక్తి సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా విద్య ఉండాలని ఆయన వాదిస్తారు. వాస్తవ జీవితంతో ప్రశాంతంగా సర్దుకుపోవడానికి ఇది చాలా అవసరం అంటారాయన. పిల్లవాడి అన్ని రకాల విద్య అవసరాలు తీరి విద్యాపరంగా అతను పుష్టిగా ఉండాలంటే మాతృభాష అవసరం చాలా ఉందని ఆ గ్రంథం చెబుతుంది. మాతృభాష విలువను అది నొక్కి చెప్పింది. విద్యలో మాతృభాష స్థానం గురించి తనకు ఉన్న నిశ్చిత అభిప్రాయాల గురించి

ఠాగూర్ తన సంపాదకీయ శీర్షిక 'సాధన'లో చెప్పారు. బాల్యం నుంచి ఇంగ్లీష్ ను ఒక భాషగా బోధించాలని, అవసరం మేరకు తగు మోతాదులో మాతృభాషకి పరిపూరకంగా మాత్రమే ఆంగ్లం ఉండాలని ఆయన చెప్పారు.

**24.** **డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్** గారి దృష్టిలో విద్య పరమార్థం వ్యక్తిని భగవంతుడికి సన్నిహితంగా చేర్చడమే! ఆయన దృష్టిలో విద్యకున్న పలు కోణాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ఆయన మనిషికి మనిషికి మధ్య సమానత్వము తీసుకురాగల వర్గరహిత సమాజాన్ని విద్యద్వారా స్థాపించాలని కోరుతున్నారు. మనిషికి విద్య ద్వారా విశ్వమానవ సౌభ్రాత్రం సాధింపబడాలని ఆయన కోరుకున్నారు. స్థల కాలాలకు అతీతంగా ఉన్న అదృశ్యంగా ఉన్న ఇంద్రియ గ్రాహ్యము కాని మరో ప్రపంచాన్ని చూడడానికి సహాయ పడటమే విద్య ఉన్న అతి ముఖ్యమైన లక్ష్యం. మనలో ఉన్నదేదో మనం తెలుసుకోవడానికి సహాయపడే మరో జన్మని విద్య మనకు అందివ్వాలి. నిరాడంబరంగా జీవించడం ఉన్నతంగా ఆలోచించడం అనే దృక్పథాన్ని అలవరచుకునేలా చేయాలి విద్య. విద్య నిజమైన పరమార్థం వ్యక్తికి రెండవ జన్మని ఇవ్వడమే అని ఋషి పరంపర చెప్పింది. ప్రకృతి, అవసరం ఉన్న ప్రపంచంలో మనం జన్మించాం. మనం ఆత్మశక్తి, స్వేచ్ఛ ఉన్న ప్రపంచంలో తిరిగి జన్మించాలి. మౌనము ధ్యానముల ద్వారా మనలో ఉన్న ఆత్మను మనం కనుగొనగలము. సత్యము ప్రేమలను అనుష్ఠానం చేయగలం. బలము దయ పొందగలం. వీటి ద్వారా మన ఆలోచనలను అమలు పరచగలం.

**25.** పైన పేర్కొన్న అభిప్రాయాల ప్రకారం మాతృభాష మార్పును పొందటానికి మంచి మాధ్యమం. మాతృభాషకాక ఇతర భాషను విద్యలో

వినియోగించడం పాపం. అది పిల్లల మానసిక అభివృద్ధిపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. మాతృభాష విద్యాభాష కావాలి. తగు మోతాదులో ఇంగ్లీషును నేర్చుకోవాలి. విద్యకు లక్ష్యం రెండోజన్మ. ఏమైనా మన భావాలను అమలు చేయడానికి కావలసిన ప్రేమను, యుక్తిని, శక్తిని పెంపొందించుకోవాలి.

**ప్రశ్న సంఖ్య 3 :**

*భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్యలో బోధన మాధ్యమానికి సంబంధించి స్వతంత్రానంతర మార్పులు ఏమిటి?*

**26.** స్వాతంత్ర్యం వచ్చిన తరువాత **15-8-1947** నుండి హిందీ భారత జాతీయ భాషగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది. అప్పటికే ఆ విషయంపై విస్తృతంగా చర్చోప చర్చలు జరిగాయి. ఆ తర్వాత హిందీని జాతీయ భాషగా, మిగతా ప్రాంతీయ భాషలను రాజ్యాంగంలో చేర్చడంపై రాజ్యాంగ పరిషత్‌లో చర్చ జరిగింది. హిందీని జాతీయ భాషగా ఆమోదిస్తూ స్థానిక భాషలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. రాజ్యాంగంలోని viii వ షెడ్యూల్లో వీటికి చోటు కల్పించారు.

**27.** డాక్టర్ ఎస్ రాధాకృష్ణన్ గారి అభిప్రాయం ప్రకారం పాఠ్యాంశాలు కచ్చితంగా జీవితానికి సంబంధించినవై ఉండాలి.1949లో ప్రచురితమైన యూనివర్సిటీ కమిషన్ నివేదిక లో ఆయన పాఠ్యాంశాల కు సంబంధించి వారి భావనలను నిర్వచించారు. అనుసంధాన భాషగా ఆంగ్లాన్ని, సమాఖ్య/జాతీయ భాషగా హిందీని, మాతృభాష లేదా ప్రాంతీయభాష నమూనాలో త్రిభాషా అధ్యయనాన్ని వారు సూచించారు. సంస్కృత

భాష అధ్యయనానికి వారు ప్రాధాన్యం ఇచ్చారు. ఉపనిషత్తుల్లో వేదాల్లో భగవద్గీతలో ఇంకా తదితర ఈ పవిత్ర గ్రంథాలలో వర్ణించబడిన ఉత్తమ భావాలను, దేశీయ సంస్కృతిని అర్థం చేసుకోవడానికి సంస్కృత పరిజ్ఞానం అత్యావశ్యకమని రాధాకృష్ణ గారు పేర్కొన్నారు. కింది తరగతులలో మాతృభాషలోనే బోధన ఉండాలని వారు నొక్కి చెప్పారు. పై తరగతులకు వెళ్లేకొద్దీ క్రమంగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టవచ్చును అన్నారు. పాఠ్యాంశాలలో మత, ఆధ్యాత్మిక అంశాలు, స్త్రీ విద్య, సామూహిక విద్య మొదలైన అంశాలను చేర్చాలని ఆయన సూచించారు.

**28.** భారతదేశంలో విద్యాభివృద్ధి కోసం అనేక కమిటీలు ఏర్పాటయ్యాయి. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్/రాధాకృష్ణన్ కమిషన్ 1948-49, ప్రాథమిక విద్యపై బి.జి. ఖేర్ కమిటి 1951, సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్ 1952-53, అధికారభాషా కమిషన్ 1956, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్/కుంజురు కమిటీ రిపోర్ట్, ఎడ్యుకేషన్ కమిషన్/కొఠారి మిషన్ 1964- 66, డాక్టర్ TRIGUN సేన్/ఉన్నత విద్యా కమిటీ రిపోర్టు 1967, ద స్టడీ గ్రూప్ రిపోర్ట్స్ ఆన్ ద టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్ 1967-71. కానీ స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన కమిటీలలో మాతృభాషలో బోధన అనే అంశానికి సంబంధించిన విషయాలు **రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ 1955లో** కనిపిస్తాయి. అందులోనూ 775 పేరాలో ఈ విషయం వివరంగా ఉంది. ఆ పేరా ప్రకారం 1949 ఆగస్టులో జరిగిన **ప్రాంతీయ విద్యాశాఖ మంత్రుల సమావేశంలో** ఒక తీర్మానం చేశారు. భారత ప్రభుత్వం దీనిని ఆమోదించింది. ఒక నిర్దిష్ట భాషావ్యవహర్తలు ఉన్న ప్రాంతంలో ఒక పిల్లవాడి మాతృభాష ఆ నిర్దిష్ట భాష కాకుండా వేరేగా ఉన్నప్పుడు

పాఠశాలలో అతడికి ఎలాంటి ఏర్పాట్లు చేయాలి అనే సందేహం వచ్చినప్పుడు ఈ సమావేశ తీర్మానం రాష్ట్రాలకు మార్గదర్శనం చేస్తూ వచ్చాయి. ప్రస్తుత సందర్భానికి సరిపోయే ఆ నివేదికలోని కొన్ని అంశాలు ఇక్కడ యథాతథంగా పొందుపరుస్తున్నాం.

*775 కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1949 ఆగస్టులో, 1953 మేలో చేసిన తీర్మానాలలో ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నవారు వారి వారి మాతృభాషలో విద్యనభ్యసించే హక్కు వారికి ఉన్నట్లుగా గుర్తిస్తున్నారని చెప్పింది. ఆ విషయం ఇక్కడ పునః స్మరించుకోవాలి. ఈ హక్కును భారత ప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వాలు కూడా సూత్రప్రాయంగా గుర్తించాయి. 1949 ఆగస్టులో జరిగిన ప్రాంతీయ విద్యాశాఖ మంత్రుల సమావేశంలో ఒక తీర్మానంలో ఇది స్పష్టంగా ఉంది. భారత ప్రభుత్వం దీనిని ఆమోదించింది. ఒక నిర్దిష్ట భాషావ్యవహర్తలు ఉన్న ప్రాంతంలో ఒక పిల్లవాడి మాతృభాష ఆ నిర్దిష్ట భాష కాకుండా వేరేగా ఉన్నప్పుడు పాఠశాలలో అతడికి ఎలాంటి ఏర్పాట్లు చేయాలి అనే సందేహం వచ్చినప్పుడు ఈ కమిషన్‌లోని విషయాలు రాష్ట్రాలకు మార్గదర్శనం చేస్తూ వచ్చాయి. ఈ తీర్మానం చెప్పేది ఏమిటంటే.*

> *ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమం, పరీక్షలు పిల్లవాడి మాతృభాషలోనే ఉండాలి. ఒకవేళ ప్రాంతీయ లేదా రాష్ట్ర భాష కు పిల్లవాడి మాతృభాషకు భిన్నంగా ఉంటే కనీసం ఒక ఉపాధ్యాయుడినైనా నియమించి మాతృభాషలో బోధించే ఏర్పాటు చేయాలి. ఈ ఏర్పాట్లు చేయడానికి అటువంటి పిల్లలు తరగతికి కనీసం పదిమంది ఉండాలి లేదా పాఠశాల మొత్తం మీద 40 మందికి తగ్గకుండా ఉండాలి. ఈ సందర్భంలో తల్లిదండ్రులు లేదా సంరక్షకుడు ప్రకటించినది చెప్పినదే పిల్లవాడి మాతృభాష అవుతుంది. ప్రాంతీయ లేదా రాష్ట్ర భాష అటువంటి పిల్లలకి మూడవ తరగతి లోపల పరిచయం చేయకూడదు.*

*అలా అని ప్రాథమిక దశ అయిపోయేదాకా పరిచయం చేయకుండా ఉండకూడదు. అటువంటి పిల్లలు సెకండరీ విద్య ప్రాంతీయ లేదా రాష్ట్ర భాష మాధ్యమంలోనికి మారడానికి పూర్వ ప్రాథమిక స్థాయి తరువాత సమాధానాలను మొదటి రెండు సంవత్సరాలు వారి మాతృభాషలో ఇచ్చే వెసులుబాటు కల్పించాలి.*

**29.** మొదటి జాతీయ విద్యా విధానం (ఎన్ పి ఈ) 1968లో వచ్చింది. దీంట్లో ఉన్న విధి విధానాల ప్రకారం దేశంలో విద్యాభివృద్ధి చేపట్టాలని భారత ప్రభుత్వం తీర్మానించింది. వీటిలో మొదటిది ఉచిత నిర్బంధ విద్య. రెండవది ఉపాధ్యాయుల విద్య, జీతభత్యాలు, హోదా మొదలైన వాటికి సంబంధించినది. మూడోది భాషాభివృద్ధికి సంబంధించినది. భాషాభివృద్ధికొరకు, ప్రత్యేకించి స్థానిక భాషల విషయంలో, విద్య మరియు సాంస్కృతిక అభివృద్ధి కోసం, స్థానిక భాషా సాహిత్యాల చురుకైన అభివృద్ధి అత్యంత ఆవశ్యకం. ఇది జరగకపోతే, ప్రజలలోని సృజనాత్మక శక్తులు బహిర్గతం కావు. విద్యా ప్రమాణాలు పెరగవు. ప్రజలకు విజ్ఞానం చేరువ కాదు. విస్తృతమవుతూ ముందుకు పోకపోతే సామాన్యులకు మేధావులకు మధ్య అంతరాలు కొనసాగుతాయి. ప్రాంతీయ భాషలు ప్రాథమిక స్థాయిలో సెకండరీ స్థాయిలోనూ బోధనా మాధ్యమంగా ఇప్పటికే కొనసాగుతున్నాయని జాతీయ విద్యావిద్యావిధానం ఈ గుర్తించింది. విశ్వవిద్యాలయ స్థాయిలోను బోధనా మాధ్యమంగా ప్రాంతీయ భాషలను తక్షణమే తప్పనిసరిగా ప్రవేశపెట్టాలని స్పష్టం చేసింది. ఎన్.పి.ఇ. 1968 -డాక్టర్ ఎస్ రాధాకృష్ణన్ గారు వ్యాప్తి చేసిన త్రి భాష సూత్రాన్ని సెకండరీ స్థాయిలో పరిచయం చేసింది. హిందీ వ్యవహర్తలు ఉండే రాష్ట్రాలలో హిందీ ఇంగ్లీష్ మినహాయించి ఒక ఆధునిక భారతీయ భాషను

అధ్యయనం చేయాలని, అందులోనూ అది దక్షిణ భారతదేశ భాష అయితే బాగుంటుందని సూచించింది. హిందీ మాతృభాష కాని రాష్ట్రాలలో హిందీతోపాటు ప్రాంతీయ భాష, ఇంగ్లీష్ అధ్యయనం చేయాలని చెప్పింది. హిందీ భాషకు ప్రోత్సాహం కల్పించడం, ఒక అంతర్జాతీయ భాషతో పాటు సంస్కృత భాషలో తగినంత పరిజ్ఞానం ఉండడం వంటి ఇతర అంశాలను కూడా నొక్కి చెప్పింది. NPE లోని ఇతర అంశాలు ప్రస్తుత అంశానికి/ కేసు కు అంతగా సంబంధించి నవి కాదు. ఏది ఏమైనా వాటిని ప్రస్తావించడం లేదు. ఎంతో పటిష్టంగా రూపొందించిన త్రిభాషా సూత్రం అన్ని రాష్ట్రాలు చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. కానీ ఇది అమలుకు నోచుకున్నచోట మాత్రం ఫలితాలు బాగున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో ఒక్క తమిళనాడు తప్ప మిగతా అన్ని రాష్ట్రాలు త్రిభాషా సూత్రాన్ని చాలా ఉత్సుకతతో అమలు చేశాయి. ప్రజలలో బహు భాష తత్వాన్ని ప్రోత్సహించే త్రిభాషాసూత్రం ఓ మంచి భాషావిధానంగా పరిగణింపబడింది.

**30.** భాష, విద్యలకు సంబంధించి UNESCO మార్గదర్శకాలలో క్లాజ్ I.లోని సూత్రం I ప్రాథమిక విద్యా స్థాయిలో బోధన మాధ్యమంగా మాతృభాషకున్న ప్రాధాన్యానికి, అక్షరాస్యతకు సంబంధించినది. విద్యలో ఎంతవరకు సాధ్యమైతే అంతవరకు మాతృభాషలో బోధన పెంచుకుంటూ పోవాలి. తత్సంబంధ మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి.

1) **"ప్రాథమిక బోధన, అక్షరాస్యత/ అక్షర జ్ఞానం మాతృభాషలో ఉండటం అత్యంత ఆవశ్యకం. విద్యలో ఎంతవరకు సాధ్యమైతే అంతవరకు మాతృభాషలో బోధన పెంచుకుంటూ పోవాలి.**

- ప్రతి విద్యార్థి/ విద్యార్థిని లాంఛనంగా విద్యను అతని/ ఆమె మాతృభాషలోనే ప్రారంభించాలి.
- నిరక్షరాస్యులైన వయోజనులు అక్షర జ్ఞానాన్ని మాతృభాషలోనే ప్రారంభించాలి. మరొక భాషలోకి మారడం అనేది వారి కోరిక, యోగ్యతలపై ఆధారపడి ఉంటుంది.
- ఒక నిర్దిష్ట ప్రాంతంలో భిన్న భాషలు ఉంటే వ్యవహర్త లకు వారి వారి మాతృభాషలోనే బోధన జరపడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలి.
- మిశ్రిత భాషా వ్యవహర్తలు ఉండటం తప్పనిసరి అయితే ఎక్కువ మంది ప్రజలకు అర్థమయ్యే భాషలో బోధన ఉండాలి. బోధన భాష మాట్లాడ లేని వారికి ప్రత్యేక సహాయం అందేలా చూడాలి.”

**31.** నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్ 2005 (ఎన్.సి.ఎఫ్) కూడా త్రిభాషా సూత్ర ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ, భారతదేశంలో ఉన్న భాషా స్థితిగతులకు సంబంధించి సమస్యలను ఎదుర్కోవడానికి అవకాశాలను వినియోగించు కోవడానికి త్రిభాషా సూత్రం పనికొస్తుందని భావించింది. మరిన్ని భాషలు నేర్చుకోవడానికి ఇటువంటి వ్యూహం ప్రయోగాత్మకంగా పనికొస్తుందని నిరూపించబడింది. కానీ దీనిని చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయి. దీనికి సంబంధించిన NCF మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి.

**3.1.1. భాషావిద్య**

భాషా బోధనలో బహు భాషా బోధన ఉండడం అవసరం. ఇది పిల్లలకు

అనేక భాషలు నేర్పించడంలో మాత్రమే కాదు. బహుభాషా తరగతి గదిని ఒక వనరుగా వాడుకోవడానికి తగిన వ్యూహాలు రూపొందించుకోవడానికి కూడా పనికొస్తుంది.

3.1 లో నిర్వచించినట్లు పిల్లల ఇంటి భాష (లు) పాఠశాలలలో బోధన భాషగా ఉండాలి.

ఉన్నత స్థాయిలో పాఠశాలలలో పిల్లల ఇంటి భాషలలో బోధించే అవకాశం లేకపోతే కనీసం ప్రాథమిక స్థాయి విద్య ఇంటి భాషలలో జరిగేలా చూడాలి.

- ఉన్నత స్థాయిలో పాఠశాలల లో పిల్లల ఇంటి భాషలలో బోధించే అవకాశం లేకపోతే కనీసం ప్రాథమిక స్థాయి విద్య ఇంటి భాషలలో జరిగేలా చూడాలి. పిల్లవాడి ఇంటి భాషను గౌరవించడం మన విధి. రాజ్యాంగంలోని 350 A అధికరణం ప్రకారం రాష్ట్రాలు, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు ప్రాథమిక స్థాయిలో భాషా మైనారిటీ వర్గానికి చెందిన పిల్లలకు మాతృభాషలో బోధించడానికి తగిన వసతులు కల్పించే ప్రయత్నం చేయాలి.
- *పిల్లలు బహుభాషా విద్యను ప్రారంభం నుండి స్వీకరిస్తారు. బహుభాషా వ్యవహర్తలు ఉన్న దేశంలో బహుభాషా ప్రసార నైపుణ్యాలకు ఊతం ఇచ్చి త్రిభాషా సూత్రం చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం ఉంది.*
- *హిందీ మాతృభాష కాని రాష్ట్రాలలో విద్యార్థులు హిందీ నేర్చుకుంటారు. హిందీ మాతృభాషగా ఉన్న రాష్ట్రాలలో ఆ ప్రాంతంలో మాట్లాడని వేరే భాష నేర్చుకుంటారు. ~~ఈ~~ భాషలతో పాటు ఆధునిక భారతీయ భాషగా సంస్కృతాన్ని కూడా నేర్చుకోవచ్చు.*

- *తరువాతి దశలో క్లాసికల్ విదేశీ భాషా అధ్యయనాన్ని ప్రవేశపెట్టవచ్చు*
- *అందువల్ల NCF 3.1లో నిర్వచించినట్లు పిల్లల ఇంటి భాషను మాతృభాషగా భావించాలి. పాఠశాలలో అదే బోధన మాధ్యమంగా ఉండాలి.*

**32.** పై చర్చ ప్రకారం స్వాతంత్ర్య అనంతర శకంలో మొదటి జాతీయ విద్యా విధానం **1968**లో రూపొందింది. తర్వాతి రోజుల్లో **1986, 1992** లలో దానికి దశలవారీగా ఒక గుర్తింపు వచ్చింది. దాని ప్రకారం పిల్లలకు పాఠశాలలలో విద్య నేర్పించడానికి మాతృభాష తగినదని గుర్తింపబడింది. జూన్ **2017** లో మానవ వనరుల మంత్రిత్వ శాఖ జాతీయ విద్యా విధానం ముసాయిదా రూపకల్పన కోసం ఒక కమిటీని నియమించింది. డాక్టర్ కె. కస్తూరి రంగన్ అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీ **31-5-2019**న నివేదిక సమర్పించింది. దీంట్లో నాలుగవ అధ్యాయం పాఠశాలలలో పాఠ్యాంశాలు-బోధనకు సంబంధించినది. జాతీయ విద్యావిధానంలోని **4.5** క్లాజ్ మాతృభాష స్థానిక భాషలో విద్య, బహుభాషాత్వము - భాషా శక్తి అనే అంశాలకు సంబంధించినది.

4.5.1. బోధన మాధ్యమంగా మాతృభాష/స్థానిక భాష

సాధ్యాసాధ్యాలను పరిశీలించి కనీసం 5వ తరగతి వరకు సాధ్యపడితే ఎనిమిదవ తరగతి వరకు బోధన మాధ్యమం మాతృభాష/ఇంటి భాష/ స్థానిక భాషలో ఉండటం మంచిది. ఆ తర్వాత మాతృభాషను అవకాశాన్ని బట్టి ఒక భాషగా బోధిస్తూ ఉండవచ్చు. సైన్సు సహా మంచి నాణ్యత కలిగిన వాచకాలు అవసరానికి తగినట్లు ఆచరణాత్మకంగా ఉండేట్లుగా మాతృభాషలో అందుబాటులోకి తేవాలి. ఉదాహరణకు ఇండియన్ ట్రాన్స్లేషన్

అండ్ ఇంటర్‌ప్రిటేషన్ మిషన్ ద్వారా గాని ఆయా రాష్ట్రాల్లో ఉన్న సంబంధిత లేదా సమాన హోదా కలిగిన సంస్థల సహాయంతో ఈ పని చేయవచ్చు. ఈ రకంగా వాచకాలు అందుబాటులో లేకపోతే విద్యార్థికి ఉపాధ్యాయుడికి మధ్య వ్యవహార భాష అవకాశం ఉన్నంత వరకు మాతృభాషగానే ఉండాలి. వాచకాలు ఆయా రాష్ట్ర / ప్రాంతీయ భాషలలో ఉన్నా వ్యవహార భాష మాతృభాషలోనే ఉంటుంది. పాఠశాల విద్యా వ్యవస్థ ప్రాంతీయ ప్రాబల్యం కలిగిన భాషను బోధన మాధ్యమంగా ఉపయోగించడానికి శాయశక్తులా కృషి చేస్తుంది. ఏదేమైనా వ్యవస్థ కూడా ఒక నిర్దిష్ట ప్రాంతంలో గుర్తింపు పొందిన మైనారిటీ భాష బోధన మాధ్యమంగా ఉన్న తగినన్ని పాఠశాలలు నెలకొల్పడానికి పూర్తిగా ప్రయత్నించాలి.

**33.** నిజానికి ముసాయిదా ప్రతిని పూర్తి విధానంగా మార్చడానికి అభ్యంతరాలు ఉంటే చెప్పవలసిందిగా మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆహ్వానించింది. తుది నిర్ణయం తీసుకోవలసి ఉంది. భారతదేశంలో భాషాపరమైన భిన్నత్వంలో ఏకత్వ సూత్రాన్ని పరిశీలించినప్పుడు. స్వాతంత్ర్యానికి ముందు తర్వాత కూడా జాతీయ విద్యావేత్తలు, ఎన్సీఈఆర్టీ వారి వారి నివేదికలో మాతృభాషకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని విధానాలలో ను, అందరి అభిప్రాయాలలోను - విద్యార్థి విద్యను అభ్యసించడానికి వికాసాన్ని పొందడానికి మాతృభాష మాత్రమే తగినదని గుర్తింపు పొందింది.

**34.** 2007లో మత, భాష, మైనారిటీ జాతీయ కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ రిలీజియస్ అండ్ లింగ్విస్టిక్ మైనారిటీస్) ఏర్పడింది. చీఫ్ జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికను సమర్పించారు. త్రిభాషా సూత్రం జాతీయ సమైక్యతను పెంపొందిస్తుంది అంటూ దాని

ప్రాధాన్యాన్ని కమిషన్ తిరిగి గుర్తించింది. మైనారిటీ వర్గాలను ఇది జాతీయ జీవన ప్రధాన స్రవంతిలోకి తీసుకొస్తుందని దేశ సాంస్కృతిక సాంప్రదాయక వారసత్వాన్ని అభివృద్ధి చేస్తుందని భావించింది. బహు భాషా పరిస్థితి స్వభావరీత్యా సానుకూల అంశమే అయినా అది మాతృభాషకు ద్రోహం తలపెట్టే స్థాయిలో ఉండకూడదు. ఒక సమాజపు అనుభవాలు, పరంపరగా వచ్చే విజ్ఞానం పరివర్తన చెందడానికి విద్య ఒక పనిముట్టు. భాషా మాధ్యమం దీనికి ఒక వాహిక. ఈ విషయాన్ని మనం మర్చిపోకూడదు. త్రిభాషా సూత్రం మత వైషమ్యాలకు దారి తీసింది. భారత జాతీయ సమైక్యతకు గొడ్డలి పెట్టులా మారింది. ఏదేమైనా కొఠారి కమిషన్ త్రిభాషా సూత్రంలో ఉన్న అసమానతలను సరిదిద్ది కొత్త సూత్రాన్ని రూపొందించింది. దీన్ని నవీకృత త్రిభాషా సూత్రం అన్నారు. దీంట్లో మాతృభాష లేదా ప్రాంతీయ భాష, భారత అధికార భాష లేదా సహాయ భాష (అసిస్టెంట్ లాంగ్వేజ్) (హిందీ లేదా ఇంగ్లీష్) ఏదైనా భారతీయ లేదా విదేశీ ఆధునిక భాష అనే పద్ధతిలో రూపొందించారు.

**35.** ఈ నేపథ్యంతో ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తెలుగు భాష ప్రాధాన్యాన్ని చర్చించడం అత్యవసరం. 11వ శతాబ్ది నుండి తెలుగు భాష, సాహిత్యముల చారిత్రక అభివృద్ధి జరుగుతూ వచ్చింది. తెలుగు లిపిలో ఆ కాలానికే నేటి అక్షరాలతో స్పష్టమైన పోలిక కనిపిస్తుంది. తెలుగులో ఆది కవి అయిన **నన్నయ్య** ఇటువంటి లిపిలోనే రచన చేశారు. బ్రాహ్మి లిపి ఉపయోగించేవారిలో ఎక్కువమంది తెలుగే మాట్లాడేవారు. **బ్రాహ్మి లిపి**ని దక్షిణ భారత భాషలైన తమిళం తెలుగు మలయాళం కన్నడ తుళు భాషలు, ఇంకా శ్రీలంకలో మాట్లాడే సింహళ, ఆగ్నేయాసియా

దేశ భాష లైన బర్మీస్ థాయ్ కంబోడియా వాడుతుండేవి. భారతీయ భాషల్లో జనాభా పరంగా హిందీ తర్వాత ఎక్కువమంది మాట్లాడేది తెలుగే! 1981 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగును 60 మిలియన్ల ప్రజలు (6 కోట్లు ) మాట్లాడుతుండే వారు. తేనె వలె తీయనైన భాష కావడంతో దీని ఆరాధకులు దీనిని **ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్** అని పిలిచారు. బ్రిటిష్ భాషా శాస్త్రవేత్త హాల్డేన్ భారతదేశంలో శాస్త్ర అధ్యయన అధ్యాపనాలకు తెలుగు భాష తగినట్లుగా ఉంటుందని నిరూపించాడు. మిస్టర్ జె ఏ యేట్స్ విశాఖ గోదావరి జిల్లాల పాఠశాల పరీక్ష అధికారిగా ఉన్నారు.1906లో మొదటిసారి ఆయన తెలుగు భాషా బోధన విధానాన్ని అధ్యయనం చేశారు. ***Reminiscences*** అనే తన వ్యాసంలో *తెలుగులో రాసే విధానానికి మాట్లాడే విధానానికి మధ్య తేడాలు ఉన్నట్లు కనుగొన్నారు. "అగ్రవర్ణాలకు చెందిన వారైనా చదువుకున్న వారైనా చదువుకోని వారైనా వారు ఎప్పుడూ వినని భాష బోధించడానికి గల కారణాలు నాకు తెలియలేదు. నవీకృత వర్తమాన తెలుగు కోసం ప్రయత్నించమని చెప్పాను".* తదుపరి రోజులలో **వ్యావహారిక భాష ఉద్యమం** నడిపిన **గిడుగు రామమూర్తి పంతులు** గారు విశాఖ జిల్లాలో తెలుగుభాష ఉపాధ్యాయులను ఒక చోటికి చేర్చారు. బోధనలో పాఠ్యపుస్తకాల ముద్రణలో వ్యవహారిక భాష ఉండాలి అనే విషయంలో మద్దతు కూడగట్టడం కోసం ఆయన ఈ సమావేశం జరిపారు.1926లో **ఆంధ్ర విశ్వకళాపరిషత్** ఏర్పడింది. బోధనలో పాఠ్యపుస్తకాల ముద్రణలో ఉపయోగించవలసిన భాష గురించి మార్గదర్శకాలను జారీ చేసింది. 1936లో **నవ్యసాహిత్య పరిషత్** ఏర్పడింది. ఇది ప్రతిభ అనే పత్రికను కూడా నడిపేది. సాహిత్యంలో స్వేచ్ఛా కవిత్వం రాయడాన్ని ప్రోత్సహించేది.

1966లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగును అధికార భాషగా చేశారు. 1974లో తాలూకా స్థాయిలో రాతకోతలు తెలుగులోనే జరుపుతూ ఆ తర్వాత అంచెలంచెలుగా శాఖాధిపతులదాకా, సాధారణ పాలనకు విస్తరించింది.

**36.** ఆంధ్రప్రదేశ్లో మాతృభాష అభివృద్ధి కోసం గతంలో తీసుకున్న చర్యలను దృష్టిలో ఉంచుకొని తెలుగు భాష అభివృద్ధి కోసం మిస్టర్ జె పి ఎల్ గ్విన్ అధ్యక్షతన 1966 డిసెంబర్ 28 వ తారీఖున కమిటీ ఏర్పడింది.1967 మార్చి 29వ తారీఖున కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో అన్ని పాఠ్యపుస్తకాలు రిజిస్టర్లు ఆధునిక ప్రామాణిక భాషను అవలంబించాల్సిన అవసరం ఉంది అన్న డాక్టర్ కృష్ణమూర్తిగారి అభిప్రాయాన్ని ఆమోదించారు. లక్ష్మీకాంతం కమిటీ నివేదిక పై కూడా తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా నివేదికలో ఉంది. ఆధునిక ప్రమాణ రూపం విషయంలో భవిష్యత్తులో మార్గ దర్శనం చేయడానికి తెలుగుకు అధికారం ఉండాలని నివేదిక నొక్కి చెప్పింది. వాచకాలలో అవలంబించవలసిన ఆధునిక ప్రామాణిక తెలుగు రూపాన్ని నిర్ణయించడానికి అధికారం ఉండాలని చెప్పింది. జాతీయ స్థాయి వాచకాల రచన తెలుగులో జరగడం వాటిని ముద్రించే బాధ్యత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టెక్ట్స్ బుక్ ప్రెస్‌కి ఇస్తే బాగుంటుందని కమిటీ అభిప్రాయ పడింది. 1969లో ఉన్నత విద్యలో తెలుగును బోధన మాధ్యమంగా పెద్ద ఎత్తున ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం **అధికార భాషా సంఘాన్ని** తెలుగు అకాడమీని (చట్టబద్ధమైన సంస్థ) 1969లో స్థాపించింది. దీని సిఫార్సుల ప్రకారం 1970 నుంచి ఉన్నత విద్యలోకూడా బోధన మాధ్యమంగా

తెలుగును గుర్తించారు. దీనికి అనుగుణంగానే ఆంధ్రప్రదేశ్‌లో ప్రాథమిక విద్యలోనే కాకుండా ఉన్నత విద్యలో కూడా తెలుగు మాధ్యమం అమలు అయ్యేలా చర్యలు చేపట్టారు.

*ప్రశ్న సంఖ్య 4 :*

*పిల్లల విద్యాహక్కుకు సంబంధించిన రాజ్యాంగపరమైన చట్టపరమైన నిబంధనలేమిటి? తదనుగుణమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలు, నియమాలు ఏమిటి?*

**37.** భారత రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం భారత పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యపు హక్కు ఉంది. 19వ అధికరణంలోని (1) ఏ పౌరులు అందరికీ వాక్ స్వాతంత్ర్యపు హక్కు ఉంది. క్లాజ్ (జీ) ప్రకారం ఏ వృత్తి నైనా చేసే హక్కు, జీవనోపాధి కోసం ఏ పని నైనా చేసే హక్కు వ్యాపారం చేసే హక్కు, అమ్మకము కొనుగోలు చేసే హక్కు ఉంది. 19వ అధికరణంలోని (1) (ఏ) కి భంగము కలగకుండా ఉండేందుకు 19 (2) లో చెప్పినట్లుగా భారతదేశం సార్వభౌమాధికారం దృష్ట్యా రాష్ట్ర భద్రత దృష్ట్యా రాష్ట్రాలు చట్టాలు చేస్తూ సహేతుకమైన పరిమితులు విధించవచ్చు. ఇతర దేశాలతో స్నేహ సంబంధాలు నెరపడం, ప్రజా క్షేమము, మర్యాద, నైతికత, కోర్టు ధిక్కరణ, పరువు నష్టం, నేరానికి పురికొల్పడం వంటి అంశాల దృష్ట్యా పరిమితులు విధించవచ్చు. అందువల్ల ఒక పౌరుడు వాక్ స్వాతంత్ర్యాన్ని కలిగి ఉంటాడు కానీ అధికరణం 19 (2)లో నిర్దేశించిన పరిమితులకు లోబడి మాత్రమే కలిగి ఉంటాడు. ఒక రాష్ట్రం ఒక జీవో జారీ చేసేటప్పుడు పై అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. పైన చర్చించినట్లుగా పౌరుల విద్యకు సంబంధించి స్వాతంత్ర్య పూర్వ,

అనంతర కాలంలో మాతృభాష పరిణామాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు పౌరుడు ఏ భాష మాధ్యమం ద్వారా విద్యావంతుడు కావాలి అనేది వాక్ స్వాతంత్ర్యపు హక్కులో భాగంగా ఉంటుందని నిర్మొహమాటంగా చెప్పవచ్చు. విద్య పూర్తి అయిన తర్వాత అతను ఏ భాషలో విజయవంతం అయ్యాడు ఆ భాషలో అతని అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే స్థితిలో ఉంటాడు. పైన చెప్పిన విషయాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఒక పౌరుడి వాక్ స్వాతంత్ర్యపు హక్కు పరిరక్షింపబడాలి అంటే మాతృభాష మాధ్యమంలో చదువుకోవాలా భారత రాజ్యాంగంలో చెప్పిన ఇతర భాషలలో చదువుకోవాలా అనేది 19వ అధికరణం (2) లో చెప్పిన అంశాలకు లోబడి, పౌరుడి విచక్షణ పై ఆధారపడి ఉంటుంది. కాబట్టి పాఠశాల విద్యలో భాషా మాధ్యమాన్ని ఎంపిక చేసుకునే హక్కు పౌరుడికి రాజ్యాంగంలోని 19 (1) ఏ ప్రకారం ఉంది. కాకపోతే రాజ్యాంగంలోని 19 (2)వ అధికరణంనందు రూపొందించిన మినహాయింపునకు లోబడి ఉంటుంది.

**38.** రాజ్యాంగంలోని 19వ అధికరణం (1) (జి) ప్రకారం పౌరులు చట్టానికి లోబడి ఏ వృత్తి నైనా స్వీకరించవచ్చు. జీవనోపాధి కోసం ఏ రకమైన జీవిత అయినా చేసుకోవచ్చు. ఏ వ్యాపారం అయిన నిర్వహించు కోవచ్చు. ఒకవేళ ఒక వ్యక్తి చేసే వ్యాపారం, అవలంబించిన వృత్తి ప్రజల శ్రేయస్సుకు భంగం కలిగించేదిగా ఉంటే కారణాలు చూపి అతని వృత్తి వ్యాపారాలపై నియంత్రణ విధించవచ్చు. అదే సమయంలో రాజ్యానికి ఏదైనా వృత్తి, జీవిక. వాణిజ్యం పరిశ్రమ లేదా సేవలకు సంబంధించి చట్టాన్ని చేసేందుకు ఆర్టికల్ 19 (6) ప్రకారము ఎటువంటి నిరోధము

లేదు. ఇది పౌరులు లేదా ఇతరులను పూర్తిగా లేదా పాక్షికంగా మినహాయించవచ్చు. **టి. ఎం. ఏ. పాయి ఫౌండేషన్ మరియు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం మధ్య జరిగిన వివాదానికి సంబంధించి తీర్పులో** సుప్రీంకోర్టు పైన చెప్పిన అంశాన్ని పరిగణనలోనికి తీసుకున్నది. ఒక విద్యా సంస్థను నిర్వహించడం అధికరణం 19 (1) (జి) ప్రకారం జీవికలో భాగమేనని తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని 19(6) ప్రకారం మాత్రమే నియంత్రణ విధించవచ్చని స్పష్టం చేసింది. **ఆర్. ఎమ్. డి. చామర్ బాగ్ వాలా మరియు ముంబై రాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు** దృష్టిలో పెట్టుకున్నప్పుడు విద్య స్వతహాగా ఔదార్యం స్వభావంగా కలిగిన అంశంగా పరిగణింపబడుతోంది అని కోర్టు గమనించింది. లాభాలే లక్ష్యంగా సాగించే వ్యాపారంగా లేదా వాణిజ్యంగా విద్య ఇప్పటివరకు పరిగణించ బడలేదు అని కోర్టు చెప్పింది. విద్య వృత్తి అవునా కాదా అని అనుమానం ఇప్పటికీ ఉంటే - విద్య జీవిక అనే అర్థంలోనే స్థిరపడినట్లు తెలుస్తోంది. పిల్లలకు విజ్ఞానం అందించడం కోసం చాలామంది వ్యక్తులు ఉపాధ్యా యులుగా, పరిపాలన సిబ్బందిగా నియమింప బడి వారి విధులు నిర్వహిస్తూ ఉండి విద్యాసంస్థలు స్థాపించిన సందర్భంలో కూడా, దానిలో ఆదాయ ఉత్పత్తి అనే అంశం లేకపోయినా దానిని జీవిక గానే భావించవలసి ఉంటుంది. అందువల్ల పౌరుల చేత నిర్వహింపబడుతున్న విద్యాసంస్థలకు వృత్తిని ఆచరించే హక్కు ఉంటుంది. అధికరణ 19 (1) (జి) ప్రకారం జీవిక కోసం వారు ఏ పని అయినా చేయవచ్చు. ఒక పౌరుడు లేదా వ్యక్తి పాఠశాల నిర్వహించకుండా అధికరణం 19 (6) కు భిన్నంగా విధించే ఎటువంటి నిబంధన లైనా వారు ఏ వృత్తి నైనా జీవిక నైనా ఆచరించవచ్చు అనే విషయాన్ని ఉల్లంఘించినట్లు అవుతుంది. అందువల్ల అన్ని

యాజమాన్యాలపై ఈ జీవో (85) ద్వారా విధించిన నిబంధనలు ప్రైవేటు భాషా మైనారిటీ విద్య సంస్థలకు కూడా వర్తిస్తుంది. ఇటువంటి సంస్థల నిర్వహణపై ఇది ప్రభావం చూపుతుంది. ఇది రాజ్యాంగంలోని అధికరణం 19 (1) (జి) ని ఉల్లంఘించిట్లే!

**39.** చట్టంచే స్థాపితమైనట్టి కార్యసరళి ద్వారా తప్ప ఏ వ్యక్తికి అతని జీవితానికి, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకూడదని రాజ్యాంగంలోని 21వ అధికరణం నిర్దేశిస్తోంది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమే విద్యా హక్కు అని **మోహిని జైన్, కర్ణాటక ప్రభుత్వం కేసు** విషయంలో సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చింది. పైన చెప్పిన కేసులు కోర్టు తీర్పు ఇలా ఉంది.

"కోర్టులు అమలు చేయాల్సిన అన్ని హక్కుల సంగ్రహ రూపం జీవించే హక్కు. ఎందుకంటే గౌరవప్రదంగా ఆనందంగా జీవించడానికి ఇవి మౌలిక విషయాలు. వ్యక్తి అనుసరించే పూర్తిస్థాయి ప్రవర్తన అంతటా అది వ్యాపించి ఉంటుంది. జీవించే హక్కు నుంచి సూటిగా ఉద్భవించినదే విద్యా హక్కు. విద్యాహక్కుతో కలిసి ఉండకపోతే 21వ అధికరణం లోని జీవించే హక్కు, హుందాగా జీవించే హక్కు ఉంటాయని హామీ ఇవ్వలేము. పౌరులకు అన్ని స్థాయిలలో విద్యా సౌకర్యాలు అందించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంమీద ఉంది."

**40.** **జేపీ ఉన్నికృష్ణన్ కేసు**లో గౌరవనీయ సుప్రీంకోర్టు విద్యాహక్కు గురించి చర్చిస్తూ కింది విధంగా తీర్పునిచ్చింది.

"రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం ఇవ్వబడిన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగమైన విద్యా హక్కు గురించి తప్పక

రాజ్యాంగంలోని నాలుగో భాగంలో ఉన్న ఆదేశ సూత్రాల వెలుగులో వ్యాఖ్యానించాలి. విద్యాహక్కుకు సంబంధించినంతవరకు రాజ్యాంగంలోని నాలుగో భాగంలో దాని గురించి విపులంగా చెప్పే అనేక ఆర్టికల్సు ఉన్నాయి. నిరుద్యోగం, వార్ధక్యం, జబ్బు పడటం, అసమర్థత వంటి అవాంఛిత మైన విషయాలలో ప్రభుత్వం దాని అభివృద్ధి, ఆర్థిక పరిమితుల లోపలే పని హక్కు, విద్య, ప్రజలకు సహాయానికి సంబంధించి ప్రభావవంతమైన ఏర్పాట్లు చేయాలి - అని **41** వ ఆర్టికల్ చెబుతోంది. **45**వ ఆర్టికల్ ఏమి చెబుతోందంటే - ప్రభుత్వం రాజ్యాంగం అమలైన పదేళ్లలోపు ఉచిత నిర్బంధ విద్యను **14** ఏళ్ల లోపు పిల్లలందరికీ అందించే ప్రయత్నం చేయాలి. **46**వ ఆర్టికల్ ఏమి చెబుతోంది అంటే - ప్రభుత్వం బలహీన వర్గాలకు చెందిన వారి విద్య ఆర్థికపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ జాతుల ప్రజలను సామాజిక అసమానతల నుంచి కాపాడాలి. అన్ని రకాల దోపిడీల నుంచి వారిని విముక్తం చేయాలి.''
విద్య అంటే విజ్ఞానం. విజ్ఞానం స్వతహాగానే శక్తివంతమైనది. జోహాన్ ఆడమ్స్ చెప్పినట్లు అట్టడుగు స్థాయి వర్గాల వారి వద్ద దేశంలోని ధనవంతుల వద్ద ఉన్న మొత్తం ఆస్తిని భద్రపరచడం కన్నా విజ్ఞానాన్ని భద్ర పరచడం ప్రజలకు చాలా ముఖ్యం. (కెనాన్ మరియు ఫ్యూడల్‌లాపై సిద్ధాంత గ్రంథం, **1765**) **46**వ ఆర్టికల్‌లో అంతర్గతంగా ఉన్న అంశం ఇదే! నిరంకుశులు దుష్ట పాలకులు మాత్రమే బలహీన వర్గాల మధ్య విద్య విజ్ఞానం వ్యాప్తి చెందుతుందేమోనని భయపడతారు. సార్వత్రిక విద్యా విధానాన్ని హిట్లర్ అడ్డుకోవడం దీనికి సాక్ష్యం. సార్వత్రిక విద్య క్రమంగా నశింపజేసే విచ్ఛిన్నకర విషం. ఉదారవాదం సొంత విధ్వంసం కోసం కనిపెట్టిన అంశం ఇది. (Raus ching, the voice of destruction hider speaks)ఎక్కడ విద్య విశ్వవ్యాప్తంగా ఉంటుందో ఎక్కడ ప్రజలు ఏది తమకు, తమ దేశానికి మంచిది, ఏది చెడ్డది అని అర్థం చేసుకుంటారో, వారిని వారే పరిపాలించడం తెలుసు

కుంటారో అదే నిజమైన ప్రజాస్వామ్యం. రాజ్యాంగంలోని 45, 46, 41 ఆర్టికల్స్ ఈ లక్ష్యాన్ని సాధించడానికి రూపొందించినవే! విద్యా హక్కులోని విషయాలు ప్రమాణాలు నిర్ణయించాల్సింది ఈ ఆర్టికల్స్ వెలుగులోనే! 45, 41 ఆర్టికల్స్ నేపథ్యంలో విద్యా హక్కు అర్థం కావాలి-అంటే ఏ)ఈ దేశంలోని ప్రతి పిల్లవాడికి/పౌరుడికి 14 ఏళ్లలోపు ఉచిత విద్యను పొందే హక్కు ఉంది. బి) పిల్లవాడికి/పౌరుడికి పద్నాలుగేళ్ళు వచ్చిన తర్వాత అతని విద్య హక్కు, రాష్ట్ర అభివృద్ధి, ఆర్థిక సామర్థ్యం అనే అంశాలకు పరిమితమై ఉంటుంది. ఈ రెండింటిని విడివిడిగా పరిశీలిద్దాం.

**41.** పైన పేర్కొన్న **మోహినీ జైన్ అండ్ ఉన్నికృష్ణన్, జేపీ కేసులో** సర్వోన్నత న్యాయస్థానం విద్య ప్రాధాన్యం గుర్తించింది. విద్యాహక్కు జీవించే హక్కులో వ్యక్తిగత స్వేచ్ఛలో చేరి ఉంటుందనే అంశం ఇక్కడ ప్రస్తావించడం సముచితం. అప్పటికి విద్యాహక్కును రాజ్యాంగంలో IIIవ పార్టులో (ప్రాథమిక హక్కులు) చేర్చలేదు. కానీ, IVవ పార్టులో (రాజ్యానికి ఆదేశ సూత్రాలు) ఉన్నది. ఈ తీర్పుల తరువాత 2002లో భారత రాజ్యాంగం IIIవ పార్టులో 21 (A) ఆర్టికల్‌గా చేర్చేందుకు సవరణను ప్రతిపాదించింది. ఆ తరువాత 1-4-2010 నుంచి ఆదేశ సూత్రాల నుంచి తొలగించి ప్రాథమిక హక్కుల్లో చేర్చబడింది. 6-14 సంవత్సరాల మధ్య పిల్లలందరికీ చట్టం నిర్ధారించిన ప్రకారం నిర్బంధ, ఉచిత విద్యను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంచబడినది. ఆ కారణంగా విద్యాహక్కు అనేది జీవించే హక్కు, స్వేచ్ఛా హక్కుల్లో భాగమేనని 6-14 సంవత్సరాల మధ్య పిల్లలందరికీ నిర్బంధ, ఉచిత, ప్రాథమిక విద్యను విధిగా అందించాలని, రాష్ట్రం చట్టం ద్వారా అన్యధా నిర్ధారిస్తే తప్ప విధిగా అందించాలని నిశ్చయించవచ్చును.

**42.** విద్య అనే విషయము రాజ్యాంగం షెడ్యూల్ VII లో ఉమ్మడి జాబితాలో **25**వ అంశంగా ఉంది. అనగా, *జాబితా (i) లోని **63,64,65,66** అంశాల నిబంధనలకు లోబడి విద్యలో సాంకేతిక విద్య, వైద్య విద్య, విశ్వ విద్యాలయాలు, కార్మిక వృత్తిపరమైన సాంకేతిక శిక్షణలు కూడా చేరి ఉంటాయి.* కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చట్టం చేసేందుకు హక్కు కలిగి ఉంటుంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం **2009**లో **35** చట్టంగా విద్యాహక్కు చట్టం చేసింది. అది, **1-4-2010** నుంచి అమలులోకి వచ్చింది. **9-4-2010** నుంచి కేంద్ర రూల్స్‌ను రూపొందించింది. **1982**లో ఒకటవ చట్టంగా చేసిన చట్టం **1982** చట్టంగా పేర్కొంటారు. **18-7-1982** నుంచి ఇది అమలులోకి వచ్చింది. **22-2-2011** నుంచి ప్రస్తుతం అమలు అవుతున్న రాష్ట్ర రూల్స్ రూపొందించ బడ్డాయి.

**43.** I వ తరగతి నుంచి VIII వరకు ఉన్న విద్యను ప్రాథమిక విద్యగా విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ **(2)** f ప్రకారం నిర్వచించారు. **3**వ సెక్షన్ ప్రకారము ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరములలోపు పిల్లవాడు తప్పనిసరిగా విద్యను పొరుగున ఉన్న పాఠశాలలో పొందేందుకు హక్కును కలిగి ఉంటాడు. ii సెక్షన్ లోని d లేదా e క్లాజుల కింద నిర్వచించబడిన వారు కూడా ఇందులో చేరి ఉంటారు. సంబంధిత ప్రభుత్వం, స్థానిక *అథారిటీ, తల్లితండ్రుల విధులు* iii వ చాప్టర్‌లో ఉన్నాయి. విద్యాహక్కు చట్టం సెక్షన్ **7** ప్రకారం సంబంధిత ప్రభుత్వం, స్థానిక అథారిటీలను నిర్దేశించి, అవి విద్యా హక్కు చట్టం ప్రారంభం అయిన తరువాత మూడు సంవత్సరాలపాటు విహితమైన ప్రదేశములలో, లేదా ఇరుగు పొరుగులలో

పాఠశాలలను ఆ అథారిటీలు స్థాపించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక భారాన్ని ఎలా పంచుకోవాలో ఆ సెక్షన్ పేర్కొన్నది. దానికి సంబంధించిన ఖర్చు మరియు ప్రణాళికల విషయంలో నిబంధన చేసేందుకు బాధ్యత కేంద్రానిదే. సెక్షన్ 29 కింద నిర్దేశించిన అకెడమిక్ అథారిటీ సాయంతో జాతీయ పాఠ్యాంశాల చట్టం రూపొందించే బాధ్యత కేంద్రానిదే అని సెక్షన్ 7(6) పేర్కొంటోంది.

**44.** సంబంధిత ప్రభుత్వం పై కొన్ని బాధ్యతలని సెక్షన్ 8 పేర్కొన్నది. సెక్షన్ 6లో నిర్దేశించిన ప్రకారము ఇరుగు పొరుగు పాఠశాలలను అందుబాటులో ఉండేటట్టు చెయ్యాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వానిదే అని క్లాజ్ (b) పేర్కొంటోంది. ఇదే కాక సెక్షన్ 8 (d) నుంచి (i) లో ఉన్న క్లాజుల ప్రకారము పాఠశాల భవనము, బోధన సిబ్బంది, నేర్చుకునేందుకు ఉపకరించే సామగ్రి మరియు ఇతరాలని సమకూర్చే బాధ్యత సంబంధిత ప్రభుత్వానిదే. స్థానిక అథారిటీలు పాఠశాలలు, కళాశాలలు నడుపుతున్నట్లైతే వారిపై కూడా సంబంధిత ప్రభుత్వం లాగే అంతే బాధ్యత ఉంటుంది. సెక్షన్ 10 ప్రకారము ప్రాథమిక విద్య కోసం ఇరుగుపొరుగు పాఠశాలల్లో చేర్చే బాధ్యత తల్లితండ్రులది, సంరక్షకులదే నని స్పష్టం చెయ్యబడింది. విద్యా హక్కు చట్టం 6లో పేర్కొన్న స్కీం ప్రకారము సెక్షన్లు 8,9లో పేర్కొన్న విధుల ఆధారంగా సంబంధిత ప్రభుత్వము లేదా స్థానిక అథారిటీచేత స్థాపించబడిన ఈ పొరుగున ఉన్న పాఠశాలల్లో తల్లి తండ్రులు లేదా సంరక్షకులు, పోషితులని చేర్పించవలసిన అవసరం ఉంటుందని స్పష్టం చెయ్యబడింది. విద్యా హక్కు చట్టము 39వ సెక్షన్ కింద అధికారాన్ని వినియోగించుకుని కేంద్ర

ప్రభుత్వం కేంద్ర రూల్స్‌ని రూపొందించింది. I నుండి V తరగతులు ఒక కిలోమీటర్ దూరంలోనూ, VI నుంచి VIII తరగతులు ఉన్న పాఠశాలలు 3 కిలోమీటర్ల దూరంలో, నడిచిపోయి వచ్చే దూరంలో ఉండాలని రూల్ 6 నిర్దేశిస్తోంది.

**45.** సెక్షన్ 38 కింద ఉన్న అధికారాన్ని వినియోగించుకుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం రూల్స్ ని రూపొందించింది. ఇంతకు ముందు పేర్కొన్నట్లు 22-2-2011 తేదీన GOMs.14 ద్వారా రాష్ట్ర రూల్స్ ప్రకటించబడ్డాయి. రాష్ట్ర రూల్స్‌లో రూల్. నం. 3 (18) మరియు రూల్. 5 లో ఇరుగు పొరుగు పాఠశాలకు సంబంధించిన ప్రమాణ సూత్రాలు నిర్దేశించబడి నాయి. ఇవి కేంద్ర రూల్స్ 6 ను అనుసరించి ఉన్నాయి. **ఫోరమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ టు ఆల్ అండ్ అదర్స్** Vs **ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ అండ్ అదర్స్ కేసు**లో తల్లిందండ్రులు ఇరుగు పొరుగు పాఠశాలల్లో పిల్లలను చేర్చకపోవడటానికి ఆంక్షలు ప్రశ్నింప బడ్డాయి. ఢిల్లీ ఉన్నత న్యాయస్థానము అట్లా విధించిన ఆంక్షలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2)ల్లో పరిధిలోనికి రావని చెప్పింది. ఏమైనప్పటికీ ఇరుగు పొరుగు పాఠశాలలోనే చేర్చాలని ఆంక్షలు విధించడం ద్వారా పిటీషనర్ కున్న స్వేచ్ఛ 19(1)(a) ద్వారా లభించే హక్కు మరియు వ్యక్తీకరణ స్వేచ్ఛలు హరింపబడవని కోర్టు పేర్కొన్నది. ఇది ప్రజా ప్రయోజనానికి సంబంధించినది కావున ప్రతివాదుల వాదన ఏమాత్రం సమర్ధనీయం కాదని పేర్కొన్నది.

**46.** విద్యాహక్కు చట్టంలో 5వ చాప్టర్, 29వ సెక్షన్ ప్రాథమిక విద్యలో పాఠ్యాంశాలు మరియు మూల్యాంకనానికి సంబంధించినది. ప్రస్తుత

వాస్తవాలకు ఆ సెక్షన్ సముచితమైనది. ఏమైనప్పటికీ, తక్షణ ఉపయోగార్ధము అది ఇక్కడ ఉటంకించబడుతుంది.

**సెక్షన్ 29: పాఠ్యప్రణాళిక, మూల్యాంకన విధానం :**

1) సంబంధిత ప్రభుత్వం ప్రటకన ద్వారా అధీకృతం చేసిన అకెడమిక్ సంస్థ ప్రాథమిక విద్యకు, పాఠ్యప్రణాళిక, మూల్యాంకన విధానాన్ని నిర్ధారిస్తుంది.

2) సబ్ సెక్షన్ (1) ప్రకారం పాఠ్య ప్రణాళికను, మూల్యాంకన విధానాన్ని నిర్ధారించేటప్పుడు అధీకృత అకెడమిక్ సంస్థ ఈ క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

ఎ) రాజ్యాంగంలో పొందుపరచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

బి) బాలల సర్వతోముఖాభివృద్ధి జరగాలి.

సి) బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించు కోవాలి.

డి) బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక మానసిక శక్తులు అభివృద్ధి చెందాలి.

ఇ) పిల్లలను కేంద్రంగా చేసుకొని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన, కనుగొనడం ద్వారా నేర్చుకోవాలి.

ఎఫ్) ఆచరణకు సాధ్యమైనంత వరకు బోధన మాధ్యమం బాలల మాతృభాషగా ఉంటుంది.

జి) భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తం చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడంలో సహాయ పడాలి.

హెచ్) జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకున్న విధానం, దానిని అన్వయించే సామర్థ్యాలపై నిరంతర సమగ్ర మూల్యాంకన చెయ్యాలి.

**47.** విద్యాహక్కు చట్టం ప్రకారం సంబంధిత ప్రభుత్వము నోటిఫికేషన్ ద్వారా నిర్దేశించిన అకెడమిక్ అథారిటీ చేత పాఠ్యప్రణాళిక, మూల్యాంకన అంశాల సరళి రూపొందించబడాలి. ఇరుగుపొరుగులో పాఠశాలను స్థాపించడం, మౌలిక సదుపాయాలు, బోధన సిబ్బంది, అభ్యసన సామగ్రి మరియు ఇతరాలు ఏర్పరచడం రాష్ట్ర ప్రభుత్వం, మరియు స్థానిక అథారిటీల కర్తవ్యం. విద్యాహక్కు చట్టంలో అకెడమిక్ అథారిటీ నిర్వచింప బడలేదు. కానీ, కేంద్ర రూల్స్‌లో నిర్వచింపబడింది కానీ, నిర్దేశిత సమయంలో జాతీయ పాఠ్యాంశాల చట్రము అభివృద్ధి పరిచేందుకు అకెడమిక్ అథారిటీని ప్రకటించేందుకు కేంద్ర ప్రభుత్వానికి రూల్ 8 ద్వారా అధికారం వచ్చింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలను మరియు అకెడమిక్ అథారిటీలను సంప్రదించి. విద్యాహక్కు చట్టము, క్లాజ్ (n) లోని (i) నుండి (iii) సబ్‌సెక్షన్‌లలో పేర్కొనబడినట్టుగా ఉద్యోగ పూర్వ స్థితి, ఉద్యోగ స్థితిలో ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు పథకాలను తయారు చేయాల్సిన అవసరం ఉన్నది. పాఠ్యాంశాలు, మూల్యాంకనం సరళిని రూపొందించే అకెడమిక్ బాధ్యతను నిర్వర్తించేందుకు అకెడమిక్ అథారిటీకి కేంద్ర రూల్స్ 23 అధికారం ఇచ్చింది. విద్యాహక్కు చట్టం 29(2) ప్రకారం పాఠ్యప్రణాళిక మూల్యాంకన సరళిని రూపొందించే టప్పుడు అకెడమిక్ అథారిటీ పిల్లల సర్వతోముఖాభివృద్ధి నిర్మాణంలో, పిల్లల జ్ఞానం, అంతర్గత శక్తి, ప్రతిభలను వికసించడానికి భౌతిక, మానసిక అభివృద్ధిని ఎదగాల్సిన ప్రమాణంలో ఎదిగించడానికి సాధ్యమైనంతవరకు మాతృభాషలోనే బోధన ఉండాలి. ఆ కారణంగా పిల్లవాడిలో భయం భీతి ఆందోళనలు తొలగిపోయి తన అభిప్రాయాలని స్వేచ్ఛగా వ్యక్తీకరించడం, రాజ్యాంగంలో ప్రతిష్ఠితమైన విలువలకు అనుగుణంగా

ఎదగడం జరుగుతుంది. ఏమైనప్పటికీ పిల్లల సర్వతోముఖాభివృద్ధికి మౌలికమైన, సమగ్ర ఆకాంక్షలకు ఇది అవసరం. ఇదే కాకుండా అధ్యాపకుల శిక్షణ, ప్రాథమిక విద్యలో మూల్యాంకన సరళి విషయాల్లో కేంద్ర రూల్స్‌లోని రూల్ 23(2)(a) నుంచి (d) లలో నిర్దుష్టమైన సబ్జెక్టుల్లో ప్రమాణాలను అకెడమిక్ అథారిటీ ఏర్పరచాలి.

**48.** 27-1-1982 వ తేదీన రాష్ట్రపతి ఆమోదం పొందిన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌లో 1982 లో 1వ చట్టం వచ్చిందని ఇక్కడ పేర్కొనడం సందర్భోచితం. నిర్వివాదంగా 1982 చట్టమే అమలులో ఉన్నది. ఆ చట్టంలోని 3వ చాప్టర్‌లో ఉన్న సెక్షన్ 7 పాఠశాల విద్యను ప్రస్తావిస్తుంది. 1982 చట్టం 1వ సెక్షన్ ప్రకారము 14 ఏళ్లు వచ్చే పర్యంతం పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యని అందించాలని మరియు పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లకు వైద్య పరమైన పరీక్షలు, సౌకర్యాలను అందించేందుకు ప్రయత్నించాల్సి ఉంది. సెక్షన్ 7 ప్రాథమిక విద్యా దశను గురించి ప్రస్తావిస్తుంది. ఆ సెక్షన్ ఆరేళ్ళు నిండి పద్నాలుగు ఏళ్ల దాకా పిల్లలందరికీ విద్యని నేర్పాలని, దానికి సంబంధించిన పాఠ్యాంశాలు మరియి బోధన, కాంపిటెంట్ అథారిటీ నిర్దేశించిన విధంగా జరగాలని, ఈ కింద ఉద్దేశిత లక్ష్యాల్ని సాధించేందుకు అనువుగా ఉండాలని చెప్పింది. ఈ కేసుకు అనుగుణంగా సెక్షన్ 7 (3) మరియు సెక్షన్ 7(4) తక్షణ ఉపయోగార్ధము యథాతథంగా పేర్కొంటున్నాం.

**సెక్షన్ 7: పాఠశాల విద్య :**

1. xxx

2. xxx

3. ఆరు సంవత్సరములు నిండి పద్నాలుగు సంవత్సరములు పూర్తిగాని పిల్లలకు చదువు నేర్పాలి. పాఠ్యాంశాలు, విద్యా బోధన, కాంపిటెంట్ అథారిటీ నిర్దేశించిన ప్రకారము అనేక అంశాలకు ఈ కింది లక్ష్యాలు సాధించడానికి అనుకూలంగా ఉండాలి.

(a) మాతృ భాషలో వ్యక్తీకరణ నైపుణ్యాలతో ఉన్న అవిస్మృత అక్షరాస్యత.

(b) మౌలిక సంఖ్యా పరమైన నైపుణ్యాలు మరియు పిల్లవాడి భౌతిక, సామాజిక వాతావరణాల పై సముచిత పరిజ్ఞానం

(c) సామాజికంగా ప్రయోజనం కలిగించే ఉత్పాదక పనిలో నైపుణ్యం.

4. (a) సెకండరీ విద్యని పూర్తి చేసుకున్న అనంతరం ప్రతి విద్యార్థిని ఉన్నత విద్య మరియు ఉద్యోగ పరమైన వృత్తి కోర్సులకు సిద్ధం చేసేందుకు విహితమైన రీతిలో సాధారణ విద్యను నేర్పడమే సెకండరీ విద్యకు ప్రధాన లక్ష్యం.

(b) అలా నేర్పే విద్యలో ఇతర అంశాలతో పాటు ఈ అంశాలు కూడా చేరి ఉంటాయి.

(i) మాతృభాషలో లేదా ప్రాంతీయ భాషలో ఏదైతే అది భాషాపరమైన నైపుణ్యాల అభివృద్ధి మరియు సాహితీ సంబంధమైన ప్రశంస.

(ii) హిందీ, ఇంగ్లీషుల్లో విహితమైన ప్రమాణాల్లో ప్రావీణ్యాన్ని సాధించడం

(iii) గణిత శాస్త్రంలోనూ, భౌతికశాస్త్రం మరియు జీవశాస్త్రంలో ముమ్ముందు అధ్యయనానికి పనికి వచ్చే కావాల్సిన పరిజ్ఞానాన్ని పొందటం.

(iv) తన రాష్ట్రము దేశము మరియు ప్రపంచాన్ని గురించి కనీస పరిజ్ఞానం, కనీస జ్ఞానాన్ని పిల్లవాడు సాధించుకునేందుకు వీలుగా చరిత్ర, భూగోళంలో మరియు పౌర శాస్త్రాన్ని విశేషంగా చెప్పే సామాన్య శాస్త్రాల అధ్యయనం.

(v) పాఠ్యప్రణాళికలో కీలక భాగంగా సామాజిక ప్రయోజనం కల ఉత్పాదక పనిని పరిచయం చెయ్యడం

(vi) క్రీడలు, ఆటలు, మరియు ఇతర భౌతిక వ్యాయామాలు మరియు ఇతర కళల్లో శిక్షణ.

(vii) మౌలిక వ్యవసాయ శాస్త్రం మరియు నీటి పారదుల పద్ధతులపై పరిజ్ఞానాన్ని నేర్పడం

(viii) ఇంటర్మీడియట్ కోర్సులను పరిచయం చెయ్యడం

(ix) నైతిక విలువలు బోధించడం

(c) ప్రభుత్వం

(i) ఉపాధ్యాయుల ఆధారంగా, ఉపాధ్యాయుల వారీగా విషయం ప్రాధాన్య సూత్రాన్ని సెకండరీ దశలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

(ii) సెకండరీ విద్యను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవడం. దానికోసం ఇప్పుడున్న పాఠశాలల్లో భౌతిక ప్రమాణాలను గరిష్ట స్థాయిలో తీసుకువచ్చేటందుకు కావాల్సిన కృషి చెయ్యడం.

1982 చట్ట నిబంధనల ప్రకారము విద్య యొక్క వాస్తవ లక్ష్యం సాధించేందుకు వ్యక్తీకరణ నైపుణ్యాలతో సహా మాతృభాషలో అవిస్మృత అక్షరాస్యత, సామాజిక పరిసరాల పై తగినంత పరిజ్ఞానం. సామాజికంగా పనికొచ్చే పనుల్లో ఉత్పాదక నైపుణ్యం నిర్దేశించబడినాయి. సెక్షన్ 7(4) ప్రకారము పిల్లవాడు సెకండరీ విద్యను పూర్తి చేసే సమయానికి ఉన్నత అకడమిక్ స్టడీస్‌లో ఉపాధి కలిగించునట్టి వృత్తి కోర్సులకు సరిపడేంత విహితమైన సాధారణ విద్యను నేర్పడం చెయ్యాలి. విహితమైన విధంగా మాతృభాషలో లేదా ప్రాంతీయ భాషలో అక్షర జ్ఞానం ప్రశంసించే శక్తి

ఇందులో చేరి ఉన్నాయి. 1982 చట్టంలోని 7(3) మరియు 7(4)(i)(ii) ప్రకారము చట్టంలో నిర్దేశితమైన రీతిలో పాఠ్యప్రణాళిక విద్యా బోధనను నేర్పవలసి ఉన్నది. ఇందులో మాతృభాషలో అవిస్మృత అక్షరాస్యత చేరి ఉంటుంది. దీనిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్న విషయం సుస్పష్టం.

**49.** రాష్ట్ర రూల్స్ 3(26) ప్రకారము అకెడమిక్ అథారిటీ నిర్వచింపబడినది. ఇది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (SCERT), హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌గా ఇది ప్రసిద్ధం. 3(27) రూలు ప్రకారం అమలు చేసే అధికారి అంటే సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి. ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యా కమీషనర్ మరియు డైరెక్టర్ కూడా అందులో ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రాజీవ్ విద్యా మిషన్, సర్వ శిక్ష అభియాన్‌గా పని చేస్తోంది. సర్వ శిక్షా అభియాన్ డైరెక్టర్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. రూల్ 25 పాఠ్యప్రణాళిక, మూల్యాంకనంకు సంబధించిన సరళిని అకెడమిక్ అథారిటీ నిర్ధారించాలని నిర్దేశిస్తోంది. ఆ రూలు ప్రకారము SCERT అకెడమిక్ అథారిటీ. అది రాజీవ్ విద్యా మిషన్ (సర్వ శిక్షా అభియాన్) డైరెక్టర్ వారిని సంప్రదించి పాఠశాల పిల్లల కోసం పాఠ్యప్రణాళికను ఫ్రేమ్ వర్క్‌ను నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని నిర్దేశిస్తుంది. అందువలన రాష్ట్రానికి SCERT అకెడమిక్ అథారిటీ ఉంటుందని, అది అమలుపరిచే అథారిటీని సంప్రదించి సముచితమైన పాఠ్యాంశాలని, పాఠ్య పుస్తకాలని ఇతర అభ్యసన సామగ్రిని రూపొందించడం, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయుల శిక్షణలకు రూపకల్పన చెయ్యడం, నిరంతర సమగ్ర మూల్యాంకనం కోసం మార్గదర్శకాలను రూపొందించడం, పిల్లల శిక్షణ విషయంలో విద్యార్థులు సమయకాలిక అభివృద్ధిని,

సంస్థల సమయకాలిక అభివృద్ధిని కొలిచేందుకు ప్రదర్శన సూచికలు అభివృద్ధి చెయ్యడం, విధానాలు కార్యక్రమాలపై, అభ్యసన ఫలితాలపై పరిశోధన అధ్యయన చేపట్టడానికి రూపకల్పన చెయ్యాలి. అందువల్ల రాజీవ్ విద్యా మిషన్‌తో సంప్రదించి విద్యాహక్కు చట్టం **29(2)**లో a నుంచి h క్లాజుల్లో ఉన్న నిర్దేశించుకున్న లక్ష్యం సాధించేందుకు NCERT వారు నిర్దేశించిన ప్రామాణ్యాల ప్రకారము రాజీవ్ విద్యామిషన్‌తో సంప్రదించి పాఠ్యప్రణాళిక తయారు చేసే బాధ్యత SCERT వారిదేనని స్పష్టం. ఆ ప్రకారము నిర్దిష్ట లక్ష్యాలను సాధించేందుకు కాంపిటెంట్ అథారిటీలు రూపొందించిన పాఠ్యాంశాలు, మూల్యాంకన విధానం, బోధన మాధ్యమంలో నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను పిల్లలకు అందించాల్సి ఉంటుంది.

**50.** ప్రాథమిక దశలో బోధన మాధ్యమాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే అధికారం లేనందువలన **1982** చట్టంలో సెక్షన్ **7(3)** మరియు సెక్షన్ **7(4)** నిబంధనలను పరిశీలించింది. ఏమైతేనేమి, **2019**లో **62** వ శాసన సభా బిల్లులో ముఖ్యంగా సెక్షన్లు **7(3)**(c), **7(4)**(i), (ii) మరియు సెక్షన్ **99** కి ప్రభుత్వం సవరణలు ప్రతిపాదించింది. అలా ప్రతిపాదించిన సవరణలను ఈ కింద పునరుద్ఘాటిస్తున్నాం.

సెక్షన్ **7(3)**(c)తరువాత ఇలా చేర్చాలి.

*"ప్రభుత్వ పాఠశాలల్ని ఇంగ్లీష్ మీడియంలోకి మార్చడం ద్వారా ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం పెంచడం."*

**7(4)**(b) (ii) మార్చేందుకు ప్రతిపాదన

*"హిందీలో విహితమైన ప్రమాణాలను సాధించుట."*

4(b)(ii) అనంతరము ఈ కింద పేర్కొన్నది చొప్పించేందుకు ప్రతిపాదించారు

*"ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మాధ్యమంగా ఇంగ్లీష్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం పెంచడం"*

99వ సెక్షన్ సబ్ సెక్షన్ xviii ను రీప్లేస్ చేసేందుకు ప్రతిపాదించారు

"విద్యా ప్రమాణాలు, విద్యార్హతల కోర్సుల విద్యా ప్రమాణాలు విద్యా సంస్థల్లో కోర్సుల అధ్యయనం. ఇంగ్లీష్ మాధ్యమంలో బోధనతో సహా"

రాష్ట్ర రూల్స్‌లో సబ్ రూల్ xviii లో నిర్దేశించబడినట్టు "విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు మరియు కోర్సుల అధ్యయనం విషయంతో సహా అన్ని విషయాలపై 1982 చట్టంలోని 99 వ సెక్షన్ ప్రకారము ప్రభుత్వానికి రూల్స్ చేసేందుకు అధికారం దఖలు పడుతుంది. ఇంగ్లీష్ మాధ్యమంలో బోధనతో సహా అన్నమాటని అదనంగా చేర్చడం వలన పైన పేర్కొన్న మార్పులు 1982 చట్టంలోని 99 వ సెక్షన్ ద్వారా రూల్స్ చేసేందుకున్న అధికారాన్ని ఆశ్రయించవలసి వచ్చింది. ఆక్షేపింపబడిన ఈ జీవోకు జారీ చేసే తేదీకి అన్ని యాజమాన్యాలను I నుంచి VI మార్చేందుకు కావలసిన ఆధారభూతమైన అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దిష్టంగా ఇవ్వబడలేదు. 1982 వ చట్టంలో 2(12)లో నిర్వచించబడిన విధంగా ఈ అధికారం కాంపిటెంట్ అథారిటీకి ఉన్నది. జీవో జారీ చేసిన అనంతరరం. 16-12-2019 తేదీన బిల్లు ద్వారా 1982 వ చట్టానికి సవరణ ప్రతిపాదిస్తోంది. గౌరవ రాష్ట్రపతి ఆమోదం ఇప్పటికీ పొందనందువలన 1982 చట్టంలో ఈ సవరణ భాగం కాలేదు అన్నది నిర్వివాదం.

**51.** నిస్సందేహంగా, విద్య అనేది ఉభయ జాబితాకు సంబంధించిన విషయమే అయినప్పటికీ, ఈ విషయంలో భారత రాష్ట్రపతి యొక్క ఆమోద ముద్ర లేకుండా, విద్యాహక్కు చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఉంటే, వైరుధ్య విషయం అవుతుంది. భారత రాజ్యాంగము ఆర్టికల్ **254** (I) ప్రకారము ఉభయ జాబితాల్లో పేర్కొనబడిన ఏదైనా అంశముపై పార్లమెంట్ కూడా చట్టం చెయ్యడానికి అధికారం ఉన్నప్పుడు రాష్ట్ర శాసన సభ చేసిన ఏదైనా నిబంధన కూడా పార్లమెంట్ నిబంధనకు విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుతుంది. శాసన సభ చేసిన చట్టము పార్లమెంట్ చట్టము కన్నా వెనుకైనా, ముందైనప్పటికీ వైరుధ్యం ఉన్నంత వరకు పార్లమెంట్ చట్టమే నెరవేరుతుంది. ఆర్టికల్ **254** క్లాజ్ **(2)** ఉభయ జాబితాల అంశాలపై శాసన సభ చట్టం చేస్తే అంతకుముందే పార్లమెంట్ చేసిన చట్ట నిబంధనలకు గాని, లేదా ఇదే విషయంపై అమలులో ఉన్న చట్టానికి గాని వైరుధ్యం వస్తే అది ప్రెసిడెంట్ యొక్క ఆమోదం లభించే వరకు కేంద్ర చట్టమే చెల్లుతుంది. ఈ విషయంలో **హేస్ట్ పార్మాసూటికల్స్ లిమిటెడ్** Vs **బీహార్ రాష్ట్రం మరియు ఇతరులు** తీర్పు నుంచి మార్గదర్శనం పొందవచ్చును. దానిపై పార్లమెంట్‌కు చట్టం చేసేందుకు అధికారం కలిగి ఉన్న అంశముపై ఏదైనా నిబంధనను రాష్ట్ర శాసనసభ చేస్తే, సదరు రాష్ట్ర చట్టము అంతకు పూర్వము లేదా తరువాత చెయ్యబడినప్పటికీ శాసన సభ సదరు చట్టాన్ని రూపొందించినప్పటికీ అట్లా రూపొందించిన శాసనసభాచట్టము పార్లమెంట్ చట్టమునకు విరుద్ధము కానంతవరకు చెల్లుతుంది అని భారత రాజ్యాంగం ఆర్టికల్ **254 (1)** ప్రకారము చెల్లుతుంది. ఉభయ జాబితాలలో పేర్కొన్న ఏదైనా విషయం పై శాసన సభ అంతకు ముందు

పార్లమెంట్ రూపొందించిన చట్టపు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిబంధనను చేసినట్టయితే ఇప్పటికీ అమలులో ఉన్న ఏదైనా చట్టానికి విరుద్ధంగా ఉన్నా, రాష్ట్రపతి ఆమోదం వచ్చేంతవరకు కేంద్ర చట్టమే చెల్లుతుంది అని ఆర్టికల్ 254 క్లాజ్ (2) స్పష్టం చేస్తోంది. ఉభయ జాబితాలలో పేరుకున్న విషయాలపై ఆర్టికల్ 254 ఇన్ వోక్ చెయ్యాలంటే కేంద్ర చట్టంలోనూ, రాష్ట్ర చట్టంలోనూ ఒకే విషయానికి సంబంధించిన నిబంధన అయ్యి ఉండాలి. **హేస్ట్ పార్మాసూటికల్స్ లిమిటెడ్** Vs **బీహార్ రాష్ట్రం మరియు ఇతరులు తీర్పు** నుంచి ఈ విషయంలో మార్గదర్శనం పొందవచ్చును. **రాజీవ్ సెరీన్ అండ్ ఆండర్స్** Vs **ఉత్తరాఖండ్ ప్రభుత్వం అండ్ అదర్స్ కేసు** విషయంలోపై తీర్పుని అనుసరిస్తూ భారత రాజ్యాంగము నందు నిర్దేశించబడిన వైరుధ్య విషయం యొక్క అవసరం స్పష్టం చెయ్యబడింది. ఉభయ జాబితాలో పేర్కొన్న విషయాలకు ఆనుగుణ్యాంగా, ఆర్టికల్ 254 ని ప్రయోగించడానికి, కేంద్ర చట్టమునందు రాష్ట్ర చట్టము నందు కూడా అదే విషయంపై కొన్ని నిబంధనలు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు గౌరవ రాష్ట్రపతి యొక్క సమ్మతి లభించి ఉండరాదు. దీనికి నిర్ధారించేందుకు పరీక్ష ఏమిటంటే 2 చట్టాల యొక్క కీలక ఉద్దేశ్యాలని చూడాలి. ఆ కీలక ఉద్దేశ్యాలు ఒకటా వేరా అన్నది కూడా చూడాలి. కీలక ఉద్దేశ్యాలు వేరు అయినప్పుడు దానికి రాష్ట్రపతి ఆమోదం లేనప్పుడు రాష్ట్ర చట్టం వైరుధ్యంగా ఉన్నట్లే. ఈ కేసు వాస్తవాలను పరిశీలించినప్పుడు విద్యాహక్కు చట్టము సెక్షను 29 (2) (a) నుంచి (h) ప్రకారము బోధన మాధ్యమం సాధ్యమైనంతవరకు మాతృ భాషలోనే ఉండాలి. ప్రతిపాదించబడిన సవరణ ద్వారా 1982 చట్టము లోని సెక్షను 7(3) (c), సెక్షను 7(4)(b)(ii), సెక్షను 99ల తరువాత ఇంగ్లీష్‌లో నైపుణ్యం

కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధన మాధ్యమంగా ప్రతిపాదించ బడింది. ప్రతిపాదిస్తున్న ఈ సవరణలో ఈ విషయంలో తగిన రూల్స్ చేసేందుకు కావాల్సిన అధికారాన్ని కోరుతున్నారు. ఆ ప్రకారం 1982 చట్టము నందు ప్రతిపాదించబడిన సవరణ యొక్క కీలక ఉద్దేశ్యము విద్యా హక్కు చట్టానికి స్పష్టంగా తేడా ఉన్నది. ఇప్పటివరకు ఐతే గౌరవ భారత రాష్ట్రపతి ఆమోదం లభించలేదు.

**52.** 46 నుండి 51 పేరాల్లో చేసిన చర్చ దృష్ట్యా విద్యా హక్కు చట్టం, కేంద్ర రూల్స్ నందు నిర్దేశించబడిన కేంద్ర అకెడమిక్ అథారిటీ (NCERT) మరియు 1982 చట్టంలో నిర్దేశించిన కాంపిటెంట్ అథారిటీ మరియు రాష్ట్ర రూల్స్ లో పేర్కొన్న అకెడమిక్ అథారిటీలు (SCERT) విద్యాహక్కు చట్టం సెక్షన్ 29(2) (a నుంచి h) లోనూ, 1982 వ చట్టము 7(3) (a నుంచి c) వరకు, 7(4)(b)(i)(ii) లో ఉన్న ప్రమాణాలను పాటిస్తూ పాఠ్యాంశాలను విహితం చెయ్యాలి. NCERT లేదా SCERT ప్రమాణాల ప్రకారం, ఏదైతే అది, కాంపిటెంట్ అథారిటీ చేత నిర్ణయించబడాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి 1982 చట్ట నిబంధనల ప్రకారము బోధన మాధ్యమాన్ని మార్చేందుకు అధికారము లేదు. అందువల్లనే 1982 చట్టంలో 7(3),7(4) మరియు 99 సెక్షన్లలో బోధన మాధ్యమం ఇంగ్లీషులోకి మార్చేందుకు కావాల్సిన అధికారాన్ని చూపించేందుకు సవరణను ప్రతిపాదించారు. ఆ ప్రకారం ఈ వాస్తవాలన్నీ తెలిసి తెలుగు నుంచి ఇంగ్లీషు మీడియం లోకి మార్చుతూ ప్రతిపాదించిన సవరణకు సమ్మతి రాకముందే ఆక్షేపణకు గురైన జీవోను 20.11.2019 న జారీ చెయ్యడం చట్టం కింద చెల్లుబాటు కాదు.

**53.** ఇవే కాక భారత రాజ్యాంగం విద్యా హక్కు చట్టం, కేంద్ర రూల్స్ మరియు **1982** చట్టం, స్టేట్ రూల్స్ భారత ప్రభుత్వము ఆమోదించి సంతకం పెట్టిన మానవ హక్కుల యూనివర్సల్ డిక్లరేషన్ నిబంధనల ప్రాముఖ్యం ఉండనే ఉన్నది. ఆర్టికల్ **26** ప్రకారము ప్రాథమిక దశల వరకన్నా ఉచిత నిర్బంధ విద్యను పొందేందుకు పౌరులందరూ హక్కుని కలిగి ఉంటారు. వృత్తిపరమైన విద్య, ఉన్నత విద్యలు, యోగ్యతల ఆధారంగా అందుబాటులోకి రావాలి. విద్యయొక్క ప్రాముఖ్యాన్ని గురించి చెప్తూ మానవ వ్యక్తిత్వ అభివృద్ధికి ఆవశ్యకమని, మానవ హక్కులు మౌలిక స్వాతంత్ర్యాలపట్ల గౌరవం బలోపేతం కావడానికి వీటిని అర్థం చేసుకోవడంవల్ల మత సమూహాల మధ్య, జాతుల మధ్య, దేశస్తుల మధ్య అవగాహన, సహనం, స్నేహం సాధించేందుకు ఐక్యరాజ్య సమితి శాంతిని పెంచేందుకు చేసే చర్యలపట్ల అవగాహన పెంచేందుకు విద్య ఆవశ్యకం. క్లాజ్-3 ప్రకారం పిల్లలకు ఎలాంటి విద్య ఇవ్వాలో నిర్ణయించుకునే హక్కు తల్లిదండ్రులకు ఉందని స్పష్టంగా చెప్పబడింది. అందువల్ల మానవ హక్కుల యూనివర్సల్ డిక్లరేషన్ దృష్ట్యా, రాజ్యాంగ నిబంధనల దృష్ట్యా పైన పేర్కొన్న కేంద్ర రాష్ట్ర చట్టాల దృష్ట్యా పిలల్లకు ఉచిత నిర్బంధ విద్యను కల్పించడం రాష్ట్రం బాధ్యత. అట్టి విద్యను కల్పించేటప్పుడు పిల్లలకు సర్వతోముఖాభివృద్ధి, జ్ఞానం, పిలల్ల జ్ఞానాన్ని అంతర్గత శక్తిని, ప్రతిభలకు మరియు భౌతిక మానసిక సామర్థ్యాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందేందుకు పిల్లల కేంద్రకంగా పిల్లలకు స్నేహాత్మకంగా ఉండే రీతిలో అన్వేషణా మరియు పరిశీలన పెంచేందుకు పిల్లవాడు భయం, భీతి ఆందోళనలు పోగొట్టుకునేటట్లు చెయ్యడం, బోధన

మాధ్యమం సాధ్యమైనంతవరకు మాతృభాషలోనే ఉండటం వలన, తన అభిప్రాయాలని స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి దోహదం చెయ్యడం జరగాలి.

**54.** విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 21 పాఠశాల నిర్వహణ కమిటీ నిర్మాణానికి సంబంధించినది. తల్లితండ్రుల ప్రాధాన్యతని అది ఉన్నతీకరిస్తుంది. ఆ నిబంధన ప్రకారము అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో తప్ప సెక్షన్ 2(n) (i నుంచి iii) లో నిర్వచింపబడిన అన్ని పాఠశాలలకు పాఠశాల నిర్వహణ కమిటీ ఏర్పడాలి. సెక్షన్‌లో పేర్కొనబడిన రిజర్వేషన్ల ప్రకారము స్థానిక అథారిటీల నుంచి ఎన్నుకోబడిన ప్రతినిధులు, తల్లితండ్రులు లేదా సంరక్షకులు, పిల్లలు ప్రతినిధులు ఉండాలి. ఆ కమిటీ పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారు చెయ్యడం, సిఫార్సులు చెయ్యడం, వచ్చిన గ్రాంటుల వినియోగాన్ని మానిటర్ చేయడాన్ని, లాంటి విహితమైన ఇతర పనులను, పాఠశాల పనితీరుని మానిటర్ చెయ్యాలి. కేంద్ర రూల్స్‌లో 4వ రూలు ప్రకారము పాఠశాల నిర్వహణ కమిటీ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మూడు నెలల ముందే పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారు చెయ్యాలి. పాఠశాల అభివృద్ధికి కావలసిన ప్రణాళికలు రూల్ 4(3)(a) నుంచి (d) వరకు నిర్దేశించబడినాయి. రాష్ట్ర రూల్స్ ప్రకారము కమిటీ నిర్మాణము రూల్ 19 (2) (a) & (b) (i) to (iii), (c) (i) to (vi), (3), (4) and (5) నందు నిర్దేశించబడింది. రూల్ 19(6) ప్రకారము విద్యా హక్కు చట్టము సెక్షన్ 21 లోని సబ్ సెక్షన్ (2) లోని క్లాస్(a) నుంచి (d) వరకు పేర్కొన్న విధులను ఇదే కాకుండా రాష్ట్ర రూల్స్ 19 కాకుండా ఉన్న విధులను పాఠశాల నిర్వహణ కమిటీ నిర్వర్తించవలసి ఉన్నది. రూలు 19 యథాతథంగా ఇక్కడ పేర్కొంటున్నాం.

**రూలు-19 పాఠశాల నిర్వహణ కమిటి :**

1)

2)

3)

4)

5)

6) పాఠశాల నిర్వహణ కమిటీ, సెక్షన్ 21 లోని ఉప-విభాగం (2) లోని (ఎ) నుండి (డి) నిబంధనలలో పేర్కొన్న విధులతో పాటు, ఈ క్రింది విధులను నిర్వర్తించాలి:

(a) ప్రతి తరగతి నుండి పిల్లలను యాదృచ్ఛికంగా ఎంపిక చేసుకుని వారికి చదవడం, రాయడం, సరళమైన అంకగణితం మరియు అర్థం చేసుకోవడంలో పిల్లల అభ్యాస ఫలితాలను ప్రదర్శించడానికి తగువిధంగా ఏర్పాట్లు చెయ్యాలి. మరియు విద్యార్థుల గైర్హాజరు అలాగే ఉపాధ్యాయుల గైర్హాజరుపట్లకూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

(b) చుట్టుపక్కల ఉన్న 6-14 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల యొక్క జాబితాని రూపొందించి వారిలో బడిలో చేరని పిల్లలను గుర్తించాలి.

(c) సెక్షన్ 24 మరియు సెక్షన్ 28 లోని (a) మరియు (e) క్లాజులను ఆచరించే విధంగా చూడాలి.

(d) చుట్టుపక్కల ఉన్న అందరు పిల్లలు పాఠశాలలో చేరి, హాజరు అయ్యేలా చూడాలి.

(e) షెడ్యూల్‌లో సూచించిన నిబంధనలు మరియు ప్రమాణాల నిర్వహణను పర్యవేక్షించాలి.

(f) బాలల హక్కులకు సంబంధించి ఈ ప్రమాణాలు మరియు నిబంధనల ఆచరణలో ఏమాత్రం వ్యత్యాసం కనిపించినా, పిల్లలు మానసిక శారీరక వేధింపులకు గురైనా, వారిని చేర్చుకోకుండా అడ్డుపడినా, సెక్షన్ 3 లోని సబ్-సెక్షన్ (2)లో ఇచ్చిన ఉచిత సదుపాయాలను సమయానికి వారికి అందచేయకపోయినా వాటిని స్థానిక అథారిటీలకు తెలియచేయాలి.

(g) అవసరాలను గుర్తించి, ఒక ప్రణాళికను సిద్ధం చేసి, సెక్షన్ 4 లోని నిబంధనలు అమలు అయ్యేలా చూసుకోవాలి.

(h) వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించడం, వారిని చేర్చుకోవడం మరియు వారికి నేర్చుకోవడానికి కావలసిన సదుపాయాలను సమకూర్చడం వంటి కార్యక్రమాలను పర్యవేక్షించడం, తద్వారా ఆ పిల్లల్ని ప్రాథమిక స్థాయి విద్యలో చేర్చి పూర్తి చేసేవిధంగా చూడటం.

(i) పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించడం.

(j) పాఠశాల రసీదులు మరియు ఖర్చుల వార్షిక ఖాతాను సిద్ధం చేయడం.

**(7)** ఎలాంటి డబ్బు వచ్చినా దానిని స్కూల్ నిర్వహణ సమితి యొక్క బ్యాంకు అకౌంట్‌లో జమ చెయ్యాలి. ఆ అకౌంట్ ఆ కమిటీ యొక్క చైర్మన్, కన్వీనర్ల యొక్క జాయింట్ అకౌంట్ అయ్యి ఉండాలి. ఎప్పుడు ఆడిట్‌కి వచ్చినా ఆ అకౌంట్ అందుబాటులో ఉండాలి. వారికి నిధులు ఇచ్చేటువంటి అథారిటీ వారికి ఖర్చుల వ్యయాల సర్టిఫికెట్‌ను ప్రతీ వార్షిక సంవత్స రాంతంలో అందచెయ్యాలి.

**(8)** కమిటీ యొక్క అకౌంట్స్ అన్నీ ఒక చార్టెడ్ అకౌంటెంట్‌గాని లేదా స్థానిక నిధుల ఆడిటర్ కానీ లేదా ఒక కో-ఆపరేటివ్ శాఖకు చెందిన ఆడిటర్ ద్వారాగా ఆడిట్ చేయించాలి.

పైన పేర్కొన్నవి పరిశీలించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వము, స్థానిక

అథార్టీలు నడిపే పాఠశాలల్లో బోధన మాధ్యమంగా ఏ మీడియం ఉండాలనేది నిర్ణయించే బాధ్యత కేంద్ర రాష్ట్ర రూల్స్ ప్రకారము. నిర్దేశితమైన విధానంలో పాఠశాల నిర్వహణ కమిటీది కానీ, తల్లితండ్రుల కమిటీది కాదని స్పష్టంగా గమనించవచ్చు. ఆ ప్రకారము తల్లితండ్రుల అసోసియేషన్ చేసిన తీర్మానంపై ఆధారపడి కానీ, లేదా తల్లితండ్రుల ఆకాంక్షలపైగానే ఆధారపడి బోధన మాధ్యమం మార్చడం చట్టాల్లో, రూల్స్‌లో నిర్దేశించబడలేదు.

**55.** పై జరుగుతున్న చర్చ వెలుగులో, ప్రశ్న **4**కి సమాధానం చెప్పబడింది.

*ప్రశ్న 5 :*

*ప్రాథమిక దశల్లో విద్యను బోధన మాధ్యమంగా ఇంగ్లిష్‌లోనికి మారుస్తూ జారీ చేసిన G.O.Ms.No. **85** చారిత్రక నేపథ్యానికి, చట్టనిబంధనలకు అనుగుణంగా ఉందా? మరియు కేంద్ర ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా లేదుకదా?*

**56.** ప్రస్తుతం ఈ కేసులో **12.10.2019** తేదీన పాఠశాల విద్యా కమీషనర్ లేఖ సంఖ్య **162/**A మరియు I/**2014** ప్రకారము ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో I నుంచి VIII తరగతులు **2020-21** నుంచి ఇంగ్లీష్ మీడియంలోనికి మార్చటానికి ప్రతిపాదించగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి G.O.Ms.No. **85** తేదీ **5-11-2019**న పాఠశాల విద్య ప్రోగ్రాంను జారీ చేసింది. ఈ జీవోను మరియు ఇతర జీవోలు అనగా G.O.Ms.No. **76** తేదీ **10.06.2008,** G.O.Rt.No.**30** తేదీ

21.01.2010, G.O.Ms.No.78 తేదీ 05.10.2017 మరియు ప్రభుత్వ మెమో తేదీ 16.11.2017ల జీవోలనన్నింటినీ అతిక్రమిస్తూ రద్దు చెయ్యాలని కోరుతున్న GOMS.No.85 తేదీ 20-11-2019న జారీ చెయ్యబడింది. GOMS.No.85 తేదీ 20-11-2019 న పైన చూపించిన జీవోలను అతిక్రమించి జారీ చేసినప్పటికీ ఈ జీవోల రెలెవెన్స్‌ని పరిశీలించడం సముచితం. GOMS.No.76 తేదీ 10-6-2008 ప్రకారము ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా ఇంగ్లీష్ మీడియం VI తరగతి నుంచి ప్రారంభించడానికి పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జారీ చెయ్యబడింది. అందులో జత చేసిన 6500 నోటిఫై చేసిన పాఠశాలల్లో అమలు చెయ్యబడింది. G.O.Ms.No.76 తేదీ 10.06.2008 ద్వారా తెలుగు మీడియంకు సమాంతరంగా ఇంగ్లీష్ మీడియం ఆరంభించిన పాఠశాలల్లో CBSE పాఠ్య ప్రణాళికను మార్పు చేసేందుకు G.O.Rt.No.30 తేదీ 20.01.2010 పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లో జారీ చెయ్యబడింది. గవర్నమెంట్ మెమో No.4390/Prog.I/2017 ని 16.11.2017 ప్రకారము VI తరగతి నుంచి X వ తరగతి వరకు సమాంతరంగా ఇంగ్లీష్ మీడియం ఆరంభించడానికి పాఠశాల విద్యా కమీషనర్‌కు అధికారులు ఇవ్వబడినాయి. GOMs .No.78 తేదీ 05.10.2017 (G.O.Rt.No.78 Dated 05.10.2017 అని తప్పుగా సూచించబడింది) ప్రకారము సమాంతరంగా అన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో మరియు అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 2018-19 విద్యాసంవత్సరం నుంచి I తరగతి ప్రారంభించి క్రమేణా తరువాతి విద్యా సంవత్సరాల్లో V తరగతి వరకు పెంచుకుంటూ పోవాలి. ఆ జివోలన్నింటినీ అతిక్రమిస్తూ ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్కూళ్లన్నింటిలో I నుంచి VIII తరగతి వరకు 2020-21 నుంచి ఇంగ్లీష్

మీడియంలోనికి మార్చాలని, 2021-22 విద్యా సంవత్సరంలో IX, 2022-23 సంవత్సరంలో X వ తరగతిలోకి మార్చాలని G.O.Ms.No.81 తేదీ 05.11.2019 న జారీ చెయ్యబడింది. ఆక్షేపించబడిన G.O.Ms.No.85, తేదీ 20.11.2019 ద్వారా అన్ని యాజమాన్యాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో I నుంచి VI ప్రతి సంవత్సరం ఒక తరగతి పెంచుకుంటూ తెలుగు నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలోకి, మార్చుకోవాలని నిర్ణయం తీసుకోబడింది. ఇప్పుడున్న డెప్లాయ్ చెయ్యబడిన ఉపాధ్యాయులకు నైపుణ్యాన్ని పెంచేందుకు, ఉపాధ్యాయుల కరదీపికలు రూపొందించేందుకు, ఇంగ్లీష్ బోధనలో పరిజ్ఞానం పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ, తరగతి గదులలో పాటించే ఉత్తమ పద్ధతుల సంకలనం కొత్త ఉపాధ్యాయుల ఎంపికకు ప్రతిపాదనలు సమర్పించడం వచ్చే విద్యా సంవత్సరానికి కావలసిన అనుమతిని ఇండెంట్‌ను పాఠ్య పుస్తకాల సరఫరాపై డైరెక్టర్ టెక్స్ట్ బుక్ ప్రింటింగ్ ప్రెస్ వారికి ఆదేశాలు విషయంలో నిర్ణయం తీసుకొనబడింది. ప్రభుత్వం వారి వెబ్ సైట్‌లో ఉన్న సమాచారం ఆధారంగా చాలా మంది తల్లితండ్రులు ఇంగ్లీష్ మీడియం కోరుతున్నారన్న వాస్తవం యొక్క ప్రామాణికత ప్రశ్నించబడింది. ఏమైనప్పటికీ అన్ని యాజమాన్యాలలో పాఠశాలలను ఇంగ్లీష్ మీడియంలోకి ఏకమొత్తంగా మార్చడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a), 19(1)(g), 21 మరియు 21-A స్థిరపర్చబడిన ప్రాథమిక హక్కుని ఉల్లంఘించినట్టే. ఇంగ్లీషు మీడియంలో విద్యని నేర్వాలని విధించే రెస్ట్రిక్షన్ వాక్ మరియు వ్యక్తీకరణ స్వాతంత్ర్యాలకు మరియు జీవించే హక్కులకు ఉల్లంఘన. చట్టబద్ధంగా స్థాపించబడిన సరళి ద్వారా తప్ప ఆర్టికల్ 19(2) మరియు 19(6) లందు నిర్దేశించిన

హేతుబద్ధమైన రెస్ట్రిక్షన్స్ విషయంలో తప్ప వాటిని కుదించడం లేదా తీసివేయడం జరగరాదు. అందువల్ల రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఏదైనా వృత్తిని లేదా జీవికను చేపట్టే హక్కును సదరు ఆక్షేపణకు గురైన జీవో దృష్ట్యా హరింపబడరాదు.

**57.** ఆర్టికల్ 30(1) మరియు ఆర్టికల్ 350(A) నిబంధనల దృష్ట్యా మరొక సవాలు చెయ్యబడింది. విద్యాసంస్థలను భాషా, మత ఆధారంగా ఏర్పాటు చేసుకుని నడిపించే అధికారము తీసివేయడం తగదు అని పేర్కొన్నారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 350(A) ప్రకారము, మాతృభాషలో మైనారిటీ విద్యా సంస్థలను నడుపుకునేందుకున్న హక్కు కాపాడబడుతోంది. ఈ ఆక్షేపించబడిన జీవో ఆ హక్కుని తీసివేస్తున్నది. అందువలన ఇది నిలబడదు.

**58.** 20-11-2019 తేదీన వచ్చిన G.O.Ms.No.85 **రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్** 1955 నివేదికలోని 775 పేరాకు వ్యతిరేకంగా ఉన్నదని వాదించారు. ఆ పేరాలో, ఆగస్టు 1949 నందు జరిగిన **రాష్ట్రాల విద్యాశాఖా మంత్రుల సమావేశము** నందు ఆమోదించిన తీర్మానాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది. తద్వారా పిల్లల యొక్క మాతృ భాష అక్కడి ప్రాంతీయ భాష కన్నా వేరుగా ఉంటే రాష్ట్రప్రభుత్వాలు చెయ్యాల్సిన ఏర్పాట్లను గురించి ఇది మార్గదర్శకంగా ఉంటుంది. ఏకమొత్తంగా బోధన మాధ్యమాన్ని మాతృభాష నుండి ఇంగ్లీషు భాషలోకి ప్రాథమిక స్థాయిలో మార్చడం అనేది జాతీయ విద్యా విధానం 1968 నికి మరియు మానవ హక్కుల యూనివర్సల్ డిక్లరేషన్‌కు ఆర్టికల్ 26కు విరుద్ధం. ఈ మానవ హక్కుల యూనివర్సల్ డిక్లరేషన్‌కు భారత దేశం

ఆమోదించి సంతకం చేసింది. అలాగే ఈ జీవో విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 29లోని నిబంధనలకు, కేంద్ర రూల్స్‌కు, 1982 చట్టానికి మరియు రాష్ట్ర రూల్స్ కు వ్యతిరేకంగా ఉన్నదని కూడా సవాలు చేసారు. 16.12.2019 తేదీన 62 వ శాసనసభా బిల్లు ద్వారా 1982 చట్టానికి సవరణకు ప్రతిపాదిస్తోంది. ఇది విద్యాహక్కు చట్టంలోని నిబంధనలకు విరుద్ధం అని పేర్కొన్నారు. 20.11 2019 న జారీ చేసిన ఆక్షేపణకు గురైన ఈ జీవో 16.12.2019వ తేదీన ప్రతిపాదించిన బిల్లుకు ముందే జారీ చేయబడినది. గౌరవ రాష్ట్రపతి ఆమోదం కూడా పొంది యుండ లేదు అని పేర్కొన్నారు. ఆ బిల్లు మరియు ప్రతిపాదించబడిన సవరణ కేంద్ర చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నది.. పైన పేర్కొన్న **శ్రీ సీతారాం షుగర్ కంపెనీ మరియు పీ. కృష్ణ మూర్తి తదితరులు** కేసులో వచ్చిన తీర్పులపై పిటీషనర్లు ఆధారపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన విరుద్ధమైన కార్యనిర్వాహక ఉత్తర్వులు చెల్లవని అందువల్ల దీనిని కొట్టివేయ్యి వచ్చునని వాదించారు.

**59.** విద్యాహక్కు చట్టం సెక్షన్ 29(2) తప్పుగా అర్ధాన్వయం చేయబడినది. ఎందులవలన అంటే, సెక్షన్ 29(2) ప్రకారము పాఠశాల *సాధ్యమైనంతవరకు మాత్రమే* మాతృభాషలోనే ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం పై వాదనలని ఖండించి అందువల్ల సాధ్యమైనంతవరకు అన్న మాట చాలా ప్రాముఖ్యతని కలిగి ఉన్నదని రాష్ట్రానికి విచక్షణ కలిగిస్తోందని, సమాజంలో పేదలకు మేలు జరిగేందుకు ప్రాథమిక దశలోనే ఇంగ్లీష్ మీడియం నేర్పేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. తల్లితండ్రుల ఆకాంక్షలు ప్రాథమిక విద్యా దశలోనే ఇంగ్లీష్ మీడియం వైపు

మొగ్గుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పథకం అమ్మ వొడి వారోత్సవాల్లో తల్లితండ్రుల అసోసియేషన్లు సమర్పించిన ప్రతిపాదనలు **7-1-2020** వ తేదీ తీర్మానం దీన్నే ఆమోదిస్తోంది. జారీ చేసినట్టు సదరు జీవో రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధికి లోబడి ఉన్నదని. పౌరులు ఎవరి హక్కుకి భంగం కలగదని చెప్పారు. మండల స్థాయిలో ప్రతి మండలంలో తెలుగు మీడియం పాఠశాలలో ఆరంభించాడనికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రవాణా సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. బోధన మాధ్యమం మారుస్తున్నప్పుడు, తెలుగును తప్పని సబ్జెక్టుగా చేయబడింది అని పేర్కొన్నారు. తన సమాధానంలో ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియంకు డిమాండ్ ఎక్కువగా ఉన్నదని బోధన మాధ్యమం మార్చడం సరైనదే నాని పేర్కొన్నారు. అదనంగా పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు కావలసిన సంస్కరణలు సూచించే యం. బాలకృష్ణన్ కమిటీ సూచనలపై కూడా ఆధారపడటం జరిగింది. విద్యలో ప్రమాణాలు పెంచే లక్ష్యంగా జస్టిస్ ఆర్. కాంతారావు అధ్యక్షతన రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ కూడా నియమించాము. అందువలన జారీ చేసిన జీవో జోక్యం చేసుకోనదగినది కాదు అని అన్నారు.

**60.** **1982** చట్టంలో, ప్రవేశపెట్టిన సవరణను అసెంబ్లీలో ఆమోదించారు. కానీ శాసనమండలి చేసిన ప్రతిపాదన కారణంగా అది ఆమోదించబడలేదు. అనంతరము అసెంబ్లీలో ఆమోదముద్ర పడిన తరువాత గౌరవనీయ రాష్ట్రపతి అంగీకారం కోసం పంపబడింది. దీని ద్వారా బోధన మాధ్యమాన్ని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వబడింది. అందువలన గౌరవ భారత రాష్ట్రపతి అంగీకారం వస్తుందన్న భావనతో

జీవోను జారీ చేసింది. ఇది రాష్ట్ర సంక్షేమంలో భాగంగానే ఉంది. అందువల్ల, సదరు జీవోలో జోక్యానికి అగత్యం లేదు అని వాదించారు.

**61.** కేంద్ర ప్రభుత్వం అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ద్వారా కోర్టుకు తోడ్పాటు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన **20/11/2019** నాటి GOMs.No.**85**, విద్యాహక్కు చట్టం యొక్క సెక్షన్ **29(2)**(f) యొక్క స్ఫూర్తికి విరుద్ధమని నిబంధన **3.1.1** NCF జాతీయ విద్యా విధానం **1968.** UNESCO యొక్క సిఫార్సులకు విరుద్ధమని మనవి చేశారు. అలాగే **2019** లో వచ్చినటువంటి నూతన జాతీయ విద్యా విధానం, **2019** ముసాయిదా సిఫార్సులకు ఆనుగుణ్యంగా లేదు అని పేర్కొన్నారు.

**62.** జోక్యం చేసుకుంటున్న వారి తరపున హాజరయ్యే న్యాయవాది కూడా వాదనలను అడ్వొకేట్ జనరల్ మాదిరిగానే చేశారు. అంతే కాకుండా, జోక్యం చేసుకునే వారు, వారి సంఘాలు విన్నపాలను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి జీవోని సరిగ్గానే జారీ చేసింది అని. ఈ జీవో పేదలకు, ముఖ్యంగా యస్సీయస్టీలకు ప్రయోజనకరంగా ఉంటుంది అని, దీనికి రాజ్యాంగంలోని ఆర్టికల్ **46** యొక్క మద్దతు ఉందని పేర్కొన్నారు. అందువలన పిటీషనర్లు ఈ జీవోను కొట్టివేసేందుకు చేసిన ప్రార్ధనను వ్యతిరేకిస్తూ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి మద్దతు ఇస్తూ ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా జోక్యం తగదని కోరారు.

**63.** జీవోను కొట్టివేయాలని వాదిస్తున్న పిటీషనర్ల వాదనతో ఏకీభావం కల వాదన చేస్తూ జోక్యం చేసుకున్న వారి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది శ్రీ వేదుల వెంకటరమణ, రెస్పాండెంట్ నం.**15** W.P. (ప్రజా ప్రయోజనవ్యాజ్యం) **2019** నెం. **185** కూడా రాజ్యాంగంలోని నిబంధనలకు,

విద్యాహక్కు చట్టానికి, 1982 చట్టానికి, కేంద్ర రూల్స్‌కు, రాష్ట్ర రూల్స్‌కు కూడా విరుద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ జీవోలో రాష్ట్ర ప్రభుత్వం యొక్క ప్రాథమిక లక్ష్యమైన పౌరులందరికీ విద్యనందించాలన్న ఆశయానికి విరుద్ధంగా ఉన్నది అని, అందువలన ఈ జీవో నిలబడదని తెలిపారు. అలాగే ఈ జీవో తెలుగు భాషా వారసత్వం మరియు సంస్కృతుల మనుగడకు అవరోధంగా మారుతుంది కాబట్టి ఈ జీవో నిలబడదని తెలిపారు.

**64.** పైన పేర్కొన్న, చర్చించిన సంబంధిత న్యాయవాదులు తెచ్చిన వాదనల దృష్ట్యా వాస్తవాల మాతృకలో చట్ట సంబంధమైన మరియు న్యాయ సంబంధమైన పైన చర్చించిన లేదా గమనించిన స్థితిలో ఈ ఆక్షేపించ బడిన జీవో యొక్క ప్రామాణికత విద్యాహక్కు చట్టం యొక్క నిబంధనలను అనుసరించి విశ్లేషించబడినది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం, నోటిఫికేషన్ ద్వారా నిర్దుష్టంగా పేర్కొనబడిన అకెడమిక్ అథారిటీ నోటిఫికేషన్ ద్వారా పాఠ్యప్రణాళిక మరియు మూల్యాంకన విధానాన్ని నిర్దేశిస్తుంది. పాఠ్యప్రణాళికను నిర్ణయించేటప్పుడు సదరు అథారిటీ రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా పిల్లల యొక్క సర్వతోముఖాభివృద్ధి, జ్ఞానం, అంతర్గత శక్తి మరియు ప్రతిభను నిర్మించడం, శారీరక మరియు మానసిక సామర్థ్యాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి, పిల్లల్లో ఆవిష్కరణ అలాగే అన్వేషణ శక్తిని పిల్లలకేంద్రకంగా ఉన్న వాతావరణంలో, పిల్లవాడికి భయం, భీతి మరియు ఆందోళన లేకుండా చేయడం తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేందుకు వీలుగా, సాధ్యమైనంతవరకు అతని మాతృ భాషలోనే

ఉండేటట్లు చూడాలి.20.11.2019 నాటి GOMs.No.85 ని పరిశీలించగా, అకెడమిక్ అథారిటీతో కానీ, దానిని అమలు చేసే డైరెక్టర్, సర్వ శిక్షా అభియాన్ (ఆంధ్రప్రదేశ్‌లో దీనిని రాజీవ్ విద్యామిషన్ అని పిలుస్తారు), సర్వ శిక్షా అభియాన్‌ని కానీ ప్రభుత్వం సంప్రదించినట్లు కనిపించదు. ప్రతివాదులు సమర్పించిన కౌంటర్ కూడా ఈ విషయంపై మౌనంగా ఉన్నది. అలాగే ప్రాథమిక దశలో ఆంగ్ల మాధ్యమానికి మార్చడానికి సరైన కారణాలు చెప్తూ అకెడమిక్ అథారిటీ ఇచ్చిన సూచనలు ఏమైనా ఉన్నాయా అని చూస్తే రికార్డులలో ఏవి లేవు. 47,48 పేరాగ్రాఫులలో చేసిన విస్తృత చర్చ దృష్ట్యా మా దృష్టిలో పైన పేర్కొన్న విషయాలపై అకెడమిక్ అథారిటీ నుండి ఎలాంటి సలహాలు, సూచనలు లేకుండా ఒకటి నుండి ఆరవట తరగతి వరకు, ఉన్నపళాన బోధన మాధ్యమాన్ని ప్రభుత్వం మార్చడం విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 29(2)(f)ని ఉల్లంఘించినట్టు అవుతుంది.

**65.** నిర్వివాదంగా, ఈ ఆక్షేపనకు గురైన జీవో ద్వారా అన్ని రకాల యాజమాన్యాలలో నడుస్తున్న ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలలు అన్నీ కూడా మాతృభాష తెలుగు మాధ్యమం నుండి ఇంగ్లీషు మాధ్యమంలోనికి మార్చబడ్డాయి. మాతృభాష అన్న పదానికి సుప్రీమ్ కోర్ట్ , **కర్ణాటక ప్రభుత్వం** Vs **అసోసియేటెడ్ మేనేజ్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ మీడియం, ప్రైమరీ అండ్ సెకండరీ స్కూల్స్ కేసు** విషయంలో తీర్పు చెప్పింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 350(ఏ) ని ఉదహరిస్తూ సుప్రీమ్ కోర్ట్ ఇలా చెప్పింది.

*"33. రాజ్యాంగ ప్రకారం మాతృ భాష అంటే, ఒక రాష్ట్రంలోని భాషాపరమైన మైనారిటీల భాష. అలాగే ఒక బిడ్డయొక్క మాతృభాష ఏంటి*

*అనేది అతని తల్లితండ్రులు, లేదా సంరక్షకులు నిర్ణయిస్తారు. మాతృభాషే పిల్లలకు సౌకర్యంగా ఉంటుందని కానీ, మాతృభాష అంటే అర్థం వ్యక్తీకరణ అని రాజ్యాంగం ఎక్కడా పేర్కొనలేదు. అందువలన రాజ్యాంగంలోని **350-A** ప్రకారం ఏ ఇతర నిబంధన కింద ఈ అర్థం లేదు. అందువల్ల రాజ్యంయొక్క అధికారాన్ని విస్తృతీకరించలేము. అలాగే ఆ పిల్లవాడికి సౌకర్యంగా ఉంటుందని ప్రాథమిక హక్కుపై పరిమితి విధించలేము. ఈ విధంగా ప్రశ్న (i)కి సమాధానం ఇస్తున్నాం."*

**66.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు తమ మాతృభాషగా తెలుగుని కలిగి ఉన్నారని, ప్రాథమిక దశలో ఆంధ్రప్రదేశ్ పిల్లల ప్రయోజనార్థం విద్యా హక్కు చట్టం సెక్షన్ **29(2)**, మరియు **1982** వ చట్టంలోని **7(3),7(4)** సెక్షన్ లలో విహితమైనట్టు విద్యకు బోధన మాధ్యమంగా తెలుగు ఉందనేది నిర్వివాదాంశం. కానీ పై తీర్పులో ప్రాథమిక దశలో బోధన మాధ్యమాన్ని ఎన్నుకునే హక్కు విద్యార్థికి, లేదా తల్లితండ్రులకు ఉండవచ్చు అనే విషయాన్నీ కోర్టు పరిగణించింది. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ **19(1)**(A ), **19(2)** నిబంధనల దృష్ట్యా వాక్ మరియు వ్యక్తీకరణ విషయాల్లో తమకు నచ్చినట్టు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఖచ్చితంగా అవసరమని కోర్టు పేర్కొన్నది. ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తనదైన రీతిలో అభివృద్ధి చేసుకోవడానికి ఇది అవసరమని, రాజ్యాంగం తప్పనిసరి చేస్తూ, ప్రతి పౌరుడికి వాక్కు మరియు భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రాథమిక హక్కుని ఇచ్చింది. **రొమేష్ థాపర్ వర్సెస్ మద్రాస్** కేసులో గౌరవ సుప్రీమ్ కోర్టు తీర్పుని ఆధారంగా చేసుకున్నప్పుడు అందులో ఇలా ఉంది.

"ఇప్పుడు యోగ్యత ప్రకారం చూస్కుంటే వాక్ మరియు భావ ప్రకటన స్వేచ్ఛలో భావ ప్రచార స్వేచ్ఛ ఉంటుంది. అది స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే హక్కు ద్వారా సాధ్యపడుతుంది. ప్రచురించే హక్కు ఎంతగా ఉంటుందో, అలాగే దాన్ని ప్రచారం చేసుకునే హక్కు కూడా అంతే ఉంటుంది. నిజమే. ప్రచారం లేకుండా ప్రచురణకు పెద్దవిలువ ఉండదు."

పైన పేర్కొన్నవి పరిశీలించిన తరువాత ఇది భావాలను ప్రచారం చేసే స్వేచ్ఛ. ఇది వ్యాప్తి చేసుకునే హక్కు ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది.భావాలను ప్రచారం చేసుకునే హక్కు కూడా భద్రపరచబడు తుందనే అంశం ఇందులో చేరి ఉన్నది.

**67. సకల పేపర్స్ V యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో** సర్వోన్నత న్యాయస్థానం ఇలా తీర్పు చెప్పింది.

"ఈ సూత్రాన్ని మనసులో పెట్టుకుని చూస్తే, ఒక వ్యక్తి తన భావాలను, అభిప్రాయాలను మరియు దృక్కోణాలను పూర్తిగా పూర్తి స్వేచ్ఛగా ఏ రూపమైన ప్రచురణ ద్వారానైనా ముద్రించుకునేందుకు, ప్రచారం చేసుకునేందుకు వాక్ మరియు వ్యక్తీకరణ స్వేచ్ఛలోనే గర్భితంగా కలిగి ఉంటాడన్నది స్పష్టము. ఇది, రాజ్యాంగంలో 19 వ ఆర్టికల్ 2వ క్లాజు ఆంక్షలకు లోబడి ఉంటాయి.

అందువల్ల ఒక వ్యక్తి ఆలోచనలు అభిప్రాయాలను ప్రచురించడం, పంపిణి చేయడం వాక్ స్వాతంత్ర్యపు హక్కు పరిధిలోకి వస్తుంది. అట్టి చట్టబద్ధత భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (2)కి లోబడి ఉంటుంది.

**68.** అత్యున్నత న్యాయస్థానం **బెన్నెట్ కోల్ మాన్ కో.** V **భారత యూనియన్ ఆఫ్ ఇండియా** కేసులో రాజ్యాంగ బెంచ్ యొక్క తీర్పు ఆధారంగా ఇలా పేర్కొన్నది.

"45. పత్రికా స్వేచ్ఛ అంటే పౌరులందరికీ వారి అభిప్రాయాలను మాట్లాడటం, ప్రచురించడం మరియు వ్యక్తీకరించే హక్కు అనేది నిర్వివాదాంశం. పత్రికా స్వేచ్ఛలో ప్రజలకు చదువుకునే హక్కు కూడా ఉంటుంది. పత్రికా స్వేచ్ఛ ప్రజల మాట్లాడుకునే మరియు వ్యక్తీకరించే హక్కుకు వ్యతిరేకమైనది కాదు"

తన అభిప్రాయాలను మాట్లాడటానికి, ప్రచురించడానికి మరియు వ్యక్తీకరించడానికి పౌరుడికి ఉన్న హక్కులలో చదివే హక్కుకూడా ఉంది.

69. **భారతీయ ప్రభుత్వం యొక్క సమాచార & ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి మరియు ఇతరులు** V. **క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ అండ్ అదర్స్** కేసులో, సుప్రీం కోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఎ) సమాచారం ఇచ్చే హక్కును మాత్రమే కాకుండా, సమాచారాన్ని స్వీకరించే హక్కును కూడా కలిగి ఉందని అభిప్రాయపడింది. ధర్మాసనంలోని మెజారిటీ సభ్యుల అభిప్రాయం ప్రకారం జస్టిస్ పి.బి. సావంత్ భావ ప్రకటన స్వేచ్ఛ మరియు వ్యక్తీకరణ స్వేచ్ఛ హక్కులలో సమాచారాన్ని తెలియచేసే హక్కుని, అలాగే వినోదాన్ని పంచి మరియు విద్యని పొందే హక్కు కూడా కలిగి ఉందని అభిప్రాయపడ్డారు.

70. అందువల్ల అత్యున్నత న్యాయస్థానం **కర్ణాటక రాష్ట్రము** Vs **అసోసియేటెడ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ & సెకండరీ స్కూల్స్ కేసులో ఇచ్చిన తీర్పు**లో, 40 మరియు 41 గమనిస్తే

"40. కోర్టు తీసుకున్న మునుపటి నిర్ణయాలకు అనుగుణ్యంగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఎ) లోని వాక్ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కు లోనే పిల్లవాడికి పాఠశాల యొక్క ప్రాధమిక దశలో తనకు

నచ్చిన భాషలో నేర్చుకునే హక్కుని కూడా పొందుపరిచారని భావిస్తున్నాము. ఈ మాధ్యమం ఎంపిక విషయంలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోకూడదు, ఎందుకంటే పిల్లవాడికి తనకు ఇష్టమైన మాధ్యమంలో చదువుకోవడం వలన మరింత వికాసం చెందే అవకాశం ఉంది కాబట్టి. అందువలన పిల్లవాడు గాని, అతని తరపున అతని తల్లితండ్రులు కానీ, అతని సంరక్షకులు మాత్రమే అతని మాధ్యమం ఎంచుకునే హక్కుని కలిగి ఉన్నారు. అందువలన గౌరవనీయ అడ్వొకెట్ జనరల్ వాదించినట్టు పిల్లవాడికి, లేదా అతని తరపున అతని తల్లితండ్రులకి ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమాన్ని ఎంచుకునే హక్కు ఆర్టికల్ 19(1)(a) లో పొందుపరచబడలేదు అన్న వాదనని అంగీకరించలేము.

"41. ప్రాథమిక విద్యా దశలో బోధన మాధ్యమాన్ని ఎంచుకోవడం అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) లో పేర్కొన్న వాక్ వ్యక్తీకరణ హక్కులో చేరి ఉన్నట్లయితే అప్పుడు రాజ్యానికి ఆర్టికల్ 19(2) ప్రకారము - భారత దేశ సర్వ సార్వభౌమత్వం కోసం, సమగ్రతలకోసం, రాజ్య భద్రతల కోసం, ఇతర దేశాలతో స్నేహాత్మక సంబంధాలు, **పబ్లిక్ ఆర్డర్ మర్యాద, నైతికత కోసం** ఏదైనా నేరానికి సంబంధించి కోర్టు ధిక్కరణ పరువు నష్టం, రెచ్చగొట్టడం లాంటి విషయాల్లో తప్ప రాజ్యం హేతుబద్ధమైన రెస్ట్రిక్షన్స్ విధించలేదు అని మిస్టర్ భట్ చేసిన వాదనను మేము అంగీకరించడం లేదు. మా దృష్టిలో రాజ్యాంగ నిర్మాతలు ఆర్టికల్ 19(2) క్లాజ్ నందు పేర్కొన్న ప్రయోజనాలకు తప్ప అతి విలువైన హక్కుగా ఉన్న వాక్, వ్యక్తీకరణ స్వాతంత్ర్యాలపై హేతుబద్ధమైన రెస్ట్రిక్షన్స్ విధించేందుకు రాజ్యానికి అధికారం ఇవ్వదలుచుకోలేదు. ఎందువలన అంటే, వాక్, వ్యక్తీకరణ స్వాతంత్ర్యాలపై ఇతర రెస్ట్రిక్షన్స్ విధించడం ప్రతి పౌరిడికి ఉన్న వ్యక్తిత్వ అభివృద్ధికి, జాతి యొక్క విశాల ప్రయోజనాలకు హానికరమని వారు వాదించారు.

**71.** పై పేర్కొనబడిన దృష్ట్యా, ఒక విద్యార్థికి, అలాగే అతని తరపున తల్లితండ్రులకు గాని, సంరక్షకులకు గాని, వారికి ఇష్టమైన మాధ్యమంలో ప్రాథమిక స్థాయిలో విద్యాబోధనని ఎంచుకునే హక్కు ఉందని సుస్పష్టంగా తెలుస్తోంది. పై కేసులో ప్రభుత్వం యొక్క వాదనని కొట్టివేస్తూ, వాక్ స్వేచ్ఛ హక్కులో పిల్లవాడికి ప్రాథమిక స్థాయిలో తనకు నచ్చిన మాధ్యమంలో నేర్చుకునే హక్కు కూడా ఉందని స్పష్టం చేసింది. అలాగే, తర్కబద్ధమైన ఆంక్షలు అంటే, రాజ్యాంగంలోని 19(2) లో చెప్పబడిన నిర్బంధమే తప్ప, వాక్ స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ని నియంత్రించడం కాదు అని స్పష్టం చేసింది. అలా చేస్తే అతని వ్యక్తిత్వ ఎదుగుదలని మనం నియంత్రించినట్టే అని తేల్చి చెప్పింది. ఈ సందర్భంలో పేరా 42లో ఈ ప్రకారంగా చెప్పింది.

"42. రాజ్యంగంలో ఆర్టికల్ 19 (2) లో పేర్కొన్న విధంగా కాక ఇతర ప్రయోజనాల కోసం హేతుబద్ధమైన ఆంక్షలు విధించేందుకు రాష్ట్రానికి ఏ అధికారం లేదు. ఈ కారణంతో పిల్లవాడికి ఉన్న హక్కును వాక్ వ్యక్తీకరణ స్వాతంత్రాల నుంచి వేరు చేయలేము.

కాబట్టి, ఈ వివరణల దృష్ట్యా మాతృ భాష స్థానంలో ఇంగ్లీషు మాధ్యమం తీసుకు రావడం అన్నది ప్రజలకు ఉపయోగపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వాదన సర్వోన్నత న్యాయస్థానం వారు చేసిన తీర్పుకు విరుద్ధమైనది అని నిశ్చయానికి రావచ్చును. ఇంకా చెప్పాలంటే, ఒక కలం పోటుతో అప్పటికప్పుడు మాతృభాష మాధ్యమం స్థానంలో ఇంగ్లీషు మాధ్యమంలోకి మార్చడం అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) పై దుష్ప్రభావం లేదా ప్రతికూల ప్రభావం కలిగించినట్టే. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో చెప్తున్న కారణాలు, రాజ్యాంగంలోని

ఆర్టికల్ 19(2)లో చెప్పబడిన హేతుబద్ధమైన ఆంక్షల కిందకు రావు. దాంతోపాటు, ప్రశ్న నం.4 కి సమాధానంగా పేరాగ్రాఫ్ నం.37 ని సవివరంగా చర్చించబడింది. దాని రెఫెరెన్స్ చూడవచ్చును స్వీకరించవచ్చు."

**72.** ఈ దశలో, విద్యా హక్కు చట్టం సెక్షన్ 29(2)(f)లో వాడిన "సాధ్యమైనంత వరకు" అన్న పరిభాషను అడ్వొకేట్ జనరల్ తాను ఆధారపడిన తీర్పులకు అనుగుణంగా బోధన మాధ్యమం సంబంధంగా అనువర్తించి ఆ పారిభాషిక పదం వలన విద్యాబోధన మాతృభాషలోనే విధిగా ఉండా లనేది సరికాదని ప్రభుత్వానికి విచక్షణాధికారం ఉన్నదని పేర్కొన్నారు. ఈ వాదనను సమర్థించుకునేందుకు పైన పేర్కొన్న **ఎన్.కె.చౌహాన్ మరియు ఇతరులు తీర్పు**పై ఆధారపడ్డారు. ఆ తీర్పులో సర్వోన్నత న్యాయస్థానము "సాధ్యమైనంత వరకు" అంటే పరిపాలనా ప్రయోజనాలకు ఉపయోగించే హక్కుగా వాడినప్పుడు దానిలో జోక్యం చేసుకోరాదని, ప్రభుత్వం యొక్క సాధారణ సరళి సజావుగా కొనసాగ డానికి ఇబ్బంది కలిగినప్పుడు ఉత్పన్నమైన ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి ఉన్న సరళత్వ నిబంధన ఇది. పైన పేర్కొన్న **ఉస్మానియా యూనివర్సిటీ తీర్పు**పై ఆధారపడటమైనది. అందులో విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బందికి వయసు విషయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ చట్టంలో సెక్షన్ 38(1)లో వాడిన "సాధ్యమైనంత వరకు" అన్న పదం అర్థాన్వయం చేయబడినది. సర్వీస్ నిబంధలను నిర్ధారించేందుకు దీనివలన సరళత్వం లభిస్తుందని చట్టం గుర్తిస్తోందని చెప్పింది. పైన పేర్కొన్న **రాజేంద్రసింగ్ తీర్పు**పై ఆధారపడటం జరిగింది. అందులో "సాధ్యమైనంత వరకు" అని చట్టంలో వాడిన మాటకు

నిషేధ స్వభావము ఏమి లేదు, విహిత అథారిటీకి విచక్షణాధికారం దఖలు పడుతుంది. పైన పేర్కొన్న **ఇరీడియం టెలికం లిమిటెడ్ తీర్పు**పై ఆధారపడి "సాధ్యమైనంత వరకు" అన్న మాట కేవలం ఆదేశాత్మకం మాత్రమేనని వాదించారు.

**73.** చట్టాలను అర్థాన్వయం చేసేటప్పుడు ఆ చట్ట నిబంధన ఏ లక్ష్యాన్ని ఉద్దేశ్యించి వచ్చిందన్న సందర్భం ప్రకారం అన్వయించుకోవాలి అనేది స్థిరీకరించబడిన సూత్రం. విద్యా హక్కు చట్టం 29 వ సెక్షన్ 2(a నుండి h) పరిగణనలోకి తీసుకున్నప్పుడు అకెడమిక్ అథారిటీ చేత కరికులం అండ్ అవాల్యుయేషన్ ప్రొసీజర్ చెయ్యబడాలని విద్యా హక్కు చట్టంలో 29వ సెక్షన్ కింద నిబంధన తెచ్చారు. ఆ సందర్భంలో బోధన మాధ్యమం సాధ్యమైనంతవరకు పిల్లవాడి మాతృ భాషలోనే ఉండాలని అన్నారు. 1955 రాష్ట్ర పునఃవ్యవస్థీకరణ నివేదిక, 1968 జాతీయ విద్యా విధానం, 2003 UNESCO సిఫార్సులు, 2005 జాతీయ ప్రణాళికా చట్టం ప్రాథమిక దశలో బోధన మాధ్యమం మాతృ భాషలోనే ఉండాలనేది స్పష్టం. పైన పేర్కొన్న **స్టేట్ ఆఫ్ కర్ణాటక** Vs **అసోసియేటెడ్ మానేజ్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ అండ్ సెకండరీ స్కూల్స్ కేసులో** సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న అర్థాన్వయం ప్రకారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) ప్రకారం పౌరుడికి ఉన్న వాక్, వ్యక్తీకరణ స్వతంత్రాల్లోనే గర్భితంగా బోధన మాధ్యమాన్ని ఎంచుకునే స్వాతంత్ర్యం/స్వేచ్ఛ ఉంటాయి. అందువల్ల ఆ సందర్భంలో విద్యాహక్కు చట్టం సెక్షన్ 29(2) లో వాడిన "సాధ్యమైనంత వరకు" అన్న పదాన్ని మేము అర్థాన్వయం చేస్తే పరస్పరం మార్చుకోదగినది కాదు అని అర్థం వస్తుంది. అంటే, దానివల్ల ఆంధ్రప్రదేశ్

రాష్ట్రంలో దశాబ్దాల నుండి కొనసాగుతున్న బోధన మాధ్యమంగా ఉన్న తెలుగును కేవలం కలం పోటుతో విద్యాహక్కు చట్టం 29(2) ను రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా అర్ధాన్వయం చెయ్యరాదు. అందువల్ల "సాధ్యమైనంత వరకు" అన్న మాటకు అర్ధాన్వయానికి సంబంధించి విచక్షణపై ఆధారపడి ఉంటుందని చెప్పడం న్యాయం. కేసులో పేర్కొన్న వాస్తవాలు, పరిస్థితుల రీత్యా చూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇది ఉపకరించదు.

**74.** ఇంతకు పూర్వమే పైన ఉదాహరింపబడినట్లు 20.11.2019 నాటి G.O.Ms.No.85 ద్వారా అన్ని యాజమాన్యాలలో ఉన్న ప్రాథమిక, ఉన్నత మరియు ఉన్నత పాఠశాలలలో I నుండి VI వరకు తరగతులు తెలుగు మాధ్యమం నుండి ఆంగ్ల మాధ్యమంలోనికి మార్చబడ్డాయి. విద్యాహక్కు చట్టం 2(N) నందు పాఠశాల నిర్వచించబడింది. దీనిలో ప్రభుత్వం గుర్తించిన ప్రైవేట్ యాజమాన్యం నడుపుతున్న పాఠశాలలు కూడా చేరి ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(g) ప్రకారం పౌరుడు ఏదైనా వృత్తిని జీవనాధారాన్ని వ్యాపారాన్ని వాణిజ్యాన్ని నిర్వహించు కునేందుకు పౌరుడికి హక్కు ఉన్నది. ఇది, ఆర్టికల్ 19(6) కు విరుద్ధంగా ఉండరాదు. అన్ని పాఠశాలల్ని ఇంగ్లీష్ మీడియంలోనికి ఎలా మార్చడం వీలవుతుందో చూపెడుతూ తెచ్చిన జీవోలో కానీ కౌంటర్ అఫిడవిట్ లో ఆర్టికల్ 19(6) అంశాలు లేనందువలన సంస్థలను నిర్బంధిస్తూ ఏకమొత్తంగా బోధన మాధ్యమాన్ని తెలుగు మాధ్యమం నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలోనికి మార్చడం అట్టి సంస్థలను నడుపుతున్న వ్యక్తి ప్రాథమిక హక్కుపై దుష్ప్రభావం లేదా ప్రతికూల ప్రభావం చూపుతుంది. పైన 38 వ పేరాలో చేసిన చర్చ దృష్ట్యా అది రాజ్యాంగం యొక్క యదార్ధ స్ఫూర్తికి వ్యతిరేకం.

**75.** సుప్రీమ్ కోర్టువారు పైన పేర్కొన్న **మోహిని జైన్ మరియు ఉన్నికృష్ణన్ జె.పి తదితరుల కేసులో** తీర్పు దృష్ట్యా జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛా హక్కులోనే విద్యాహక్కు చట్టం కూడా ఉంటుందనేది స్థిరమైన న్యాయం. ఇంతకు ముందే పేర్కొన్నట్లు, ఆ తీర్పులు చెప్పేటప్పటికే నిర్బంధ ఉచిత విద్య రాజ్యాంగంలో ఆదేశ సూత్రాలలో ఆర్టికల్ 45 ప్రకారము నిర్దేశించబడి ఉన్నది. సదరు హక్కు ప్రాధాన్యతను గుర్తించి 86 వ రాజ్యాంగ సవరణ ద్వారా 1-4-2010 నుంచి ఆర్టికల్ 21(a) ని ప్రవేశ పెట్టి ప్రాథమిక హక్కుగా చేర్చబడింది. ఆర్టికల్ 21(a) ప్రకారము 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలు, పౌరులందరికీ రాజ్యం చట్టరీత్యా నిర్ణయించిన పద్ధతిలో ఉచిత నిర్బంధ విద్యను పొందే హక్కుని కలిగి ఉంటారు. 1982 వ చట్టం సెక్షన్ 7(3) ప్రకారం, ప్రాథమిక విద్యా దశలో 6-14 సంవత్సరాల మధ్యన ఉన్న పిల్లలకు విద్యను నేర్పాలి. 1982 న చట్టము నందు సెక్షన్ 2(12) నందు నిర్వచించబడిన విహితమైన కాంపిటెంట్ అథారిటీ చేత పేర్కొనబడిన మాతృభాషలోనే విద్య ఉండాలి. అట్టి విద్యా బోధన అవిస్మృత అక్షరాస్యత సామాజికంగా ఉపయోగపడే పని చేసేందుకు కావాల్సిన నైపుణ్యాన్ని సాధించేదిగా ఉండాలి. 1982 చట్టం సెక్షన్ 7(4)(a) ప్రకారము సెకండరీ విద్య ప్రధాన ఉద్దేశ్యం ఆ విద్యార్థిని తన సెకండరీ విద్యని పార్టీ చేసే సమయానికి ఉన్నత విద్యకు లేదా వృత్తిపరమైన కోర్సులకు యోగ్యుడయ్యేంత సాధారణ విద్యను నేర్పించడం. అందులో క్లాజ్ (b) సాధారణ విద్య అంటే అన్వయం చెబుతూ తన మాతృభాషలో భాష నైపుణ్యాలుగాని సాహిత్య ప్రశంశ గాని, ఆ అభివృద్ధి చేసేదిగా ఉంటుందని స్పష్టం చేసింది. ఆ ప్రకారముగా

ఆర్టికల్ 21(a) కు దోహదపడేటట్టు వ్యక్తీకరణ సామర్థ్యాన్ని, సామజిక పరిసరాలకు కావాల్సిన పరిజ్ఞానం, సామాజికంగా ఉపయోగపడే ఉత్పత్తి కారక పనిలో నైపుణ్యంతో సహా కావాల్సిన నైపుణ్యాలు సాధించేందుకు మాతృ భాషలో అవిస్మృత అక్షరాస్యత ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చట్ట రీత్యా నిర్ధారించింది. పైన పేర్కొన్నది కాకుండా వేరేది ఏదైనా నిర్ధారించబడ్డది అన్నది రికార్డుల్లో చూపలేదు. అందువల్ల 1982 చట్టంలో పేర్కొన్న నిబంధనల్ని, రాజ్యంగంలో ఆర్టికల్ 21(A) భాషను గాని పరిశీలించినప్పుడు ప్రభుత్వం జారీ చేసిన ఆక్షేపణకు గురైన ఈ జీవో 1982 చట్టం సెక్షన్ 7(3), 7(4) లకు అనుగుణంగా లేదు.

**మోహిని జైన్ మరియు ఉన్నికృష్ణన్ జె.పి తదితరులు కేసులో** గౌరవనీయమైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెలుగులో, జీవన హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ విద్యకు హక్కును కలిగి ఉండటం చాలా సరళమైన చట్టం. ఇంతకు ముందు చెప్పినట్లుగా, చెప్పిన తీర్పుల సమయంలో, ఉచిత మరియు నిర్బంధ విద్య అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 45 ప్రకారం పేర్కొన్న రాష్ట్ర విధానం యొక్క నిర్దేశక సూత్రాలలో ఒక భాగం. చెప్పిన హక్కు యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ఇప్పుడు అది 01.04.2010 నుండి అమల్లోకి వచ్చే 86 వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఎ ను ప్రవేశపెట్టే ప్రాథమిక హక్కులలో భాగంగా ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఎ ప్రకారం, దేశంలోని పిల్లలు / పౌరులకు 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల వయస్సు వరకు ఉచిత మరియు నిర్బంధ విద్యను పొందే హక్కు రాష్ట్రం, చట్టం ప్రకారం నిర్ణయించవచ్చు. 1982 చట్టం యొక్క సెక్షన్ 7 (3) ప్రకారం, ప్రాథమిక విద్య దశలో, 6 నుండి 14 సంవత్సరాల మధ్య పిల్లలకు విద్య

మరియు పాఠ్యప్రణాళిక ఇవ్వబడతాయి మరియు విద్య యొక్క బోధన సూచించిన విధంగా ఉండాలి. 1982 చట్టం యొక్క సెక్షన్ 2 (12) లో నిర్వచించబడిన సమర్థ అధికారం, మాతృభాషలో అవిత్మృత అక్షరాస్యతతో సహా సాంఘిక వాతావరణం యొక్క ఉచ్చారణ జ్ఞానం మరియు సామాజికంగా ఉపయోగకరమైన ఉత్పాదక పనిలో నైపుణ్యం వంటి లక్ష్యాలను సాధించడానికి. 1982 చట్టం యొక్క సెక్షన్ 7 (4) (ఎ) ప్రకారం, మాధ్యమిక విద్య యొక్క ప్రధాన లక్ష్యం. అటువంటి సాధారణ విద్యను అందించడం, ఈ విద్యార్థిని ఉన్నత విద్యా అధ్యయనాలకు లేదా ఆధారిత వృత్తిపరమైన కోర్సులకు సరిపోయేలా చేస్తుంది. అతను తన మాధ్యమిక విద్యను పూర్తి చేసిన సమయం నిబంధన (బి) లో, 'సాధారణ విద్య' ను వివరించేటప్పుడు, ఇది HCJ & NJS, J 79 W.P. (పిఐఎల్) 2019 యొక్క 183 మరియు 185 భాషా నైపుణ్యాల అభివృద్ధి మరియు మాతృభాషలో లేదా ప్రాంతీయ భాషలో సాహిత్య ప్రశంసలు ఉన్నాయి. అందువల్ల, ఆర్టికల్ 21-ఎ యొక్క అభివృద్ధిలో, రాష్ట్రం, మాతృభాషలో అవిత్మృత అక్షరాస్యతను నిర్ణయించింది, ఉచ్చారణ యొక్క నైపుణ్యాలు, సామాజిక వాతావరణంపై అవసరమైన జ్ఞానం మరియు పౌరులకు సామాజికంగా ఉపయోగకరమైన ఉత్పాదక పనిలో ప్రావీణ్యం. ఇది రికార్డులోకి తీసుకురాబడలేదు, రాష్ట్రం, పైన పేర్కొన్నది కాకుండా వేరే చట్టం ద్వారా నిర్ణయించబడుతుంది. అందువల్ల, 1982 చట్టంలో పేర్కొన్న నిబంధనలు మరియు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-ఎ యొక్క భాషలను చూస్తే, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రేరేపిత 1982 చట్టం GO లోని సెక్షన్ 7 (3) మరియు (4) లోని నిబంధనలకు అనుగుణంగా లేదు.

**76.** ఇంకా, **కర్ణాటక రాష్ట్రం** V **అసోసియేటెడ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ & సెకండరీ స్కూల్స్ తదితరుల కేసులో** పైన పేర్కొన్న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకొని, ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి వాక్ మరియు వ్యక్తీకరణ స్వేచ్ఛ అవసరమని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. **శ్రీమతి మోహిని జైన్ మరియు ఉన్నికృష్ణన్ జెపి తదితరుల విషయంలో,** అత్యున్నత న్యాయస్థానము, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 41 మరియు 45 లను ప్రస్తావిస్తూ, ఒక మనిషికి గౌరవం దక్కాలి అంటే అతనికి ఒక వ్యక్తిత్వం ఏర్పడితే తప్ప కుదరదు, అలాంటి వ్యక్తిత్వం ఏర్పడాలంటే ఖచ్చితంగా విద్య అవసరం అని చెప్పారు. UDHR *"విద్య మానవ వ్యక్తిత్వం యొక్క పూర్తి అభివృద్ధికి దోహదం చేస్తుంది* "అని నొక్కి చెప్పింది. ఆ ప్రకారం ఒక పౌరుడికి వ్యక్తిత్వం అభివృద్ధి కావాలంటే విద్య ద్వారానే వాక్కు వ్యక్తీకరణ విషయాల్లో స్వాతంత్ర్యం అత్యావశ్యకం.

**77.** **మెర్రియం వెబ్‌స్టర్ డిక్షనరీలో** 'వ్యక్తిత్వం' అనే పదానికి అర్థంగా *"ఒక వ్యక్తి లేదా దేశం లేదా సమూహాన్ని వేరుచేసే విలక్షణ లక్షణాల సమూహం, విలక్షణమైన లక్షణాలు మరియు లక్షణాల సమితి."* అని చెప్పబడి ఉంది. ***రాబర్ట్ పార్క్*** *మరియు* ***ఎర్నెస్ట్ బర్గెస్*** *ప్రకారం, "వ్యక్తిత్వం అనేది సమూహంలోని వ్యక్తి పాత్రను నిర్ణయించే లక్షణాల మొత్తం మరియు సంస్థ".* ***లింటన్*** ప్రకారం, *"వ్యక్తిత్వం అనగా ఒక వ్యక్తిలో జరిగే మానసిక ప్రక్రియల సమస్తం, అలాగే అది అతనికి కల్పించే స్థాయి".* అని చెప్పారు. **లుండ్‌బర్గ్ ప్రకారం,** *"వ్యక్తిత్వం అనే పదం అలవాట్లు, వైఖరులు మరియు ఇతర సామాజిక లక్షణాలను సూచిస్తుంది".*

**పి. రామనాథ అయ్యర్** యొక్క ది లా లెక్సికాన్ ప్రకారం, *'వ్యక్తిత్వం' అనే పదం "వ్యక్తిత్వం అనేది ఒక వ్యక్తి యొక్క భౌతిక స్వరూపం లేదా శారీరక స్వరూపం మాత్రమే కాదు, మానసిక మరియు మానసిక లక్షణాలతో సహా అతని ప్రవర్తన యొక్క మొత్తం లక్షణాలు అని అర్థం."* భారతీయ మానసిక చింతన తాత్వికతలో 'వ్యక్తిత్వం' అనే పదాన్ని నిర్దిష్టంగా ఇది అని స్పష్టంగా చెప్పకపోయినా, దానికి బదులుగా గ్రంథాలలో **స్వభావము** అన్న అర్థంలో దాన్ని వినియోగించారు. భావన వ్యక్తిత్వానికి సంబంధించిన అన్ని అంశాలను వివరిస్తుంది. ఇది వ్యక్తిత్వం యొక్క అన్ని కోణాలని స్పృశిస్తుంది. **స్వభావము** అనేది అత్యావశ్యకము అయిన లక్షణం. అది అన్నిటిలోకి తననితాను ఆవిష్కరించుకునే ఆత్మ వేగం.

**78.** పైన పేర్కొన్న సందర్భానుసారం, ఒక వ్యక్తిత్వాన్ని తయారు చేసే అంతర్గత సూత్రాలు ఏమిటన్నది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఉపనిషత్తుల్లో పేర్కొన్న ప్రకారము, ప్రాచీన భారత దేశపు వ్యక్తిత్వ నమూనా 5 ఆవరణాలతో ఉంటుంది. అవి అన్నమయం(ఆహార ఆవరణము), ప్రాణమయ (జీవాన్ని ఇచ్చే వాతావరణం), మనోమయ (మానసిక ఆవరణం), విజ్ఞానమయ (బౌద్ధిక ఆవరణం), ఆనందమయ (ఆనందావరణము) అవి. మానవుడి వ్యవస్థలో భాగమైన అన్నమయము అన్నము అనగా ఆహారము చేత పోషింపబడుతుంది. ప్రాణమయ భాగము, ప్రాణము చేతను అంటే జీవశక్తి చేత పోషింపబడుతుంది. **మనోమయ** భాగము **విద్య** చేత పోషింపబడుతుంది. విజ్ఞానమయము అహం చేత, ఆనందమయము ఉద్వేగాలతోనూ పోషింపబడుతుంది. ఇది వ్యక్తిత్వం వికాసం అనేది పలు కారణాల ద్వారా, పరిస్థితుల ద్వారా

తయారవుతుంది కానీ, వేరు చేసి విడిగా చూడకూడదు. అతని చుట్టూ ఉన్న సమూహం, సంస్కృతి, జీవుడి ప్రవర్తనని, ఆలోచనని శాసిస్తాయి. అలాగే ప్రాథమిక స్థాయి విద్య అందించే సమయంలో కుటుంబం, సామాజిక పరిస్థితులు ఆరంభ రూపంలో ఉన్న వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. బిడ్డ నేర్చుకునేది ఏదైనా, జీవిత కాలం పాటు శాశ్వతంగా ఉంటుంది. తరువాతి కాలంలో, పనిలో సామాజిక క్రియల్లో సాటి వారితో ఉన్న మౌలిక అనుబంధాలు అతని వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయి.

**79.** శ్రీ అరబిందో ఏక కేంద్ర వ్యవస్థ మరియు నిలువుల వ్యవస్థలు ఏకకాలంలో పనిచేస్తుంటాయని నొక్కిచెప్పారు. ఇక కేంద్ర వ్యవస్థ వృత్తాల లేదా ఆవరణల శ్రేణి లాంటిది. అందులో బయటి వృత్తంలో భౌతిక శరీరం, శారీరక, మానసిక ఆవరణలకు సంబంధించిన అవగాహనలు ఉంటాయి. ఈ మూడు రకాల చేతనలు ఒకదానికి మరొకటి పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. మనందరిలోనూ అన్నింటిలోనూ ఉన్న అఖండ దివ్యాత్మ జ్యోతి యొక్క మానసిక అస్తిత్వాన్ని అంతరాంతర వృత్తంలో ఉంటుంది. అంతః మనస్సుకి సంబంధించిన మనసు విశ్వ శక్తితో కలిసి ఉంటుంది. అంతరాంతర భాగం సైకిక్ జీవిగా మన అందరిలో ఉన్న అత్యుత్తమ మహా శక్తిని సూచిస్తుంది. దాన్నే మనం ఆత్మ అని పిలుస్తాం. అలాగే నిలువు వ్యవస్థ ఒక మెట్ల వరుసలాగా, పలు స్థాయిల్లో, అచేతన నుండి మహా చేతనావస్థకు సంబంధాన్ని కలిగి ఉంటుంది. వక్తిత్వం అనే వ్యక్తీకరణకు విశాలమైనఅర్థాన్ని సూచిస్తుంది. అది కేవలం వ్యక్తి యొక్క శారీరక లక్షణాలు మాత్రమే కాకుండా, అతని మానసిక ప్రవృత్తిని కూడా వివరించడానికి వాడతారు అని పేర్కొంటుంది.

వ్యక్తిత్వం అనే పదం, ఒక వ్యక్తిని వివరించడానికి పలు రకాలుగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు అతని రూపు రేఖలను వివరించడానికి కూడా వాడొచ్చు. అయితే, మానసిక శాస్త్రవేత్తలు దాన్ని, మనిషి యొక్క ఆలోచనా విధానం, అతని భావాలూ అతను స్పందించే తీరుని వివరించ డానికి వాడతారు. ఆయా సందర్భాల్లో ఆ వ్యక్తి తరుచూ ప్రవర్తించే, ప్రతిస్పందించే తీరు అని వ్యక్తిత్వం ఎలాంటిదో చెప్తుంది. అతను ఎలా స్పందిస్తాడో, ఎలా ప్రతిస్పందిస్తాడో అనేది చెప్పడానికి ఈ పదాన్ని వాడతారు.

**80.** ఆ విధంగా పిల్లవాడిలో దాగి ఉన్న శక్తిని, ప్రతిభని పరిజ్ఞానాలతో పాటు భౌతిక, మానసిక సామర్ధ్యాలతో సర్వతోముఖాభివృద్ధితో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం చేయడానికి ఉపకరించేందుకు వీలుగా విద్య అనేది ఉండాలి. ఇది పిల్లవాడితో స్నేహాత్మకంగానూ పిల్లవాడి కేంద్రకంగా ఉండాలి. అందువల్ల సదరు పిల్లవాడు భయం, ఆందోళన, బెంగలకు దూరంగా ఉంటాడు. ఏమైతేనేమి, ఏ బోధన మాధ్యమంలో పెంచబడ్డాడు, విద్యావంతుడు అయ్యాడు అనేది పిల్లవాడి సర్వతోముఖాభివృద్ధిలో ప్రధాన భూమిక వహిస్తుంది. మాతృభాష వ్యక్తిగత, సామాజిక మరియు సాంస్కృతిక గుర్తింపును అభివృద్ధి పరచడంలో పెద్ద పాత్రను వహిస్తుంది. ఇంకా మరింత రూపుదిద్దుకున్న ఆరోగ్యంతో, ఆత్మవిశ్వాసంతో వాళ్లని వాళ్లు అర్థం చేసుకోవడానికి, సమాజంలో వారి స్థానాన్ని వారు లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రథమ భాష తోడ్పడుతుంది. విద్యాహక్కు చట్టం **29(2)** సెక్షన్ ప్రకారం, **1982** చట్టం సెక్షన్లు **(7) (3)** మరియు **(4)** ప్రకారం పాఠ్య ప్రణాళిక మరియు బోధన మాధ్యమం మాతృభాషలోనే

ఉండాలి. లేదా మాతృభాషలో అవిస్మృత అక్షరాస్యత ఉండాలి. ఆ విధంగా పిల్లవాడికి విద్య ద్వారా వ్యక్తిత్వం పెరుగుతుంది. అట్టి విద్యను మాతృ భాషలోనే నేర్పితే భయం లేని వాతావరణంలో పిల్లవాడు చదువుకోవడానికి సాధ్యం అవుతుంది. అందువల్ల అతను తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే స్థితిలో ఉంటాడు.

**81.** ఏమైనప్పటికీ, గమనార్హమైన కీలక అంశాలను పక్కన పెడితే **50**వ పేరాగ్రాఫ్‌లో సూచించినట్టు **1982** చట్టాన్ని సవరించేందుకు శాసన సభ బిల్. **62, 2019**ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అట్టి సవరణల ద్వారా ప్రభుత్వ పాఠశాలల సామర్ధ్యాన్ని పెంచేందుకు ఇంగ్లీషు మీడియంలోకి మార్చేందుకు వీలుగా సెక్షన్ **7(3)(c)** తరువాత సెక్షన్ **7(4)(ii)** ప్రకారము ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మాధ్యమంగా చేసింది. **1982** వ చట్టంలో **99** వ సెక్షన్ ప్రభుత్వానికి రూల్స్ చెయ్యడానికి అధికారం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూల్స్ చెయ్యడానికి రూల్ **(i)** (viii) ప్రకారం ఈ అధికారము విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలు, కోర్స్ ఆఫ్ స్టడీకి సంబంధించినవి. ఏమైనప్పటికి ప్రతిపాదించిన సవరణ, ఇంగ్లీష్ మీడియంలో బోధన చివరగా చేర్చి రాష్ట్ర ప్రభుత్వం బోధన మాధ్యమాన్ని మార్చాలని అభిలషిస్తోంది. సెక్షన్ **7(3)** ప్రకారము **6** నుంచి **14** సంవత్సరములలోపు వయసు వారికి కాంపిటెంట్ అథారిటీ నిర్దేశించిన పాఠ్య ప్రణాళిక మరియు ఆదేశాలు విహితమైన లక్ష్యాలను సాధించడానికి ఉద్దేసించబడినవి. విద్యాహక్కు చట్టం సెక్షన్ **29(2)** ప్రకారము సెక్షన్ **29(2)(a)** నుంచి **(h)** వరకు నిర్దేశించిన షరతులను దృష్టిలో ఉంచుకుని అకెడమిక్ అథారిటీ పాఠ్య ప్రణాళిక నిర్ణయించాలి. అందువల్ల కాంపిటెంట్

అథారిటీ - అకెడమిక్ అథారిటీలుగా NCERT - SCERT లను పేర్కొన వచ్చును. వారు పాఠ్య ప్రణాళికను బోధన మాధ్యమాన్ని నిర్ణయిస్తారు. ఇప్పుడు ప్రతిపాదించిన సవరణ ప్రకారము ఆ అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలనుకొంటోంది. ఈ తీర్పులో పేరాగ్రాఫ్ 50 లో విస్తృతంగా దీనిని చర్చించడం జరిగింది. ఆ ప్రకారంగా రెండు చట్టాల ప్రబలమైన ఆశయం చూసినట్లయితే ఈ సవరణకు పూర్వం ఒక దానితో ఒకటి పోలి ఉన్నాయి. కానీ, అనంతరం వేరైనట్లుగా ఉంది.

**82.** ఆర్టికల్ 254 ప్రకారము ఉభయ జాబితాలలోని విషయాలలో విషయపరంగా ఉన్న నిబంధనలరీత్యా ఇట్టి వైరుధ్యం ఉండరాదు. లేని పక్షంలో కేంద్ర చట్టం చెల్లుతుంది. వైరుధ్యం ఉన్నచోట భారత రాష్ట్రపతి సమ్మతి పొందిన తరువాత ఆ రాష్ట్ర చట్టాన్ని పాటించవచ్చు. విద్యాహక్కు చట్టం కింద లేదా 1982 చట్టం కింద బోధన మాధ్యమం విషయంలో చట్ట సవరణకు మునుపు ఒకేరకంగా ఉన్నది. ఇప్పుడు ప్రతిపాదించే సవరణవల్ల రాష్ట్ర చట్టం కేంద్ర చట్టం కన్నా వేరే అవుతుంది. వాళ్ళే అంగీకరిస్తున్నట్టుగా భారత రాష్ట్రపతి సమ్మతి ఇంకా అందలేదు. అట్టి పరిస్థితుల్లో ఈ ఆక్షేపించబడిన జీవో ద్వారా మాతృభాష తెలుగు నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలోకి మార్చడం వైరుధ్య సిద్ధాంతానికి (Doctorine of repugnancy) గురవుతున్నది. ఈ విషయం 52 వ పేరాలో వివరంగా చర్చించబడింది. దానిని దీనికి సమర్ధనగా తీసుకోవచ్చు.

**83.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైనారిటీలు ఉన్నారని న్యాయస్థాన నోటీసులో ఉన్నది. రాష్ట్రంలో ఒక భాగం ఒడిశాకు, ఇంకొక భాగం కర్ణాటకకు, మరొకటి తమిళనాడుకు కదనొక్కుకొని ఉన్నాయి. ఏమైతేనేమి,

కన్నడ, తమిళ, ఒడియా అల్ప సంఖ్యాక వ్యక్తులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు. భాష పరమైన అల్ప సంఖ్యాకులకు స్వేచ్ఛనిస్తూ పాఠశాలలు నడుస్తున్నాయి. రాజ్యాంగంలోని అర్టికల్ 30 మత, భాష ఆధారంగా విద్యా సంస్థలు నడుపుకునేందుకు వాటిని నిర్వహించు కునేందుకు హక్కుని ప్రసాదించింది. ఆర్టికల్ 30(1)(a) వాటికి ఆస్తి హక్కుని కూడా ప్రసాదించింది. ఆర్టికల్ 350(a) భాషా పరమైన అల్పసంఖ్యాక సమూహాలకు సంబంధించిన పిల్లలకు వారి మాతృ భాషలోనే ప్రాథమిక స్థాయిలో విద్య ఉండేటట్లు కావలసిన సదుపాయాలు కలిగించేందుకు ప్రతి రాష్ట్రం, ప్రతి స్థానిక పాలనావ్యవస్థ ప్రయత్నించాలని నిర్దేశించింది. అట్టి సదుపాయాలు ఏర్పడేందుకు అవసరమైన, యోగ్యమైన ఆదేశాలు రాష్ట్రపతి ఏ రాష్ట్రానికైనా జారీ చెయ్యవచ్చు. ఆ ప్రకారంగా రాజ్యాంగం లోని ఆర్టికల్స్ 30 మరియు 350(a) నిబంధనల దృష్ట్యా అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలను ఇంగ్లీషు మాధ్యమంలోకి నిర్బంధంగా మార్చుతూ ఈ ఆక్షేపణకు గురైన జీవో ద్వారా ఉత్తర్వులు ఇవ్వడం భారత రాజ్యాంగం ఆర్టికల్ 30, మరియు 350(a) ఆర్టికల్స్‌ను పూర్తిగా ఉల్లంఘించినట్లే.

**84.** పైన పేర్కొన్న చర్చ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో విద్యాహక్కు చట్టం, సెక్షన్ నం. 29(2), 1982 నాటి చట్టం సెక్షన్లు 7(3),7(4), కేంద్ర రూల్స్ 8,23, రాష్ట్ర రూల్స్ 25లలోని నిబంధనలను ఉల్లంఘించింది. వాస్తవానికి ఆక్షేపణకు గురైన ఆ జీవో కేవలం ప్రభుత్వ ఉత్తర్వు మాత్రమే. కాని, దానిని కూడా కార్యనిర్వహణ ఆదేశాలుగా తీసుకున్నప్పటికి సర్వోన్నత న్యాయస్థానం, **స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ అండ్**

**అదర్స్** Vs **జీఏస్ డాల్స్ అండ్ ఫ్లోర్ మిల్స్ కేసులో** సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న న్యాయం ప్రకారము ఇవి నిలబడవు. ఆ కేసులో కార్య నిర్వాహక ఆదేశాలు. చట్టానికి అనుబంధంగానూ, చట్టం వర్తింప చెయ్యలేని చోట మాత్రమే వర్తిస్తాయని. కానీ, చట్ట నిబంధనలకు వ్యతిరేకంగానూ, లేదా చట్ట ప్రభావాన్ని తగ్గించేది గాను ఉండరాదని, సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆ తీర్పులో ఏర్పడిన న్యాయాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు సదరు ఆక్షేపణకు గురైన జీవో, కార్య నిర్వాహక ఆదేశాలుగా తీసుకున్నా, చట్టాల రూల్స్‌లోని నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నదని నిర్ణయించవచ్చు.

**85.** **54** వ పేరాగ్రాఫ్‌లో చేసిన చర్చ దృష్ట్యా విద్యా హక్కు చట్టం సెక్షన్ **21,** కేంద్ర రూల్స్ **3,**మరియు **4** ఇంకా రాష్ట్ర ప్రభుత్వ రూల్ **19** నందు తల్లితండ్రుల అసోసియేషన్ బాధ్యతలు వర్గీకరింపబడి ఉన్నాయి అన్నది స్పష్టం. ఆ నిబంధనల ప్రకారం బోధన మాధ్యమం మార్చమని సిఫార్సు చేసే బాధ్యత తల్లితండ్రుల అసోసియేషన్‌ది కాదు. కౌంటర్ అఫిడవిట్ ప్రకారం ప్రభుత్వం ప్రకారం తల్లితండ్రుల అసోసియేషన్ ఆశయాలపై ఆధారపడి ఇంగ్లీష్ మీడియం వైపు మొగ్గు చూపి వారి కోరికను మన్నించినట్టుగా తెలుస్తోంది. దీనికి మద్దతుగానే **07-01-2020** నాటికి తల్లితండ్రుల అసోసియేషన్ నిర్ణయానంతర ధృవీకరణకు సంబంధించిన తీర్మానాన్ని సమర్పించారు. **54** పేరాలో చర్చించినట్టుగా ఇది చట్టంలో తల్లితండ్రుల అసోసియేషన్ - మేనేజ్మెంట్ కమిటీ బాధ్యత కానప్పుడు, సదరు అసోసియేషన్ - స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా చేసిన సిఫార్సు ఆమోదయోగ్యం కాదు. అందువల్ల ఈ

డేటాను ఆధారంగా చూపించి చేస్తున్న ప్రతివాదన ఈ విషయానికి అనుగుణంగా లేనట్లే.

**86.** రాష్ట్రంలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు అధ్యయనం చేసి కావలసిన సంస్కరణలు సిఫార్సు చేసేందుకు ఏర్పడిన ఎన్. బాలకృష్ణన్ కమిటీ నివేదిక కానీ, జస్టిస్ ఆర్. కాంతారావు నాయకత్వంలో ఉన్న రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ నివేదిక కానీ, కౌంటర్ అఫిడవిట్ లో పేర్కొన్న విధంగా అందలేదు. సదరు నివేదికలు లేనప్పుడు ప్రతివాదుల వాదన ఆమోదయోగ్యం కానందువలన వాదనను త్రోసిపుచ్చడమైనది.

**87.** ప్రస్తుతానికి వస్తే, తెలుగు నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలోనికి మారడం బోధన మాధ్యమానికి పేదలకు అనుకూలమని, షెడ్యూల్డ్ కులాలకు అనుకూలమని రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాదన అర్థాన్వయంలో సూత్రీకరించినట్టుగా GOMS. No. **76** తేదీ:**10-6-2008,** GOMS No. **78** తేదీ **5-10-2017** ప్రకారము రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పాఠశాలలలో తెలుగు మీడియం మరియు ఇంగ్లీష్ మీడియం సమాంతరంగా నడుస్తున్నాయి. **20-11-2019** న ఈ ఆక్షేపణకు గురవుతున్న జీవో జారీ చెయ్యడానికి ముందు సమాంతరంగా ఒకటవ తరగతి నుంచి ఇంగ్లీష్ మీడియం నడపబడుతున్నది అని, ఇటు పిల్లవాడికి కానీ, తల్లితండ్రులకు గాని, ఇంగ్లీష్ మీడియం లేదా తెలుగు మీడియంలో ప్రవేశం పొందేందుకు వీలుగా వారు ఎంచుకోవడానికి వెసులుబాటు ఉంది. అందువల్ల మధ్యలో జోక్యం చేసుకునే వారు లేదా రాష్ట్ర ప్రభుత్వం

రాజ్యాంగం 46 ఆర్టికల్ క్రింద తీసుకున్న వాదన వారికి ఉపయోగపడదు, అందువల్ల ఈ వాదన త్రోసిపుచ్చడమైనది.

**88.** ప్రభుత్వం ముందుకు తెచ్చిన ఇంకొక వాదం బోధన మాధ్యమంగా మార్పుతో తెలుగును నిర్బంధ పాఠ్యాంశంగా చెయ్యడం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రముఖంగా గుర్తించబడిన భాషగా ఉన్న తెలుగు యొక్క మాన్యత తగ్గదని పేర్కొన్నది. ప్రతి మండలంలో ఒక తెలుగు మాధ్యమ పాఠశాల కొనసాగుతుందని, అట్టి పాఠశాల విద్యాహక్కు చట్టనిర్వహణరీత్యా ఇరుగుపొరుగులో లేని పక్షంలో పిల్లలకు ఉచిత రవాణా సదుపాయాలు కావాలని కోరుకున్నవారికి ప్రభుత్వం కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నది. ఇంతకు ముందే చర్చించినట్లుగా పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమంగా మార్చడం, జిల్లాలో ప్రతి మండలంలో ఒక పాఠశాలను నడపడం విద్యా హక్కు చట్ట నిబంధనలకు సరితూగవు - సంతృప్తి పరిచినట్లు కాదు. అందువల్ల ఆ వాదనను కూడా తోసిపుచ్చడమైనది.

**89.** పౌరులను విద్యావంతులను చేసే చరిత్ర పాఠశాలల్లో మదర్సాలల్లో ఆరంభమైనది. బ్రిటిష్వారి ఘనకీర్తిని పెంచేందుకు క్రైస్తవ మిషనరీల వ్యవస్థ ద్వారా విద్యలో ఇంగ్లీష్ మాధ్యమం ప్రాధాన్యతను పెంచుతున్న విధానం తీసుకువచ్చారు. భారత దేశ చరిత్రలో 1853 వ సంవత్సరం లో ప్రాంతీయ భాష విద్య ప్రాముఖ్యం పెరిగింది. ఆ తరువాత 1882లో విల్సన్ హంటర్స్ సిఫార్సుల ప్రకారము ప్రాథమిక స్థాయిలో స్థానిక భాషలోనే ప్రాథమిక విద్య గుర్తించబడింది. ఏమైతేనేమి బాలగంగాధర్ తిలక్ సంస్కరణలద్వారా ప్రాథమిక విద్యకు సంబం

ధించిన కొన్ని విద్యాసంస్థలు స్థాపించడం, వాటిలో స్థానిక భాషలని గుర్తించడం జరిగింది. సదరు ప్రయత్నాలు 1911లో గోపాల కృష్ణ గోఖలేచే స్థానిక భాషకు ప్రాధాన్యం ఇస్తూ మరింత వైభవీకరించబడ్డాయి. ఆ తరువాత, నయీ తలీమ్ స్థానే 7-11 సంవత్సరాల మధ్యన ఉన్న పిల్లలందరూ మాతృభాషలోనే నిర్బంధంగా చదువుకోవాలని 1936-37 లో వుడ్ అబట్ నివేదికలో సిఫార్సులు చేయబడినాయి. స్వామి వివేకానంద మాతృభాషలో గ్రహించడం వలన మెరుగైన ఫలితాలు వస్తాయని చదువు తన సొంత భాషలోనే ఉండాలని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ప్రతి బిడ్డ తన తల్లి నుంచి మొదటి పాఠాలు నేర్చుకుంటాడని అందువలన ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమం ఇతర భాషల్లోకి మార్చడం మాతృభాషకు అపచారం అన్నారు. రవీంద్రనాథ ఠాగూర్, సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రాథమిక స్థాయిలో విద్య, మాతృ భాష-దేశీయ భాష-స్థానిక భాషలో ఉండాలని మరియు తదనంతర విద్య ఇంగ్లీషు మీడియం మరియు ఇతర భాషల్లో ఉండాలని పేర్కొన్నారు.

**90.** స్వాతంత్ర్య అనంతర యుగం కూడా ఇదే దృక్పథంతోనే ప్రభావితం అవుతూ వచ్చింది. 1955 రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్ రిపోర్ట్ లో కూడా ప్రాథమికవిద్య దశలో మాతృ భాష-ప్రాంతీయ - స్థానిక భాషలోనే ఉండాలని సిఫార్సు చేసింది. భారతీయ భాషల్లో పౌరుల అభివృద్ధిని గురించి నొక్కి చెబుతూ, 1968 జాతీయ విధానం రూపకల్పన చెయ్యబడింది. అది సాంస్కృతిక మరియు విద్యాపరమైన అభివృద్ధికి ముఖ్యసూత్రం. త్రిభాషా సూత్రం తీసుకువచ్చారు. అది ప్రయోగించిన చోటల్లా విజయవంతమైంది. మాతృభాష లేదా ప్రాంతీయ భాషలు బోధన

మాధ్యమంగా ఉండాలని అవి పౌరుడి సర్వతోముఖాభివృద్ధిలో ప్రతిఫలిస్తాయని, యునెస్కో సిఫార్సులు, జాతీయ ప్రణాళికా చట్రం, NCF లు దీన్ని సమర్ధించాయి. అందువల్ల భారతదేశంలో త్రిభాషా సూత్రము, మార్పు చెయ్యబడిన త్రిభాషా సూత్రము వాడుకలో ఉన్నాయి. ఆ విధానాల ప్రకారం దేశంలో విద్యా విధాన అనుసారం ప్రాథమిక స్థాయిలో బోధన మాధ్యమంగా అమలు చేస్తున్నాము.

**91.** పునరుక్తి అయినప్పటికీ ప్రాంతీయ భాష - మాతృభాషగా తెలుగు యొక్క అభివృద్ధికి ఘన చరిత్ర ఉందని తిరిగి పేర్కొనడం సమంజసం అని భావిస్తున్నాం. అది **11**వ శతాబ్దంలో ఆరంభం అయ్యింది. ఇంతకు ముందు **35,36** పేరాల్లో చెప్పినట్టు నన్నయ్య నుంచి గిడుగు రామ్మూర్తి గారి ఉద్యమాలు, ఆంధ్ర విశ్వకళాపరిషత్, నవ్య సాహిత్య పరిషత్ స్థాపనలతో తెలుగు సాహిత్య వారసత్వం వర్ధిల్లింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత **28-12-1966**లో జే. పి. ఎల్. గ్విన్ అధ్యక్షతన తెలుగు భాష అభివృద్ధికి ఒక కమిటీ ఏర్పాటు చెయ్యబడింది. వాటి ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికార భాషా సంఘం, తెలుగు అకాడెమి (చట్టబద్ధమైన సంస్థ) ఏర్పాటు అయ్యాయి. ఆ సిఫార్సుల ఆధారంగా ప్రాథమిక విద్య మరియు ఉన్నత విద్యలలో బోధన మాధ్యమంగా తెలుగును ఆరంభించారు. అదే ఇప్పుడు వాడుకలో ఉంది. స్వాతంత్ర్య పూర్వ యుగం నుంచి స్వాతంత్ర్య అనంతరం దాకా పరిగణిస్తే తెలుగును బోధన మాధ్యమంగా అమలు చెయ్యడం గత **50** సంవత్సరాల పైబడి కొనసాగుతూ ప్రాథమిక స్థాయిలో మాతృభాషగా-బోధన భాషగా గుర్తించబడుతూ వచ్చింది. హఠాత్పరిణామంగా, ఏ ఆధారం లేకుండా

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంత సమర్ధనీయం అనేది విద్యావేత్తలకు, విద్యా హక్కు చట్టం కింద ఉన్న 1982 చట్టం కింద ఉన్న, అకెడమిక్ అథారిటీలకు, మరియు కాంపిటెంట్ అథారిటీలకు సంబంధించిన విషయమే, కానీ ఇప్పటికీ చర్చించినట్టు రాష్ట్ర ప్రభుత్వం ఏ ఆధారం లేకుండా జీవో జారీ చెయ్యడం, వారి స్వబుద్ధితో ఆలోచన చేయకపోవడాన్ని ప్రతిబింబిస్తుంది అని కోర్టు వారి అభిప్రాయం.

**92.** పైన పేర్కొన్న చర్చ వెలుగులో, స్వతంత్ర పూర్వ మరియు స్వతంత్ర అనంతర చరిత్ర చూసినప్పుడు **1955** నాటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్ సిఫార్సుల నివేదిక ప్రకారం, **1968** నాటి జాతీయ విద్యా విధాన చట్టం ప్రకారం మరియు అనేక నివేదికల ప్రకారం, పాఠశాల విద్య I నుంచి VIII తరగతుల వరకు బోధన మాధ్యమం మాతృ భాషలోనే ఉండాలని, సంశయాతీతంగా గుర్తించబడింది. విద్యా హక్కు చట్టం స్ఫూర్తికి, రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో ఇవ్వడం ద్వారా, **1968** నాటి జాతీయ విద్యా విధానం మరియు ఇతర నివేదికల ప్రభావాన్ని తగ్గించలేదు. అందువల్ల I నుంచి VIII లేదా I నుంచి VIII తరగతులను (ఏవైతే అవి) తెలుగు నుంచి ఇంగ్లీష్ మాధ్యమంలోకి మూకుమ్మడిగా మార్పు చెయ్యడం జాతీయ విద్యా హక్కుల చట్టం **1968** మరియు అనేక ఇతర నివేదికలకు విరుద్ధం. అందువల్ల దానిని అంగీకరించలేక పోతున్నాము. అందువల్ల ఆక్షేపణీయమైన ఈ జీవో రద్దు చేయదగినట్టిది.

**93.** GOMs.No. **85**, తేదీ **20-11-2019** అనేక రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తికి విరుద్ధం మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ

అసంగతం, సమ్మతింపబడనిది. అందువల్ల అట్టి జీవోని ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారం దఖలు పడలేదని, పైన చేసిన చర్చ దృష్ట్యా తప్పించుకొనజాలని నిర్ణయానికి రావడమైనది.

**94.** ఫలితంగా GOMs.No.81, తేదీ 5-11-2019 పాఠశాల విద్య (ప్రోగ్రాం I) శాఖ, GOMs.No.85, తేదీ 20-11-2019 పాఠశాల విద్యా (ప్రోగ్రాం I) శాఖలు రద్దు చెయ్యబడి రిట్ పిటీషన్లు అనుమతించ బడినాయి. కేసు యొక్క వాస్తవాలు మరియు పరిస్థితుల రీత్యా పార్టీలు వారి ఖర్చు వారే భరించుకోవాలి. ఆ క్రమంలో ఇతర మిసిలేనియస్ పిటీషన్లు ముగిసినట్లే.

**(జె.కె.మహేశ్వరి)**
ప్రధాన న్యాయమూర్తి

**(నైనాల జయసూర్య)**
న్యాయమూర్తి

# చిన్నా నన్ను మన్నించు!

డబ్ల్యూ లివింగ్‌స్టన్ లార్నెడ్ రాసిన ఈ ఉత్తరం వేలాదిమంది తల్లితండ్రులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ అంతర్మథనాన్ని చదివి తల్లితండ్రులు తమ పిల్లల ప్రవర్తనకు ఎలా ప్రతిస్పందించాలో ఒక్కసారి ఆలోచించండి. . .

చిన్నా! నీ విషయంలో ఎంత తప్పు చేశానో తలచుకుంటే మనస్సు మెలిపెట్టినట్లనిపిస్తోంది. ఎదురుగా నువ్వు నిలబడినప్పుడు ఎలాగూ నా మాటను నీతో చెప్పలేను. అందుకే ఇలా మంచంపై, చెయ్యి బుగ్గ కింద పెట్టుకొని నిశ్చింతగా నువ్వు నిద్రపోతున్నప్పుడు నా మనస్సులో మాటను చెప్పుకొనేందుకు ఇలా, ఒంటరిగా నీ గదిలోకి వచ్చా. ముందు నా అపరాధాన్ని మన్నించు. చిన్నా! నాన్న అనే పెద్దరికంతో నీలో తప్పులు వెదుకుతూ, ఎంత కర్కశంగా ప్రవర్తిస్తున్నానో గుర్తొచ్చి బాధ వేస్తోంది. ఒక పసివాడి నుంచి అతిగా ఆశించాను; నా వయస్సును కొలమానంగా తీసుకొని, నువ్వు ఎలా ఉండాలో అంచనా వేయసాగాను; ఆంక్షలు విధించసాగాను, బడికి వెళ్లడానికి ముస్తాబవుతూ, తువ్వాలుతో ముఖాన్ని పైపైన తుడుచుకున్నావని కోపగించాను. కాలిజోళ్లు శుభ్రం చేసుకోలేదని నానా మాటలు అన్నాను. నీ వస్తువులన్నీ నేలమీద పడేశావని కోపంగా అరిచాను.

చివరకు అన్నం తినేటప్పుడు కూడా మరీ ఎక్కువ చనువు తీసుకున్నాను. నీళ్ళు ఒలకబోశావనీ, సరిగ్గా నమలకుండా తింటున్నావనీ, మోచేతులు బల్లకు ఆనించావనీ, కూరలు సరిగ్గా కలుపుకోవడం లేదనీ,

మెతుకులు కింద పడేస్తున్నావనీ. . . ఇలా అన్నింటిలో తప్పులెంచాను. నేను అంత కసురుకుంటున్నా, బడికి వెళుతూ నువ్వు వెనక్కి తిరిగి చెయ్యి ఊపుతూ "నాన్నా! వెళ్లొస్తా!" అంటూ చిరునవ్వుతో కూడిన నా ప్రతిస్పందన కోసం ఎదురుచూశావు. అప్పుడు కూడా నేను ముఖం చిట్లించి "నీ బ్యాగు జాగ్రత్త. త్వరగా వెళ్లు'' అంటూ నిర్లక్ష్యంగా స్పందించాను.

సాయంత్రం ఇంటి కొచ్చాక - మళ్ళీ మొదలు! నేను ఆఫీసు నుంచి ఇంట్లోకి వస్తూ నువ్వేం చేస్తున్నావోనని రహస్యంగా గమనించాను. నువ్వేమో మోకాళ్ళ మీద కూర్చొని గోలీలు ఆడుకుంటున్నావు. బట్టలన్నీ మాసిపోయి ఉన్నాయి. వెంటనే మళ్ళీ నాకు కోపమొచ్చింది. ఇంటికి పొమ్మని కటువుగా హెచ్చరిస్తూ నీ స్నేహితుల ముందే నిన్ను అవమానించాను. సమయమంతా వృథా చేస్తున్నావని కసురుకున్నాను. ఒక నాన్న అనవలసిన మాటలేనా ఇవి!

నీకు జ్ఞాపకం ఉందా! నేను నా గదిలో కూర్చొని, ఆఫీసు ఫైళ్ళు తిరగేస్తుంటే, నువ్వు భయం భయంగా నా దగ్గరకు వచ్చావు. నీ కళ్ళల్లో బాధ కొట్టొచ్చినట్లు కనిపించింది. నా పనికి అడ్డొచ్చావని విసుగ్గా నేను తలపైకెత్తి నీ వంక చూశాను. నువ్వు తలుపుదగ్గరే ఆగిపోయావు. 'ఏం కావాలి నీకు?' అని కర్కశంగా అడిగాను. నువ్వేమీ జవాబు చెప్పలేదు. కానీ ఒక్క అంగలో నన్ను చేరుకొని, నా మెడ చుట్టూ చేతులు వేసి ముద్దు పెట్టుకున్నావు. నీ చిన్ని చేతులు నా మెడను గట్టిగా వాటేసు కున్నాయి. నీ చిన్ని గుండెలో దేవుడు నింపిన ఆ ప్రేమ నేనెంతగా కోప్పడినా వాడిపోనేలేదు. కొద్దిసేపట్లో నా చేతిలోని ఫైలు జారి కిందపడింది. ఒక్కసారిగా బెదిరిపోయావు నువ్వు. నీపై శివాలెత్తినట్లు అరిచాను.

అలవాటనేది అలా మార్చేసింది నన్ను! తప్పు పట్టడమనే అలవాటు, తిట్టడమనే అలావాటు! నువ్వు ఆప్యాయంగా అల్లుకున్నందుకు ఇదా నేను నీకిచ్చిన బహుమతి?

నాకు నీ మీద ప్రేమ లేక కాదు; కానీ ఫీజులు కట్టేదగ్గర, వస్తువులు కొనిచ్చే దగ్గర తప్ప ఈ చిన్న చిన్న విషయాల్లో ఎలా ప్రవర్తించాలో, ప్రతిస్పందించాలో నాన్నగా నేను తెలుసుకోలేకపోతున్నాను! నీ చిన్ని గుండెలో ఉన్న ప్రేమ కొండల వెనుక నుంచి తొంగి చూసే ఉదయమంత విశాలమైంది. ఇంత జరిగినా, నువ్వు ఎంతో సహజంగా పరుగెత్తుకొని నా దగ్గరకొచ్చి, నన్ను ముద్దు పెట్టుకొని, 'గుడ్‌నైట్' చెప్పడంలోనే, నీ ప్రేమ ఎంత గొప్పదో తెలిసింది. ఈ రాత్రికి ఇంతకన్నా నాకేమీ అక్కరలేదు. నేనీ చీకట్లో నీ మంచం దగ్గరకొచ్చి సిగ్గుతో తలదించుకుంటున్నాను.

ఇది ఇలా చిన్న ప్రాయశ్చిత్తం. నువ్వు మేలుకొని ఉండగా నేను ఇవన్నీ నీతో చెప్పలేను. కానీ రేపు నేను నీకు నిజమైన నాన్నగా కనిపిస్తాను! నీతో స్నేహితునిలా ప్రవర్తిస్తాను. నువ్వు బాధపడితే నేను బాధపడతాను; నీ చిన్న చిన్న ఆనందాల్లో నేనూ భాగస్వామినవుతాను. నా ఓర్పు నశించి నిన్ను ఏదైనా అనాలనిపిస్తే, ఏదో మంత్రం వల్లించినట్లు "వీడు చాలా చిన్న పిల్లవాడు'' అని నన్ను నేను సమాధానపరచుకుంటాను. చిన్నా. . నేను నీ నుంచి మరీ ఎక్కువగా ఆశించాను. . . నన్ను మన్నించు!

అప్పటివరకు అమ్మ ఒడిలో నాన్న కౌగిట్లో గారాలు పోతూ నవ్వుతూ నవ్విస్తూ
తుళ్ళుతూ కేరింతలు కొడుతూ ఉన్న బాలలకు
బడి ఓ కొత్త ప్రపంచం
అది కూడా ఇంటి లాగే ఉంటే –
బడి అంటే భయం ఉండదు
బడి గడపలోకి అడుగుపెట్టగానే
పిల్లల ఆలోచనలు, కలలు మరింత విస్తరించేలా ఉండాలి
ఇది ఇలా జరగాలంటే
విద్యార్థి తొలినాళ్ళ
పాఠశాల ప్రపంచం
మాతృభాషలోనే ఉండాలి
ఇది నిరూపణ అక్కరలేని శాశ్వత సత్యం
అప్పుడు బడి
పిల్లవాడికి
చెరసాలలా కాకుండా
బొమ్మరిల్లులా ఉంటుంది
విద్యార్థి ఎప్పుడు నాన్న చిటికెన వేలు వదలి
ఉపాధ్యాయుడి చెయ్యి పట్టుకున్నాడో
విద్యార్థికే తెలియనంత సహజంగా
పాఠశాల ప్రవేశం జరగాలి
కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి
కొత్త కొత్త విషయాలు నేర్చుకోవడానికి
ఉపాధ్యాయుడు ఒక వాహిక మాత్రమే!
బోధన అందులో ఒక భాగం మాత్రమే

భాష – వీటన్నిటిలో
పూలమాలలో దారంలా
కనిపించకుండా
అన్నిటినీ కట్టిపడేసే ఓ బంధం
ఆ భాషా తంతువు
విచ్ఛిన్నం కాకుండా
చూసుకోవాల్సిన బాధ్యత
మన అందరి మీద ఉంది.

భాషావరణం దెబ్బతింటే
ఆ జాతి సంస్కృతి, చరిత్ర, నాగరికత
వారసత్వ సంపద, కళలు, ఆచారాలు, సంప్రదాయాలు, సాహిత్యం... అన్నీ
దెబ్బ తిన్నట్లే!
తస్మాత్ జాగ్రత్త
ఉత్తిష్ఠ! జాగృత!

భాష కూడా భగవంతుడి లాంటిదే.
అది సర్వాంతర్యామి.
సమాజంలోని అన్ని క్షేత్రాలలో చొచ్చుకొని పోయి ఉంటుంది.
దేని నుంచి దానిని విడదీయడం అసాధ్యం.
అందువల్ల భాషకు అన్యాయం జరిగితే
సమాజంలో ప్రతి క్షేత్రానికి అన్యాయం జరిగినట్లే!

భాష విషయంలో జాగరూకత, అప్రమత్తత అత్యవసరం.
దురదృష్టవశాత్తు ఈ విషయంలో మన రాష్ట్రం అవతరించినప్పటినుండి హ్రస్వదృష్టినే ప్రదర్శిస్తూ వచ్చాం.
మనకు నిజాయితీతో కూడిన భాషా దృక్పథం లేకపోవడం వల్ల ఇప్పటివరకు చాలా కోల్పోయాం.
ఇటీవలి కాలంలో భాషా వరణానికి మరిన్ని తూట్లు పడ్డాయి.

ఇల్లే సమస్తంగా అప్పటిదాకా గడిపిన
పిల్లలకి
ఆటా- పాటా, మాటా-మంచీ
అన్నీ మాతృభాషలోనే ఉంటాయి.
బడికెళ్ళేది చదువుకోవడం కోసం.
చదువుకోవడం అంటే నేర్చుకోవడం అవదా సారాంశంగా!
నేర్చుకోవడం పసివాడికి తెలిసిన భాషలో అయితే
ఎంత స్వేచ్ఛగా, హాయిగా ఎదుగుతాడో!
అన్నిటికీ మాతృభాషే కదా పునాది అంటుంది ఉన్నత న్యాయస్థానం తన పరిణత వాక్కుతో!

ఇకనైనా కళ్లు తెరవమని హెచ్చరికలు చేసింది

తన నిర్ణయాన్ని స్పష్టంగా తీర్పు రూపంలో వెలువరించింది.
భాషకు సంబంధించిన అనేక అంశాలను వాటి ఆనుపానులను
రాజ్యాంగం, చరిత్ర, మహనీయుల ఆలోచనలు, విద్యావేత్తల తత్వధార వీటన్నిటి వెలుగులో పరిశీలించింది.
భాష.. భావోద్వేగాలకు, అభిమానాలకు మాత్రమే పరిమితమైన విషయం కాదని స్పష్టం చేసింది.
అదొక నిత్యావసర విషయమని చెప్పింది.

ఆ తీర్పుకు తేట తెలుగు అనువాదమే ఈ గ్రంథం.
సమాజపురోగతిని నిర్ణయించే మూలధనంగా మాతృభాషని అభిమానించే మనందరం
ఈ తీర్పును క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుందాం!
చర్చించుకుందాం!
మనకు ఏది హితమో దాన్నే అనుసరిద్దాం!
తద్వారా
మన పిల్లల భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దు కుందాం.
వాళ్ళ కలల ప్రపంచాన్ని
వారికి రాసిద్దాం!